www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 04 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి కార్తిక బహుళ తదియ
18-24 నవంబర్ 2024
వెల : ₹20/-



# స్వర్ణయుగం తెస్తాను!

అమెరికాకే తొలి ప్రాధాన్యం అన్న నినాదంతో ఆయన ఎన్నికల ఫలితాలను తనకు అనుకూలంగా మలుచుకుని 47వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


ASWINI
మీ జుట్టు రాలటం మరియు చుండ్రులను నియంత్రించటం...
మాకు ఛాలెంజ్
కుమారి శ్రీలత గారు ఎంతో కాలంగా జుట్టు రాలే సమస్యతో బాధ పడుతుండేవారు. ఆమె చాలా ప్రొడక్టులు వాడారు కానీ ఏ ఫలితమూ కనిపించలేదు. చివరకు ఆమె అశ్వినీవారి జుట్టు రాలడాన్ని నియంత్రించడం అనే ఛాలెంజ్‌ను స్వీకరించారు. మరి ఫలితం...
అశ్వినీ వాడినాక చుండ్రు ఇంకా జుట్టు రాలడం, మునుపటికంటే బాగా తగ్గింది...*
కుమారి శ్రీలత,
మెదక్, తెలంగాణ.
అశ్విని®
హోమియో ఆర్నిక హెయిర్ ఆయిల్
Only pure cocnut oil base
No mineral oil used
No preservative added
ASWINI
HAIR OIL
*Consumer's personal opinion
Customer Care Executive (Toll free) 1-800-8435599
customercare@aswini.com | www.aswini.com

# దీపావళి నుండి సంక్రాంతి వరకు

## జాగృతి కానుక !

త్వరపడండి..

**సంవత్సర చందా రూ. 750/-**

**ఐదు సంవత్సరాల చందా రూ. 3500/-**

సంఘ శతాబ్దిలో ఇంటింటా జాగృతి పత్రికను పంపి
హిందుత్వ జాగరణ చేయడం ద్వారా
జాతీయ భావనను బలోపేతం చేద్దాం!
జాగృతి చందాదారులుగా చేర్పించడంలో మనవంతు కృషి చేద్దాం!!

సంవత్సర చందా రూ. 750/-
http://payit.cc/S18970

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

5 సం.రాల చందా రూ. 3500/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1374/-
https://payit.cc/S32796

**Jagriti Bank A/c details**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad. IFSC : UTIB0002157,

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ :
040-2756 1453
99599 97013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.3500** **సంవత్సర చందా రూ.750**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 10న ముంబైలో తాజాగా ప్రకటించారు. శాసనసభ ఎన్నికల వేళ బీజేపీ ప్రణాళికను విడుదల చేస్తూ అమిత్ షా ఈ విషయం పునరుద్ఘాటించారు. 2013లో కాంగ్రెస్ తెచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించే ఉద్దేశంతో ప్రవేశపెడుతున్న ఈ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమావేశాలలోనే ఆమోదింప చేస్తారని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. కనిపించిన ఆస్తినల్లా తమదే అంటూ ప్రకటించుకుంటున్న వక్ఫ్ బోర్డులు (దాదాపు 30), ముస్లిం సంఘాలు బిల్లును ఉపసంహరించకుంటే రోడ్డెక్కుతామనీ, పార్లమెంటును ముట్టడిస్తామనీ బెదిరింపులకు దిగుతున్నాయి. నవంబర్ 24న చలో పార్లమెంట్ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. ఈ 25 నుంచి శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

ఈ సవరణ బిల్లు ప్రయత్నాలను విపక్షం వివాదం చేస్తుందని అందరికీ తెలుసు. చేయకపోతేనే వార్త. ఈ బిల్లును ప్రతిపాదించిన దరిమిలా కర్ణాటకలో జరిగిన పరిణామాలను కూడా కేంద్ర హోంమంత్రి గుర్తు చేశారు. వక్ఫ్ చట్టానికి సవరణ దేశ సమైక్యతకు సంబంధించినది. ముస్లింలలో కూడా ఈ సవరణకు ఆమోదం ఉంది. సవరణ అవసరాన్ని, దాని వెనుక ఉన్న వందల కారణాలను దృష్టిలో ఉంచుకునే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతున్నది.

దేశం ఎంతటి సంక్షోభంలోకి వెళుతున్నా అవసరం లేదు. బుజ్జగింపు ధోరణలతోనే ఓట్లు రాలాలనీ, అధికారం రావాలనీ కోరుకుంటున్న కూటమి మహా వికాస్ అగాడీ. ఇలాంటి కూటములతోను, వక్ఫ్ బోర్డును అడ్డం పెట్టుకుని ముస్లిం వర్గాలు మిగిలిన అన్ని వర్గాలను అతలాకుతలం చేస్తున్నాయి. వక్ఫ్ చట్ట సవరణ నేపథ్యంలో బీజేపీ మీద మరింత ఆగ్రహంతో ఉన్న ముస్లిం వర్గాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని మహా వికాస్ అగాడీ లేదా కాంగ్రెస్, ఎన్‌సీపీ (పవార్) భావించడమే జుగుప్సాకరం. ఈ రెండు పార్టీలకు అధికార యావ తప్ప మరొకటి లేదు. మరి శివసేన (యూబీటీ)కి ఏమైంది? ఉద్ధవ్ నాయకత్వంలోని శివసేన ఆ రెండు పార్టీలకు వంత పాడుతూ బాల్ ఠాక్రే ఆశయానికీ, ఆత్మకీ మహాపచారం చేయడం లేదా?

**శాలివాహన 1946 శ్రీ క్రోధి కార్తిక బహుళ తదియ**

## లోపలి పేజీలలో...




6లో
ముఖపత్ర కథనం
**స్వర్ణయుగం తెస్తాను!**

కొత్త ధారావాహిక నవల
**తూర్పు-పడమర**
– గన్నవరపు నరసింహమూర్తి
20లో



లింబాద్రి గుట్ట
**దక్షిణాది నరనారాయణ క్షేత్రం**
26లో



# జాగృతి

## సంపాదకీయం

వక్ఫ్ చట్టసవరణ బిల్లును త్వరలోనే పార్లమెంట్ ఆమోదిస్తుందని కేంద్ర మంత్రి, కేరళ బీజేపీ ప్రముఖుడు సురేశ్ గోపీ నవంబర్ 11న ప్రకటించి తమ పార్టీ నిబద్ధతను వెల్లడించారు. ఈ మాట ఎక్కడ చెప్పాలో అక్కడే చెప్పారాయన. వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక ప్రచారంలో గోపీ ఈ సంగతి చెప్పారు. కేరళలోని కొచ్చిన్‌కు సమీపంలోని మూనాంబమ్ గ్రామంలో 400 ఎకరాలు వక్ఫ్‌కు చెందుతాయని ఇటీవల వెలువడిన ప్రకటన దాదాపు 600 క్రైస్తవ కుటుంబాలను తీవ్ర కలవరానికి గురిచేసింది. ఈ చర్యను ఒక కిరాతక చర్యగా ప్రకటించిన మంత్రి, ఇలాంటి కిరాతకాలను దేశవ్యాప్తంగా

# విజయీభవ!

నిరోధించడానికే బిల్లును తెస్తున్నట్టు నిష్కర్షగా ప్రకటించారు. రేపు శబరిమల కూడా వక్ఫ్ తనదేనంటే అక్కడి నుంచి అయ్యప్పను తొలగించాలి. ఇది మనకి అంగీకారమా అంటూ ఆయన నేరుగానే ప్రశ్నించారు. ఇదే సమస్య వేలాంకన్ని చర్చ్‌కు కూడా ఎదురుకావచ్చుననీ, ఇలాంటి కిరాతకాలను ఆమోదించడం సాధ్యం కాదనీ ఆయన కరాకండీగా చెప్పారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికీ, చెలక్కర, పాలక్కాడ్ శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగబోతున్న తరుణంలో వక్ఫ్ బోర్డు ఈ తెంపరితనానికి దిగడం ఆశ్చర్యం కలిగించేది కాదు. ఎందుకంటే తమను ఏ పార్టీలు మోస్తున్నాయన్నది వాటికి ముఖ్యం కాదు. వక్ఫ్ చట్టాన్ని సవరించాలన్న కేంద్రం ప్రయత్నాన్ని భగ్నం చేస్తే చాలు. అందుకు ఘర్షణలు రేపితే చాలు.

ఉత్తరప్రదేశ్ వివాదాస్పద ముస్లిం మత గురువు తౌకీర్ రజా ప్రకటనలు మరింత రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి. వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఎట్టి పరిస్థితులలో ఆమోదించనివ్వబోమని హెచ్చరిస్తున్నాడు. దీనిని ఉపసంహరించు కోవాలని లేకుంటే ముస్లింలు వీధులలోకి వస్తారని, దానితో కేంద్రం గజగజలాడుతుందని బీరాలు పలికాడు. నవంబర్ 10న జైపూర్‌లో ముస్లిం పండితులు, మత పెద్దలు చేసిన హెచ్చరిక మరింత ప్రమాదకరమైనది. వక్ఫ్ చట్ట సవరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా నవంబర్ 24న చలో పార్లమెంట్ ప్రదర్శనకు పిలుపునిచ్చారు. ఆ మరునాడే సమావేశాలు ప్రారంభకానున్నాయి. ఈ నిర్ణయం తీసుకున్న సమావేశంలో వక్ఫ్ బోర్డు సభ్యులు, అజ్మీర్ దర్గా ప్రతినిధులు, వక్ఫ్ జేపీసీ సభ్యుడు, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మాసూద్ తదితరులు హాజరయ్యారు. మన ఇల్లు ప్రస్తుతం మంటలలో కాలిపోతున్నదంటూ మాసూద్ రెచ్చగొట్టే ప్రకటన కూడా చేశారు.

దేశంలో దాదాపు 30 వక్ఫ్ బోర్డులు ఉన్నాయి. ఇవి దాదాపు 9 లక్షల ఎకరాల భూములను రక్షిస్తున్నాయని చెబుతుంటాయి. వాటి విలువ రూ. 1.2 లక్షల కోట్లు. రైల్వేలు, రక్షణ మంత్రిత్వ శాఖ తరువాత ఇంత పెద్ద ఎత్తున ఆస్తులు ఉన్నది వక్ఫ్ బోర్డులకే. కానీ ముస్లింలే ఈ ఆస్తులు ఆక్రమించారన్న ఆరోపణలు లేకపోలేదు. వాటిని కాపాడుకుంటే అభ్యంతరం ఉండదు. కానీ కోర్టు ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాలు సహా ఎన్నో ఆస్తులు మావే అంటూ ఇటీవల వక్ఫ్ బోర్డులు దూకుడు పెంచి దేశాన్ని కల్లోల స్థాయికి తీసుకువెళుతున్నాయి. పార్లమెంట్ సమావేశమవుతున్నదంటే చాలు డీప్ స్టేట్ కుట్ర లేదా జార్జ్ సోరోస్ మనుషుల కుట్ర ఫలితంగా మొదటిరోజు ఒక గలభాకు రంగం సిద్ధం చేయడం ఇటీవలి పరిణామం. ఇది కూడా అలాంటిదే. అలాంటి ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీని నిలువరించలేకపోయారు. ఇప్పుడూ ఆపలేరు. దేశమంతా ఎదురు చూస్తున్న వక్ఫ్ సవరణ జరిగి తీరుతుందని ఆశిద్దాం. విజయీభవ. ★

18 నవంబర్ 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో


కథ

### జీవితం ముఖ్యం

– దాట్ల దేవదానం రాజు




జేకే కొత్త అసెంబ్లీలో పాక్ పాత అజెండా (జాతీయం) - 12
అధికారులపై దాడికి పర్యవసానం? (తెలంగాణ) - 14
అభివృద్ధి- సంక్షేమాలకు సమ ప్రాధాన్యం (ఆంధ్రప్రదేశ్) - 16
భగత్‌సింగ్‌లోను ముస్లిం వ్యతిరేకిని చూస్తున్నారు! (చరిత్రకు దగా) - 22
ముస్లిం దేశంలో జరిగే దారుణాల పట్ల.. (అంతర్జాతీయం) - 24
వికీపీడియా సమాచారం పక్షపాత పూరితం (వివక్ష) - 28
ఆ ఆలోచనల్లోంచి రూపుదిద్దుకున్నదే... (ముఖాముఖీ) - 30
స్వర్ణయుగానికి సమాధి కట్టినవి ముస్లింల దాడులే! (చరిత్ర) - 34
ప్రపంచ బిలియర్డ్స్ 'శిఖరం' పంకజ్ అద్వానీ (క్రీడ) - 43
రోమాంచిత వీరగాథ 'జితేందర్ రెడ్డి' (సినిమా) - 50



అమెరికా అధ్యక్షపీఠం మీద ఎవరు ఉన్నా, ప్రపంచ పరిణామాలను శాసిస్తారు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా అది అగ్రరాజ్యం. అటు గెలుపు ధీమాతోనే ఉన్నా, ఒక తీవ్ర ఉత్కంఠ మధ్య అమెరికా అధ్యక్ష పదవికి మరొకసారి ఎన్నికైన డొనాల్డ్ జాన్ ట్రంప్ నిజంగానే చరిత్ర సృష్టించారు. కొన్ని చీకటికోణాలు ఉన్నా శ్వేతసౌధాన్ని ఆయనకే అప్పగించాలని అమెరికా ప్రజలు నిశ్చయించారన్నది రూఢి అయింది. అమెరికాకే తొలి ప్రాధాన్యం అన్న నినాదంతో ఆయన ఎన్నికల ఫలితాలను తనకు అనుకూలంగా మలుచుకుని 47వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ పిలుపు వెనుక లోతైన

# స్వర్ణ

పరిణామాలనే ప్రపంచం చూస్తున్నది. మిత్రులు ‘డాన్’ అని పిలుచుకునే డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు స్వర్ణయుగం తెస్తానని విజయోత్సవంలో ప్రకటించారు. వ్యాపారవేత్త హృదయం ఉన్న ఈ రాజకీయవేత్త ప్రపంచ ఆర్థిక పరిణామాలను కొత్తదారులు తొక్కించడం నిశ్చయమన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఇప్పుడు ప్రపంచంలో జరుగుతున్న సంక్షోభాల అన్నింటి నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉన్న తన ప్రమేయాన్ని అమెరికా నియంత్రించు కుంటుందన్న అంచనాలు కూడా బలంగానే ఉన్నాయి. ఇదే పెద్ద పరిణామం. ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీ ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి మొదటి నుంచి వ్యతిరేకమే. తాము అధికారంలోకి వస్తే ఒక్కరోజులోనే ఆ యుద్ధాన్ని ముగిస్తామని చాలాకాలం కిందటే ఆ పార్టీ ప్రకటించింది. యుద్ధం నిలిపి వేయడం గురించి ఆలోచించండని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ట్రంప్ కోరవచ్చు. ఆయన సరేనని అనవచ్చునని బీబీసీలో ఒక వ్యాఖ్యాత చెప్పడం విశేషం. ఒకవేళ ట్రంప్ మాటకు పుతిన్ ప్రతికూలంగా స్పందిస్తే కొత్త అధ్యక్షుడు తీవ్రంగానే ప్రతిస్పందిస్తారన్న అంచనా కూడా ఉంది. ట్రంప్ గెలుపు కొన్ని కోణాల నుంచి భారత్‌కు శుభ పరిణామం. ఆయన చైనాను వాణిజ్య రంగ శత్రువుగా చూస్తారు. పాకిస్తాన్‌ను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతారు. ఈ రెండూ భారత్‌కు మేలు చేసేవే. పూర్తి మద్దతు ఇచ్చే అధ్యక్షుడు అమెరికాకు వచ్చినందుకు హమాస్ ఇంతకు ముందు వలె ఇజ్రాయెల్ మీద దూకుడు ప్రదర్శించలేకపోవచ్చు. తాను యుద్ధాలను అపుతానని చెప్పాడు కాబట్టి ఉక్రెయిన్-రష్యా యుద్ధం కూడా త్వరలోనే ముగిసిపోతుందన్న ఆశాభావం కనిపిస్తున్నది. తన ఎన్నిక చరిత్రాత్మకమని గొప్ప స్థయిర్యంతో చెప్పుకున్న ట్రంప్, తాను మళ్లీ గెలవడమంటే అమెరికా చరిత్రలో గొప్ప రాజకీయ పరిణామమని కూడా వ్యాఖ్యానించారు. తన మీద జరిగిన హత్యాయత్నాన్ని కూడా వమ్ము చేసి, భగవంతుడు జీవితం ఇచ్చాడంటే తన వల్ల జరగవలసిన పనేదో ఉందనే అనిపిస్తుందని ఇప్పుడు ట్రంప్ నమ్ముతున్నారు. ఆ పని గురించి త్వరలోనే బయటపెట్టవచ్చు కూడా.

# యుగం తెస్తాను!

దాదాపు అందరూ ఊహించినట్టుగానే అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక ఖాయమైంది. పెద్దవయసులో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకుడిగా కూడా ట్రంప్ (78) నిలిచారు. క్రిమినల్ అభియోగాల్లో దోషిగా తేలిన మాజీ అధ్యక్షుడిగా ఒక చెత్త రికార్డును కూడా సొంతం చేసుకున్నారు. అంతేకాదు ఈ చరిత్రతో తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికైన ఘనత కూడా ఆయనదే! ఈ వ్యాసం రాసే సమయానికి మొత్తం 50 రాష్ట్రాల్లో నలభైఎనిమిదింట్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన సమయానికి ట్రంప్ అధికారానికి అవసరమైన 270 ఎలక్టోరల్ ఓట్లను దాటి 295 సాధించారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు 226 ఓట్లు లభించాయి. ట్రంప్‌కు ఇప్పటి దాకా 50.8%, కమలా హారిస్‌కు 47.5 శాతం ఓట్లు దక్కాయి. ట్రంప్‌కు 72734149 ఓట్లు రాగా, కమలా హారిస్‌కు 68049758 ఓట్లు సాధించారు. తరువాత జరిగిన లెక్కింపులో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ చరిత్రను సృష్టించాడు. ఏకంగా 312 స్థానాలను, ఎవరికి ఓటు వేస్తారో అంచనా వేయలేని ఏడు స్వింగ్ స్టేట్‌లను కైవసం చేసుకున్నాడు. చివరగా ఓట్లు లెక్కించిన నెవాడా, నార్త్ కరోలినా, ఆరిజోనాలో కూడా రిపబ్లికన్లు నెగ్గడం గమనిస్తే, అక్కడి ప్రజలు అక్కడి గత పాలనతో ఎంత విసిగి ఉన్నారో తేలికగా అర్థమవుతుంది.

అధ్యక్ష ఎన్నికలతో పాటు కాంగ్రెస్‌కు కూడా ఎన్నికలు జరిగాయి. సెనెట్‌లోని 100 స్థానాల్లో 34 సీట్లకు, ప్రతినిధుల సభలో 435 స్థానాలకు పోలింగ్ జరిగింది. వీటితోపాటు 11 రాష్ట్రాల గవర్నర్ పదవులకు, పలు రాష్ట్రాల అసెంబ్లీలకు స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు జరిగాయి. బిల్లుల ఆమోదంలో



సెనెట్‌దే కీలకపాత్ర. నాలుగేళ్ల తర్వాత ఇందులో రిపబ్లికన్లు మెజారిటీ సాధించారు. తాజా సమాచారం మేరకు రిపబ్లికన్లు 52 స్థానాల్లో విజయం సాధించగా, డెమోక్రట్లు 45కు పరిమితమయ్యారు. ప్రతినిధుల సభలో కూడా రిపబ్లికన్ల హవా నడుస్తోంది. మెజారిటీ మార్కు 218 కాగా మొదటే వారికి 206 సీట్లు దక్కాయి. డెమోక్రాట్లు 192 సీట్లు మాత్రమే గెలుచుకున్నారు.

### నిండా ముంచిన బైడెన్

ఒకపక్క శాంతివచనాలు వల్లిస్తూనే ప్రపంచంలో యుద్ధాలను ప్రోత్సహించే విధానాన్ని బైడెన్ అనుసరించడం డెమోక్రట్ పార్టీని బాగా దెబ్బ తీసింది. నిజం చెప్పాలంటే గత 70ఏళ్ల కాలంలో అతితక్కువ ప్రజాదరణ పొందిన నాయకుడు జోబైడెనేనని గాలప్ పోల్ సర్వే తేల్చి చెప్పిన విషయం గుర్తుం చుకోవాలి. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు భారీ ఆర్థిక, ఆయుధ సహాయం అందించడం, గాజాలో ఇజ్రాయెల్‌కు సహాయం చేయడం అమెరికా ప్రజలు ఇష్టపడలేదన్నది ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. ట్రంప్ ఈ రెండు అంశాలను సమర్థంగా నిర్వహించి ఉండేవారన్నది ప్రజలు అభిప్రాయం. ఉక్రెయిన్‌కు ఆర్థిక సహాయం చేయడంతో దేశ ఆర్థిక పరిస్థితి మందగమనంలో



## రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

**జో** బైడెన్ అనుసరించిన మరో వినాశకర విధానం రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని రావణకాష్టంలా కొనసాగించడం. మిలియన్లకొద్దీ డాలర్లను ఉక్రెయిన్‌కు సహాయంగా అందించి రష్యాను దెబ్బకొట్టాలన్న ఆయన విధానం పూర్తిగా విఫలమైంది. అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకతకు కారణమవడమే కాదు చివరకు కమలా హారిస్ పరాజయానికి కారణాల్లో ఒకటిగా నిలిచింది. ఎన్నికల ప్రచారంలో ట్రంప్, ఈ ఉక్రెయిన్ యుద్ధంకోసం పన్ను చెల్లింపుదార్లు చెల్లించే మొత్తం ఏవిధంగా వృథా అవుతోందనేది గణాంకాలతో సహా ప్రజల ముందుంచడంలో విజయం సాధించారు. డీప్‌స్టేట్ పొలిటిక్స్‌లో భాగంగా కొనసాగిన ఉక్రెయిన్ యుద్ధానికి ట్రంప్ పూర్తి వ్యతిరేకి. ఆయనపై హత్యాయత్నాలు కొనసాగడానికి కారణం ఈవిధంగా వ్యతిరేకించడమేనన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌కు అందించే సహాయాన్ని అమెరికా నిలిపివేయడం వల్ల రష్యాతో యుద్ధం ఆగిపోతుంది. రష్యా కోరుకుంటున్నది కూడా ఇదే. రష్యాను బలవంతంగా యుద్ధంలోకి లాగింది కూడా ఈ డీప్‌స్టేట్ పొలిటిక్స్ మాత్రమే! ట్రంప్ విజయంతో రష్యాలో పండుగ వాతావరణం నెలకొనగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీకి అశనిపాతంగా మారింది.

పడిపోయింది. ఇదే సమయంలో తాను అధికారం లోకి వస్తే వారం రోజుల్లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ట్రంప్ హామీ ఇవ్వడం రిపబ్లికన్లకు కలిసొచ్చింది. దేశంలో జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోతుంటే పట్టించుకోకుండా ఉక్రెయిన్‌కు కోట్ల డాలర్ల సహాయం అందించడం అమెరికన్లకు నచ్చలేదు. ట్రంప్‌కు గ్రామీణ ప్రాంతాల్లో మంచి పట్టుంది. వలసలను అరికట్టే విషయం కఠినంగా వ్యవహరి స్తానంటూ ట్రంప్ హామీ ఇవ్వడం, బైడెన్ హయాంలో లక్షల సంఖ్యలో వలసలు పెరిగాయంటూ ఆయన గణాంకాలతో సహా వివరించిన తీరు అమెరికన్లను ఆకట్టుకుంది. వయసు పెరగడంతో పాటు ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నా అధ్యక్ష ఎన్నికల బరిలో జోబైడెన్ నిలవడం డెమొక్రట్లను బాగా దెబ్బతీసింది. ఆయన తన మానసిక సంతుల్యత సరిగ్గా లేకపోవడాన్ని బయటపెట్టక పోవడం, ఆలస్యంగా బరినుంచి తప్పుకోవడం కమలాహారిస్‌ను నిండా ముంచింది. ముఖ్యంగా బైడెన్ పాలనా శైలిపై అప్పటికే ప్రజల్లో పెరిగిపోయిన విసుగును డెమొక్రట్లు పట్టించుకోక పోవడం, తర్వాత తప్పు తెలుసుకొని, కమలా హారిస్‌ను రంగంలోకి దించి వ్యూహాన్ని మార్చినా అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందమైంది. ఒక రకంగా బైడెన్ చేతగాని పాలనకు కమలా హారిస్ బలైందని చెప్పాలి. బైడెన్ అసమర్థత, తప్పుడు విదేశాంగ విధానం ప్రజల్లో తెచ్చిన ప్రతికూలత కమలా హారిస్‌కు గుదిబండలా తయారై ఓటమికి కారణమైంది. అంతేకాదు మొదట్నుంచీ ఆమె అధ్యక్ష అభ్యర్థిగా బరిలో లేరు. ప్రచార పర్వంలో పుణ్యకాలం ముగిసాక బైడెన్ తప్పుకోవడం, కమలా హారిస్ పేరును ప్రకటించ డంతో తాను అనుసరించబోయే విధానాలపై ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఏర్పరచుకోలేకపోయారనే చెప్పాలి. ఫలితంగా బైడెన్ బాటలోనే ఈమె కూడా పయనిస్తారన్న అభిప్రాయం అమెరికన్లలో ఏర్పడటం కూడా ఆమె వెనుకబాటుకు మరో కారణం.

**ఇలాన్ మస్క్ హవా**

2016లో డోనాల్డ్ ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన ఇలాన్ మస్క్ ఈసారి ఎన్నికల్లో పూర్తి మద్దతు ఇవ్వడం విశేషం. అంతేకాదు ట్రంప్ విజయం కోసం, రిపబ్లికన్ పార్టీకి అత్యధిక నిధులు సమకూర్చింది కూడా ఇలాన్ మస్కే! విషయ మేంటంటే ట్రంప్, ఇలాన్ మస్క్ ఇద్దరూ గొప్ప వ్యాపారవేత్తలు మాత్రమే కాదు బిలియనీర్లు. వ్యాపారవేత్త ఆలోచన ఎప్పుడూ ఆర్థిక పరమైన లాభాలపై ఉంటుంది తప్ప యుద్ధాలు, నష్టాలపై కాదు. ఈ నేపథ్యంలోనే ట్రంప్‌కు మద్దతుగా చేసిన ప్రచారంలో అమెరికా ఆర్థిక పరిస్థితి డొల్లతనాన్ని బయటపెట్టారు. అంతేకాదు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా మార్చిన గొప్ప వ్యూహకర్తగా పేరు సంపాదించుకున్నారు. కొత్త స్టార్ కాంపెయినర్ తయారయ్యారంటూ ట్రంప్ కూడా ఇలాన్ మస్క్‌ను ప్రశంసలతో ముంచెత్తడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇలాన్ మస్క్‌కు, ఏదో ఒక మంత్రిపదవి దక్కే అవకాశమున్నదన్న వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే, ప్రస్తుత ఎన్నికల్లో చేసిన ప్రచారం, ప్రభుత్వంలో పనిచేసిన అనుభవం భవిష్యత్తులో అమెరికా అధ్యక్షపదవికి పోటీపడే స్థాయికి ఇలాన్ మస్క్‌ను తీసుకెళ్లకూడదనేం లేదు.

**ఈయూ దేశాలపై సుంకాల పిడుగు!**

తాను ఎన్నికైతే ప్రపంచ దేశాలనుంచి దిగుమతు లపై సుంకాలు విధిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారం సమయంలో గట్టిగా హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఎంతవరకు ఈ మాటను నిలుపుకుంటారనే దానిపై ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యరంగ నిపుణుల్లో తర్జనభర్జనలు మొదలయ్యాయి. స్వతహాగా పెద్ద వాణిజ్యవేత్త అయిన ట్రంప్, దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడం, అమెరికన్ల ఉద్యోగాల రక్షణ, పన్ను ఆదాయం పెంచాలంటే ఈ టారిఫ్‌ల పెంచకతప్పదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విదేశీ దిగుమతులపై 10% నుంచి 20% వరకు టారిఫ్‌లు విధిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహంలేదు. ఎన్నికల ప్రచార సమయంలో ఆయన ఒకసారి మాట్లాడుతూ, "యూరోపియన్ యూనియన్ అంటేనే ఎంతో వినసొంపుగా ఉంటుంది. కానీ ఈ చిన్న దేశాల్లో ఏదీ కూడా అమెరికా ఉత్పత్తిచేసే కార్లను లేదా వ్యవసాయ ఉత్పత్తును కొనుగోలు చేయవు. కానీ వాళ్లు యు.ఎస్.కు మిలియన్లకొద్దీ డాలర్ల విలువైన కార్లను ఎగుమతి చేస్తారు. ఇందుకు కచ్చితంగా వాళ్లు మూల్యం చెల్లించక తప్పదు" అని అన్నారు. ట్రంప్ విజయం వార్త వెలువడిన వెంటనే వోక్స్‌వాగన్, బి.ఎం.డబ్ల్యు, మెర్సిడిస్ కార్ల కంపెనీల షేర్లు 5 నుంచి 7శాతం వరకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఈయూ దేశాలు అమెరికాపై ప్రతీకార చర్యలకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇంతకుముందు అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు టారిఫ్‌లపై ట్రంప్ చేసిన ప్రకటనను ఈ దేశాల మంత్రులు పెద్దగా పట్టించుకోలేదు. కానీ దిగుమతి సుంకాలు విధించిన తర్వాత కానీ వాళ్లకు ట్రంప్ ఏంటో అర్థం కాలేదు. ఈ అనుభవ నేపథ్యమే ప్రస్తుతం అవి తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ప్రధాన కారణం. గతంలో ఈయూ దేశాలు అమెరికా కంపెనీ హార్లీ డేవిడ్‌సన్ మోటారుసైకిళ్ల దిగుమతులపై సుంకాలు విధించిన చరిత్ర వుంది. ట్రంప్ తీసుకునే చర్యలవల్ల వాణిజ్య యుద్ధాలకు తెరతీసి, ప్రపంచ ఆర్థిక వృద్ధి 7% వరకు పతనమయ్యే అవకాశ ముందని ఐ.ఎం.ఎఫ్. అంచనా వేస్తోంది. ఇది ఫ్రాన్స్, జర్మనీల మొత్తం ఆర్థిక వ్యవస్థలకు సమానం.

**యు.కె. తటస్థం!**

ఇక యు.కె. విషయానికి వస్తే బ్రెగ్జిట్ తర్వాత ఆ దేశం ఏ దిశగా పయని స్తున్నదీ స్పష్టత రాలేదు. యు.ఎస్.కు అత్యంత సన్నిహిత దేశంగా ఉన్నప్ప ప్పటికీ, తనకు ఈయూ దేశాలతో దశాబ్దాలుగా కొనసాగుతున్న సన్నిహిత సంబంధాల నేపథ్యాన్ని

## ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్



అమెరికా 50వ ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న జె.డి. వాన్స్ పేరు ఇప్పుడు భారత్‌లో అందరికీ పరిచితమే. అతడి శ్రీమతి భారతీయ సంతతికి చెందిన మహిళ కావడమే. అంతేకాదు, అమెరికా చరిత్రలో అతిపిన్న వయస్కుడైన ఉపాధ్యక్షుడిగా 40 ఏళ్ల వాన్స్ చరిత్ర సృష్టించాడు. తొలుత ట్రంప్ విమర్శకుడుగా ఉన్న అతడు ఇప్పుడు ఏకంగా ఉపాధ్యక్ష పదవికి ఎదిగిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. అతడు ట్రంప్‌పై మామూలు విమర్శలు చేయలేదు. ఏకంగా సాంస్కృతిక హెరాయిన్ (మాదక పదార్థంతో) ట్రంప్‌ను పోల్చాడు. అయినప్పటికీ, ట్రంప్ అందరినీ వదిలి జె.డి.వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ఎంచుకున్నప్పుడు అందరూ విస్మయం చెందారు.

వాన్స్ శ్రీమతి ఉషా చిలుకూరి వాన్స్ తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. వారు 1980వ దశకంలో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. తల్లిదండ్రులు కృష్ శాస్త్రి, లక్ష్మి ఉన్నతవిద్యావంతులు కావడమే కాదు, అధ్యాపక వృత్తిలో ఉన్నవారు కావడం విశేషం. ఉష తాత రామశాస్త్రి భారత్‌లో ఐఐటి చెన్నై వ్యవస్థాపక ఫ్యాకల్టీగా ఉన్నారు. ఆయన సోదరుడు చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆంధ్రా యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా సేవలందించడమే కాదు, ఆంధ్ర ప్రదేశ్ ఆర్ఎస్ఎస్ శాఖకు అధిపతిగా వ్యవహరించారు.

విస్మరించలేదు. ప్రస్తుతం అది ఈయూ దిశగానే వెళుతోంది. ముఖ్యంగా ఆహారం, వ్యవసాయ ప్రమాణాలు ఈయూ దేశాలకు దగ్గరగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో యు.ఎస్.తో సన్నిహితం కావడం కొంచెం కష్టమే. ఉభయ తారకంగా ఈయూ, యు.ఎస్.ల మధ్య తటస్థవైఖరి అవలంబించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా వస్తు వాణిజ్యం, ఔషధాలు, కార్ల రంగాల విషయంలో వాణిజ్య యుద్ధాలకు దిగడానికి యు.కె. ఎట్టిపరిస్థితుల్లో ముందుకు రాదు. మొత్తంమీద చెప్పాలంటే ట్రంప్ అధికారంలోకి రావడం యూరప్ దేశాలపై వాణిజ్యపరంగా ప్రతికూల ప్రభావం పడక తప్పదనే చెప్పాలి. ఇతర దేశాల దిగుమతులపై 20% వరకు సుంకం విధిస్తామన్న ట్రంప్, చైనా ఉత్పత్తులపై 60%, మెక్సికో తయారీ వాహనాలపై ఏకంగా 2వేల శాతం టారిఫ్ విధిస్తానని స్పష్టం చేశారు. మొత్తంమీద పరిశీలిస్తే 'టారిఫ్' ట్రంప్‌కు అత్యంత ఇష్టమైన పదంగా కనిపిస్తోంది.టారిఫ్‌లు విధించే విషయంలో ట్రంప్ రెండు విధానాల్లో ఏదో ఒకటి అనుసరించే అవకాశముంది. సుంకాలను విధిస్తామని బెదిరిస్తూ, ఇతరదేశాలతో బేరసారాలకు దిగడం ఒకటి కాగా, నిక్కచ్చిగా అధిక సుంకాలు విధించడం రెండో పద్ధతి.


ఆసియాదేశాలపై ముఖ్యంగా చైనాపై ట్రంప్ ప్రధానంగా తన 'టారిఫ్' అస్త్రాన్ని ప్రయోగించడం తథ్యం. 2016లో ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి అనుభవాలు చైనాకు బాగానే గుర్తున్నాయి. ఈ నేపథ్యంలో చైనా తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఉండదు. ఎన్నికల ప్రచారం సమయంలోనే ట్రంప్ టారిఫ్‌ల గురించి విస్తృతంగా మాట్లాడిన నేపథ్యంలో ఎందుకైనా మంచిదని చైనా జాగ్రత్త పడుతోంది. ముఖ్యంగా దీన్ని తట్టుకోవడానికి దేశీయంగా ఉద్దీపన ప్యాకేజీలు అమలు పరచేందుకు సిద్ధమైంది. అంతేకాదు దేశ ఆర్థిక వ్యవస్థను 5%వరకు పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది.

### విధానాలు మారవు!

ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటికీ కొన్ని ప్రాథమిక అంశాలపై అమెరికా విధానంలో మార్పులు ఉండబోవన్న సత్యాన్ని గుర్తించాలి. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల విషయానికి వస్తే, 'ప్రజాస్వామ్యం వర్సెస్ నిరంకుశత్వం', 'పశ్చిమ వర్సెస్ తూర్పు', అనే అంశాలు చైనా కేంద్రంగా ప్రాధాన్యత వహిస్తాయనడంలో సందేహం లేదు. విచిత్రమేమంటే ఇక్కడ 'గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్' అనే అంశం కంటే పై విషయాలకే ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని దశాబ్దాలుగా పశ్చిమ దేశాలకు, మిగిలిన దేశాలకు మధ్య సంపద విషయంలో అంతరాలు తీవ్రస్థాయిలో కొనసాగుతుండటం ఇందుకు ప్రధాన కారణం. యు.ఎస్. ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా విదేశాంగ విధానంలో పెద్దగా మార్పు ఉండదు. చారిత్రకంగా పరిశీలిస్తే గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్‌ను దారుణంగా అణచివేసిందనేది సత్యం. భారత్ గ్లోబల్ సౌత్ వాణిని గట్టిగా వినిపించడానికి ప్రధాన కారణం ఇదే. ఈ నేపథ్యంలో ప్రపంచ పాలనా వ్యవస్థలో మార్పుల కోసం అమెరికాపై ఆధారపడటానికి గ్లోబల్ సౌత్ నాయకులు ఇష్టపడటం లేదు. ప్రత్యామ్నాయ వేదికల ద్వారా తాము బలపడాలని గ్లోబల్ సౌత్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా నాయకత్వంలోని "రూల్స్ బేస్డ్ ఆర్డర్"ను ఇవి వ్యతిరేకించడమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఒకేరకమైన నియమనిబంధనలు అమలు కావాలని కోరుతున్నాయి. ప్రస్తుత "రూల్స్ బేస్డ్ ఆర్డర్" కారణంగా కొద్ది సంఖ్యలో ఉన్న పశ్చిమ దేశాలు, మొత్తం ప్రపంచ దేశాలను శాసించడం కొనసాగడానికి వీల్లేదన్నది వీటి వాదన. అదీ కాకుండా అమెరికా విదేశాంగ విధానం అనుసరిస్తున్న ఈ రూల్స్ బేస్డ్ ఆర్డర్ పశ్చిమదేశాలకు అనుకూలంగా, మిగిలిన దేశాలపట్ల వివక్షతో కూడి ఉండటం కూడా గ్లోబల్ సౌత్‌లో దీనిపట్ల వ్యతిరేక తకు మరో కారణం. బ్రిక్స్ వంటి వేదికలు వెలుగు లోకి రావడానికి ఇదే ప్రధాన కారణం.

### మార్కెట్లలో సానుకూలత

ట్రంప్ ఎన్నికైన వెంటనే యు.ఎస్., ఇండియా మార్కెట్లలో సానుకూలత వ్యక్తమైంది. ముఖ్యంగా ట్రంప్ చైనా వ్యతిరేక వైఖరి, రష్యాతో సామరస్యం ఈ మార్కెట్లలో జోష్ నిండటానికి ప్రధాన కారణం. భారత్‌కు కూడా టారిఫ్‌ల గండం లేకపోలేదు. అయితే ఐసీఈటీ, జీఈ–హెచ్ఏఎల్‌ల మధ్య యుద్ధ విమానాల ఇంజిన్ల ఒప్పందం కుదరడం, చైనా నుంచి యు.ఎస్.కు సరఫరా శృంఖలాలు తగ్గే అవకాశాలు మెరుగుపడటం మనదేశానికి ప్రయోజనకరం. ట్రంప్ హయాంలో డాలర్ మరింత బలపడి, మనదేశం నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోయే అవకాశాలున్నాయి. భారత్ క్వాడ్‌లో కీలకమైన భాగస్వామిగా ఉన్నందున తయారీ, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ సామర్థ్య కేంద్రాలనుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చే అవకాశాలు మెండుగానే ఉన్నాయి. అందువల్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులపై కంటే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వల్లనే మనకు అధిక ప్రయోజనాలు కలిగే అవకాశాలు ఎక్కువ. క్వాడ్ గ్రూపులో సభ్యురాలిగా, చైనాకు మనదేశం గట్టి పోటీదారుగా నిలవడం కూడా ఈ సానుకూలతలకు ఒక కారణం. భారత్, దక్షిణాఫ్రికా దేశాలు దేశీయ అభివృద్ధి సంభావ్యత కలిగివుండటంవల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల్లో చోటు చేసుకునే అస్థిరతలు వీటిపై పెద్దగా ప్రభావం చూపవు. మరో విషయమేంటంటే



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

చీలీ దేశం నుంచి ఎగుమతయ్యే లీథియం ఎగుమతులపై కూడా ఎటువంటి ప్రభావం ఉండదు. ఎందుకంటే ఈ లోహం అన్నిదేశాలకు ముఖ్యంగా అమెరికాకు అత్యవసరం!

యు.ఎస్. దేశీయ పన్నుల్లో కోత, దిగుమతులపై సుంకాలను పెంచినట్లయితే యూరో ఒక డాలర్‌కంటే దిగువకు, చైనా కరెన్సీ యువాన్ విలువ మరింత పడిపోయే అవకాశముంది. ఒకరకంగా చెప్పాలంటే 2018–20 నాటి క్షీణతను మళ్లీ చూడవచ్చు. డాలర్ విలువ పెరగడం వల్ల జపాన్ కరెన్సీ యెన్, స్విస్ కరెన్సీ ఫ్రాంక్‌లతో వర్తకం మళ్లీ వృద్ధి చెందే అవకాశముంది. ట్రంప్ క్రిప్టో కరెన్సీపై మరింత సరళంగా వ్యవహరించడం వల్ల బిట్‌కాయిన్ మరింత ప్రయోజనం పొందగలదు. ఇప్పటికే అమెరికా స్టాక్ మార్కెట్లలో బిట్‌కాయిన్ ఎంతో లాభపడింది. ఇక ఇరాన్‌పై మరిన్ని ఆంక్షలు విధించినట్లయితే ప్రపంచ దేశాలకు తగినంత ముడిచమురు అందదు. ఈ నేపథ్యంలో అమెరికాలో అపరిమితంగా ఉన్న చమురు నిల్వల కారణంగా మార్కెట్‌లో ప్రభుత్వ భాగస్వామ్యం వల్ల వీటి ధరలు విపరీతంగా పెరిగే అవకాశముంది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తిని గరిష్ట స్థాయికి తీసుకెళ్లడం ద్వారా, చమురు ఉత్పత్తిలో ప్రధాన దేశంగా యు.ఎస్. ఎదగాలన్నది ట్రంప్ లక్ష్యం. మధ్యప్రాచ్య దేశాలపై ఆంక్షలు విధించి, తన చమురును అధిక ధరకు అమ్ముకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నది ట్రంప్ అసలు ఉద్దేశం!

### భారత్‌పై ప్రభావం

రష్యాతో మనకున్న సంబంధాలపై ట్రంప్ పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కాకపోతే మన ఎగుమతులపై సుంకాలు పెంచుతూ కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. అమెరికా ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలను తగ్గించాలని మన దేశాన్ని కోరుతున్నారు. ఒకవేళ ఆవిధంగా చేస్తే 2028 నాటికి మన జీడీపీ 0.1శాతం పడిపోయే అవకాశముందని నిపుణుల అంచనా. ట్రంప్ చైనాను గట్టి పోటీదారుగా పరిగణించడం వల్ల, ఆ దేశంపై చెక్ పెట్టడానికి మనతో స్నేహ సంబంధాలను కొనసాగించే అవకాశాలే ఎక్కువ. విదేశీయులు అమెరికన్ల ఉద్యోగాలు లాక్కుంటున్నారని వాదిస్తున్న ట్రంప్ వీసా నిబంధనలను కఠినం చేస్తానని ఎన్నికల ప్రచారంలో హెచ్చరించినప్పటికీ, కార్పొరేట్ పన్నుల్లో కోత విధించే దిశగా ట్రంప్ యంత్రాంగం అడుగులు ముందుకేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే భారతీయ ఐటీ సంస్థల సేవలకు మరింత డిమాండ్ పెరిగే అవకాశముంది. ఇప్పటికే ఈ సంస్థలు యు.ఎస్. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. భారతీయ ఐటీ రంగం విలువ దాదాపు 254 బిలియన్ అమెరికన్ డాలర్లుగా



ఉన్నప్పటికీ, అక్కడి కఠిన వీసా నిబంధనల కారణంగా హెచ్1–బి వీసాలపై ఎక్కువగా ఆధారపడే పరిస్థితి లేదు. ట్రంప్ హయాంలో ఈ నిబంధనలు కొనసాగడంవల్ల మన ఐ.టి.రంగ నిపుణులకు అమెరికా అవకాశాలు తగ్గిపోతాయి. అయితే ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెరగడం, యు.ఎస్. కంపెనీలు ఎక్కువగా ఖర్చు చేయడానికి ముందుకు రావడంవల్ల ఐటీ రంగం మంచి ఊపందుకునే అవకాశాలే ఎక్కువ.

### లాభపడనున్న ఔషధరంగం

బలహీనమైన రూపాయి, చైనాపై దిగుమతులపై యు.ఎస్. ఆధారపడటం తగ్గడం వల్ల, భారతీయ ఫార్మాస్యూటికల్స్ ఎక్కువ లాభపడనున్నాయి. ముఖ్యంగా ట్రంప్ అనుసరించే చైనా వ్యతిరేక విధానంతో మన ఫార్మా రంగానికి మంచి ఊపు లభించనుంది. ముఖ్యంగా అమెరికా సంస్థలు జనరిక్ మందుల కోసం మన దేశం వైపు చూడక తప్పదు. కాకపోతే యు.ఎస్.లో అమల్లో ఉన్న ఔషధ ధరల నియంత్రణ విధానాల విషయంలో మన ఫార్మా కంపెనీలు జాగ్రత్తగా వ్యవహరించాలి. టారిఫ్‌లను విపరీతగా పెంచేసి తయారీ రంగం వరకు చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడంవల్ల, ఎలక్ట్రానిక్ రంగంలో చైనా స్థానాన్ని మనదేశం భర్తీ చేయగలదు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మనదేశ ప్రాధాన్యం రీత్యా ట్రంప్ మనతో సానుకూలంగా వ్యవహరించక తప్పదు. యు.ఎస్. ప్రయోజనాల పరిరక్షణకు ఇది చాలా అవసరం. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య రక్షణరంగంలో మరింత సహకారం పెంపొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ రంగంలో స్టార్టప్‌లపై పెట్టుబడులు మరింత ఊపందుకోవచ్చు. ఇదేసమయంలో ట్రంప్ అనుసరించే 'అమెరికా ఫస్ట్' విధానం వల్ల మన ఎగుమతుల్లో ఫార్మాస్యూటికల్స్, వస్త్రాలపై దిగుమతి సుంకాలు పెరిగే అవకాశముంది. ఒకవేళ ట్రంప్ ప్రభుత్వం మన దేశం నుంచి దిగుమతులపై సుంకాలు విధిస్తే, అందుకు దీటుగా భారత్ ప్రతిక్రియకు తప్పనిసరిగా దిగుతుంది. ఎందుకంటే గతంలోని భారత్ కాదు మరి! ట్రంప్ ప్రభుత్వ హయాంలో డాలర్ మరింత బలోపేతమై, రూపాయి బలహీనపడితే ఇది మొత్తంమీద మనదేశ ఆర్థిక స్థిరత్వం మీద ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

### ఊపిరి పీల్చుకున్న భారత్

ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న పోరులో అమెరికా పూర్తిగా ఇజ్రాయెల్ పక్షం వహించడమే కాకుండా, ఇరాన్ సరిహద్దులో భారీ యుద్ధ నౌకలను మోహరించింది. ఇజ్రాయెల్‌కు అండగా నిలిచిన అమెరికా ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను పూర్తిగా కోలుకోకుండా దెబ్బతీయడం. ఇది జో బైడెన్ అనుసరించిన విధానం. కానీ ఇరాన్‌కు రష్యా మద్దతుంది. విచిత్రమేమంటే మనదేశానికి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్, రష్యాలు మిత్రదేశాలే. జోబైడెన్ ఇరాన్‌కు వ్యతిరేకంగా అనుసరించిన విధానాల వల్ల చబ్బహార్ పోర్ట్‌లో మన వాణిజ్య కార్యకలాపాలకు విఘాతం ఏర్పడటమే కాదు, సెంట్రల్ ఆసియాతో మన వాణిజ్య సంబంధాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ట్రంప్ యుద్ధాలు వద్దనే విధానాన్ని అనుసరించబోతున్నట్టు స్పష్టంగా ప్రకటించడమే కాదు, ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుందని స్పష్టం చేయడం భారత్‌కు సానుకూల పరిణామం. అయితే ఇరాన్ అణుస్థావరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని ఆయన ఇజ్రాయెల్‌ను కోరారు. ఇజ్రాయెల్ నేత బెంజిమన్ నెతన్యాహుకు కావలసిందిదే. ఆ తర్వాత యుద్ధాన్ని నిలిపివేయాలన్నది ట్రంప్ అభిమతం. ఈ విధానం వల్ల మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియాలో భారత్ వాణిజ్య విధానాలకు ఎటువంటి ఇబ్బంది ఉండబోదు. నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (ఎన్.ఎస్.టి.సి) పనులతో పాటు వాణిజ్యం యథాతథంగా కొనసాగుతాయి. ట్రంప్ వల్ల భారత్‌కు ఒనగూడుతున్న ప్రయోజనం ఇది.

### ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (ఎన్ఎస్‌టీసీ) అంటే...

భారత్, ఇరాన్, రష్యాల మధ్య ఎన్ఎస్‌టీసీ ఏర్పాటుకు 2002లోనే ఒక అంగీకారం కుదిరింది. దీనివల్ల సెంట్రల్ ఆసియా, రష్యాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి రవాణా ఖర్చు 30శాతం, దూరం 40శాతం తగ్గుతుంది. ఈ మొత్తం దూరం 7200 కిలోమీటర్లు. నౌక, రైలు, రోడ్డు మార్గాల ద్వారా భారత్, ఇరాన్, అజర్‌బైజాన్, రష్యా, సెంట్రల్ ఆసియా, యూరప్ దేశాల మధ్య వాణిజ్యం మరింత ఊపందుకునేందుకు ఇది దోహదపడుతుంది. సంప్రదాయికంగా జరిపే వాణిజ్యంతో పోలిస్తే ప్రతి 15 టన్నులకు అయ్యే ఖర్చులో 2500 డాలర్ల వరకు తగ్గుతుందని నిరూపణ అయింది కూడా. అష్కాబాత్ ఒప్పందం పేరుతో కుదిరిన ఈ బహుళ నమూనా ఒప్పందంపై ఇండియా, ఒమన్, ఇరాన్, తుర్క్‌మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్ దేశాలు సంతకాలు చేశాయి. ★



**Dr. G. Suryanarayana Raju**
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



**Dr. D. Raghunadharao**
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

# 40+ Years of Oncology Expertise
## Asvins Cancer Care in Hyderabad

**99% Success Rate Over 1,78,000 Cancer Patients**
**Treated 63,000 Success Surgeries**

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

## Sugical Oncology Services

- Diagnostic Procedures
- Cancer Resection
- Sentinel Node Biopsy
- Oncoplastic Surgery
- Minimally Invasive Surgery
- Endocrine Surgery
- Gastrontestinal Surgery
- Head and Neck Surgery
- Skin Cancer Surgery
- Palliative Surgery
- Supportive and Reconstructive Surgery
- Surgical Management of Metastasis
- Multidisciplinary Team Care

## Medical Oncology Services

- Chemotherapy
- Targeted Therapy
- Hormone Therapy
- Immunotherapy
- Biologic Therapy
- Cancer Genetics and Genomics
- Palliative Care
- Radiation Oncology Coordination
- Survivorship Care
- Multidisciplinary Team Care

**We do All types of Radical as Well as Organ Sparing Surgeries**

SCAN ME

**Book Your Consultation Now +91 9440445775**

**6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.**

**We Expertise in Treating All Cancers    Expert Treatment Affordable Prices**

# అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్

6-3-903/A&B, రాజ్ భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ 500082.

www.asvinshospitals.com    +91 94404 45775

అశ్విన్స్
స్పెషాలిటీ హాస్పిటల్స్



ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
**డా॥ జి సూర్యనారాయణ రాజు**
M.S. MCh,FRCS,FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్



ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
**డా॥ రమణి GSV**
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

**ప్రతి నెల మొదటి ఆదివారం**



ప్రముఖ హేమాటో ఆంకాలజిస్ట్
**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**
MBBS, MD ఇమ్యునో-హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

**ప్రతి నెల రెండవ ఆదివారం**

**ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.**

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతుదిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతల, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

బ్లడ్ కాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసికలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

**అభినవ్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 224338**

ఉదయం గం॥ 10:30 ల నుండి గం॥ 2:00 ల వరకు

**లోటస్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 230555**

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

**Satyanarayana:** అపాయింట్మెంట్ కొరకు **సీత:**

**+91 75698 11119**    **+91 9618161032**

# జేకే కొత్త అసెంబ్లీలో

**ఆర్టికల్ 370, 35ఎ అధికరణాలు రద్దయిన పదేళ్ల తరువాత, ఎన్నికలు జరుపుకుని తొలిసారి సమావేశమైన జమ్ముకశ్మీర్ శాసనసభలో అవాంఛనీయ దృశ్యాలే చోటు చేసుకున్నాయి. బీజేపీ ప్రభుత్వం 2019లో రద్దు చేసిన 370 ఆర్టికల్‌కు మళ్లీ ప్రాణ ప్రతిష్ఠ చేయాలన్న కుట్రను దొడ్డితోవన అమలు చేయడానికే లోయ పార్టీలు ప్రయత్నం చేస్తున్న సంగతి స్పష్టమైంది. అచ్చంగా పాకిస్తాన్ అజెండాను అమలు చేయడానికి లోయలోని ముస్లిం వర్గాలు ప్రయత్నించడంతో సభలో తొలిరోజు, అంటే నవంబర్ 4న మొదలైన బాహాబాహీ మూడురోజులు సాగి రణరంగాన్ని తలపించింది. తొలిరోజు పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ సభ్యుడు వాహిద్ పారా 370 అధికరణను పునరుద్ధరించాలని కోరుతూ సభలో తీర్మానం చదివారు. ఇందుకు బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం కూడా అలాంటి తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అవామీ ఇత్తేహాద్ పార్టీ నాయకుడు షేక్ కుర్షీద్ 370, 35ఏ అధికరణలను పునరుద్ధరించాలని రాసి ఉన్న బ్యానర్‌ను పట్టుకుని వెల్‌లోకి దూసుకువెళ్లారు.**



నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్‌సీ) తన మేనిఫెస్టో లోనే ఈ అంశాన్ని చేర్చటంతో అధికార పార్టీకిది ప్రాధాన్య అంశంగా ఉంది. 370 అధికరణ పునరుద్ధ రణకు అసెంబ్లీకి ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో చర్చలు జరపాలని, ప్రత్యేకహోదా, రాజ్యాంగ బద్ధతకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని ఈ తీర్మానంలో ప్రభుత్వం కోరింది. ముఫ్తీ మెహబూబా నాయకత్వం లోని పీడీపీ పార్టీ 370 పునరుద్ధరణను కోరుతూ మొదటే తీర్మానం ప్రవేశపెట్టింది. బయట ఎంత బద్ధ విరోధుల్లా కనిపించినా అసెంబ్లీలో లోయలో ముస్లిం పార్టీలన్నీ ఏకమైపోయాయి. ప్రత్యేక హోదాకు పట్టుపట్టటం అంటే ఆర్టికల్ 370ని పునరుద్ధరించ టమే అన్న అభిప్రాయాన్ని ఎన్‌సీ వ్యక్తం చేయటం దారుణమని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. 'ప్రజా స్వామ్యానికి అత్యున్నత ఆలయంగా భావించే వ్యవస్థ (పార్లమెంట్) ద్వారా ఆర్టికల్ 370 రద్దయింది. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇప్పుడు అదంతా గత చరిత్ర' అని స్పష్టం చేశారు. బీజేపీ సభ్యులు శ్యామాప్రసాద్ ముఖర్జీకి అనుకూలంగాను, భారత మాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఎన్‌సీ సభ్యులు ప్రత్యేక హోదా అంటూ నినాదాలతో హోరెత్తించారు.

ఆర్టికల్370 రద్దు చారిత్రాత్మక నిర్ణయం. దీనితో మిగతా అన్ని రాష్ట్రాల మాదిరిగానే కశ్మీర్ దేశంలో భాగం అయ్యింది. ఇతర ప్రాంతాలవారు ఆస్తుల కొనుగోలుకు మార్గం సుగమమైంది. దళితులు, ఆదివాసులు, మైనార్టీలు, మహిళలు మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారు. తీవ్రవాదుల అలజడి తగ్గి ప్రశాంత వాతావరణం నెలకొంది. అందాల కశ్మీరం వెలుగులు విరజిమ్ముతూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే, అక్కడి ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో, అంత కంటే ఎక్కువగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ముందుకొచ్చి స్వేచ్ఛగా ఓటేశారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరింది.

మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఎన్‌సీకి ప్రజలు భారీ మెజార్టీ కట్టబెట్టలేదు. సొంతంగా తక్కువ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఎన్‌సీకి 42 సీట్లు, బీజేపీకి 29, కాంగ్రెస్‌కి 6, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (జెకెపీడీపీ) 3,ఆమ్ ఆద్మీ పార్టీ 1, ఇండిపెండెంట్లు 7 సీట్లు దక్కాయి. ఇండియా కూటమిలో ఎన్‌సీ, కాంగ్రెస్‌లు భాగస్వాములుగా ఉన్నా, కానీ ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా లేదు. ఎన్‌సీకి కశ్మీర్ నుంచే ఎక్కువ సీట్లు వచ్చాయి. దాంతో జమ్మూ నుంచి ఎంపికయిన ఎమ్మెల్యే సురేందిర్ కుమార్ చౌదరిని ఉపముఖ్యమంత్రిగా నియమించారు. ప్రత్యేక హోదా కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టే బాధ్యతను చౌదరికే పార్టీ అప్పగించింది.

ప్రత్యేక హోదాను రద్దు చేసి, జమ్మూకశ్మీర్ లద్దాక్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం ఆగస్టు 5, 2019న తీసుకున్న నిర్ణయాన్ని అసెంబ్లీ తీర్మానంలో తిరస్కరించారు. ప్రత్యేక హోదా పునరుద్ధరణకు చేపట్టే ప్రక్రియతో జాతి ఐక్యతను, జమ్మూకశ్మీర్ ప్రజల ఆశలను నెరవేర్చాలి అని కోరారు.

మొత్తానికి సమావేశాలలో తీవ్ర రచ్చ సాగింది. ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ వాగ్వాదానికి దిగారు. అవామీ ఇత్తెహాద్ పార్టీ ఎమ్మెల్యే, ఇంజనీర్ రషీద్ సోదరుడు ఖుర్షీద్ అహ్మద్ షేక్ ఆర్టికల్ 370పై బ్యానర్‌ను ప్రదర్శించడంతో సభలో గందరగోళం మొదలైంది. బ్యానర్ ప్రదర్శనపై శాసనసభలో విపక్ష నేత బీజేపీ ఎమ్మెల్యే సునీల్ శర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాగ్వాదం జరిగిన వెంటనే మార్షల్స్ జోక్యం చేసుకుని బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు పంపారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా స్పందిస్తూ, ఎన్‌సీ, కాంగ్రెస్‌లు భారత వ్యతిరేక భావాలను పెంచి పోషిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ కా హాత్ పాకిస్తాన్ కే సాత్, కాంగ్రెస్ కే హాత్ టెర్రరిస్ట్ కే సాత్ అని విమర్శించారు.

బీజేపీ శాసన సభాపక్ష నేత సునీల్ శర్మ తీవ్రంగా స్పందించారు. స్పీకర్ అబ్దుల్ రహీమ్ ఎన్‌సీ అధికార ప్రతినిధి మాదిరిగా వ్యవహరిస్తున్నారని, ఆయన ప్రవర్తన దేశ సార్వభౌమత్వానికి, ఐకమత్యానికి సవాలుగా ఉందని విమర్శించారు. "మార్షల్స్ మమ్మల్ని అసెంబ్లీ నుంచి బయటకు నెట్టినప్పుడు బయట సమాంతర అసెంబ్లీని నిర్వహించాం. దీనిని స్పీకరు తక్కువగా అంచనా వేయకూడదు. ఇది మా హెచ్చరిక" అని పేర్కొన్నారు. "ఆర్టికల్ 370 అనేది గత చరిత్ర. ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో లేని ప్రత్యేక హోదాతో పోలుస్తున్నారు. జమ్ముకశ్మీర్‌కు



# పాక్ పాత అజెండా

సంబంధించి రాజ్యాంగంలో ఎక్కడయినా ప్రత్యేక హోదా అన్న మాట ఉంటే చూపించాలని ముఖ్య మంత్రి ఒమర్ అబ్దుల్లాను సవాలు చేస్తున్నా” అన్నారు సునీల్ శర్మ.

370 రద్దును కోరుతూ తాము ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చారిత్రాత్మకమైన నిర్ణయంగా ముఖ్య మంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. దీని ద్వారా ఒక చర్చకు సానుకూలత ఏర్పడుతుందని అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. సంభాషణలను నియంత్రించేలా లేదా అవకాశాలను తగ్గించే భాషను తాము ఉపయోగించలేదనే పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

“2019న కేంద్రం నిర్ణయం తీసుకున్నప్పుడు మమ్మల్ని భాగస్వాములను చేయలేదు. అనేక రకాలుగా అవమానాలకు గురిచేసినా, జాతీయ జెండా ఇక్కడ ఎగరటానికి మేం అనుమతించాం. అరెస్టులు చేయటం, నిర్బంధంగా అణచివేతలు తాత్కాలికమైన ప్రశాంతతను మాత్రమే మిగులుస్తాయి. జమ్ము కశ్మీర్ ప్రజలు శాంతిలో భాగస్వాములు కావాలని కోరుతున్నా. త్వరలోనే రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నా” అని పేర్కొన్నారు.

సభ బయట మరొక ప్రముఖ నేత ఫరూక్ అబ్దుల్లా తన పాత పాటనే అందుకున్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులకు కేంద్రమే కారణమని ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఆరోపించారు.“ఆర్టికల్ 370 రద్దు చేయటానికి వారికి 31 సంవత్సరాల పడితే, దానిని పునరుద్ధరించటానికి అది ఎంత కాలమైనా మేం ప్రయత్నించే తీరతాం” అని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను కాల్చి చంపరాదని, పాక్‌తో చర్చలు ఆరంభించాలని కూడా చెప్పారు. 370 ఆర్టికల్ జమ్ముకశ్మీర్ ప్రజల గుండె చప్పుడు అని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తీవ్రవాదానికి ఆర్టికల్ 370 కారణమని బీజేపీ చెబుతున్న మాటల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఆర్టికల్ 370 రద్దును పీడీపీ సమర్థిస్తోంది. అయితే జమ్ముకశ్మీర్ ప్రభుత్వ తీర్మానంపై పీడీపీ అధినేత మెహబూబా ముఫ్తీ చిత్రంగా స్పందించారు. ప్రభుత్వం నేరుగా ఆర్టికల్ 370 రద్దును కోరుకోకుండా, మేం ఈ విషయంలో చర్చలను కోరుకుంటున్నామని డొంక తిరుగుడుగా వ్యాఖ్యానించటాన్ని తప్పుపట్టారు. అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తిరస్కరించినప్పుడు ఎవరితో మీరు ఎవరితో చర్చిస్తారు? అని ప్రశ్నించారు.

అసెంబ్లీలోని ఇతర పార్టీలు ఒమర్ ప్రభుత్వ చర్యలను సమర్థించాయి. “ఈ తీర్మానం నైతికంగా, రాజకీయంగా ఆర్టికల్ 370ని తిరస్కరించింది. ఇది మంచి ప్రారంభం” అన్నారు పీపుల్స్ కాన్ఫరెన్స్ సాజద్ లోనె. అసెంబ్లీలో గందరగోళానికి కాంగ్రెస్ దూరంగా ఉంది. కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) నాయకుడు గులాం అహ్మద్ మీర్ మాట్లాడుతూ ‘ప్రజల్లో ఉన్న వ్యతిరేకత (370 రద్దు మీద) గురించి మా పార్టీ ఇంతకు ముందే చెప్పింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కూడా జమ్ముకశ్మీర్ ఈ నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నారని, తమ గౌరవాన్ని, హుందాతనాన్ని తిరిగి కోరుకుంటున్నారని వెల్లడయిందని అన్నారు.

ఎన్‌సీ ఆధ్వర్యంలోని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానానికి చట్టబద్ధత లేదని, పార్లమెంటు, సుప్రీం కోర్టుల కంటే ఈ అసెంబ్లీ గొప్పదేమీ కాదని బీజేపీ నేతలు చెబుతున్నారు.

అయితే ఆర్టికల్ 370ని పునరుద్ధరించడం ఏ శక్తికీ సాధ్యం కాదని ప్రధాని మోదీ సహా కేంద్రంలోని బీజేపీ నేతలు స్పష్టంగా చెప్పారు. మహారాష్ట్రలోని ధులేలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు.“370వ అధికరణకు మద్దతుగా అసెంబ్లీ వెలుపల బ్యానర్లు పెట్టారు. ఆ అధికరణను ఆమోదించాలంటూ కాంగ్రెస్ కూటమి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనిని దేశ ప్రజలు ఆమోదిస్తారా? ఈ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు శక్తివంచన లేకుండా నిరసన తెలిపినప్పటికి వారిని బయటకు పంపించేశారు. కాంగ్రెస్ కూటమి నిజస్వరూపం ఏమిటో యావద్దేశం అవగాహన చేసుకోవాలి” అని ఆయన కోరారు. “పాకిస్తాన్ ఎజెండాను అమలు చేయాలని చూడకండి. మీ ఆశయం నెరవేరేది కాదు. కశ్మీర్‌లో మీరేంచేయలేరు. మోదీకి ప్రజల ఆశీర్వాదం ఉంది. ఏ శక్తి కూడా ఆర్టికల్ 370ని అక్కడ పునరుద్ధరించలేదు. నేను ఉన్నంత వరకూ మీ ఆటలు సాగవు” అని హెచ్చరించారు. బీజేపీ ఐటీ విభాగాన్ని చూసే అమిత్ మాలవ్యా మాట్లాడుతూ, “మొదట నుంచి ప్రజలను దారితప్పించటం వాళ్లకు అలవాటు. ఇప్పుడు కూడా అమాయక ప్రజలను రెచ్చగొట్టి మళ్లీ వీధుల్లోకెక్కేలా చేస్తున్నారు. ఆర్టికల్ 370 పై తమ వైఖరిని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 370 రద్దుపై జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో రగడ కొనసాగుతూనే ఉంది. ఇది ఎక్కడకు దారితీస్తుందో, జమ్మూ కశ్మీర్ ప్రజల జీవనంపైఎలాంటి ప్రభావం చూపుతుందో రాబోయే రోజుల్లో గానీ తెలియదని అన్నారు.

ఆర్టికల్ 370, 35(ఏ) రద్దు వల్ల ఈ ప్రాంతంలో తీవ్రవాద దాడులు 70 శాతం తగ్గుముఖం పట్టాయని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతుల్లో రాజ్యాంగం పుచ్చుకుని తిరుగుతారు. కానీ రద్దయిన ఆర్టికల్ 370 కి మద్దతు ఇస్తారు అని విమర్శించారు. “నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి కేబినెట్ ఏర్పాటు చేశారు. తొలి అసెంబ్లీ సెషన్ లో ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చర్చించాలి. కానీ మెజార్టీ పార్లమెంటు సభ్యులు తిరస్కరించి తీసుకున్న ఆర్టికల్ 370,35 (ఏ) రద్దు నిర్ణయాన్ని దెబ్బతీయాలని చూస్తున్నార''ని విమర్శించారు.




**డాక్టర్ పార్థసారథి చిరువోలు**

సీనియర్ జర్నలిస్ట్, 9908892065

వికారాబాద్ జిల్లాలో ఏకంగా జిల్లా కలెక్టర్‌పై దాడి జరిగింది. ఆయన వెంట ఉన్న కొందరు అధికారులను పలువురు ఇష్టం వచ్చినట్లు కొట్టారు. ఏదో అనుకోకుండా, క్షణికావేశంలో కాదు.. వెంటపడి మరీ.. ఓ రకంగా హత్యాయత్నమే జరిగింది. ఈ ఘటనలో ఓ ఉన్నతాధికారి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. అయితే, ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో... అది కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో... అంటే, తెలంగాణలో అసలేం జరుగుతోంది? ఏకంగా కలెక్టర్‌పైనా, ఆయన వెంట ఉన్న బృందంపైనా రాళ్లు, కర్రలతో దాడులు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? సీఎం ఇలాకాలోనే జరిగిన ఈ దాడిని ఎలా చూడాలి? అధికార కాంగ్రెస్‌పార్టీ వైఫల్యంగా చెప్పాలా? ప్రతిపక్ష బీఆర్ఎస్ పక్కా ప్లాన్‌తో రెచ్చగొట్టిందని అనుకోవాలా? అని నవంబర్ 11 నాటి దాడి పరిణామాలు తీవ్ర చర్చనీయాంశాలుగా మారాయి.

# అధికారులపై దాడికి

సాధారణంగా ఏదైనా ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు ఇష్టం లేకపోతే నిరసన తెలపొచ్చు. ఆందోళనలు నిర్వహించవచ్చు. మామూలుగా ప్రతిఘటించవచ్చు. కానీ, ఏకంగా జిల్లా ఉన్నతాధికారులపైనే రాళ్లు, కర్రలతో దాడి చేయడం అంటే.. ఇది శాంతిభద్రతల సమస్యే అంటున్నారు విశ్లేషకులు. నిఘా వ్యవస్థ వైఫల్యంగా చెబుతున్నారు. పోలీసుల అప్రమత్తత కరవైందని ఆక్షేపిస్తున్నారు. మొత్తానికి ప్రభుత్వమే ఈ ఘటనకు బాధ్యత వహించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. రాజధాని నగరంలో చిన్నపాటి నిరసన తెలిపితేనే, ఏదైనా సమస్యపై గొంతెత్తితేనే పోలీసులు ఎక్కడికక్కడ గొంతులు నొక్కేస్తారు. అరెస్టు చేసి లోపలేస్తారు. పదులు కాదు.. వందల మందినైనా అదుపులోకి తీసుకొని నిరసనలను అదుపు చేస్తారు. పరిస్థితులను చేజారకుండా అవసరమైన చర్యలు తీసుకుంటారు.

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయంలో కొంతకాలంగా రగడ నడుస్తోంది. స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ ఓసారి కాంగ్రెస్‌పార్టీ నాయకుడిపై భౌతిక దాడి జరిగింది. అలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉన్నతాధికారులుగానీ, పోలీసులు గానీ, నిఘా విభాగం గానీ అప్రమత్తంగా ఉండకపోవడం, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. జిల్లా ఉన్నతాధికారి అయిన కలెక్టర్ సహా.. ముఖ్య నాయకులందరూ వచ్చిన సభకు సరిపడా బందోబస్తు ఏర్పాటు చేయడం, బలగాలను మోహరించడం ఎందుకు చేయలేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

**ప్రణాళిక ప్రకారమేనా...?**

మరోవైపు.. సాధారణంగా ప్రభుత్వాధికారులన్నా, పోలీసులన్నా ప్రజలు కాస్త భయంతో, గౌరవంతోనే ఉంటారు. మరీ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పరిస్థితి ఉండదు. అసలు వీధి రౌడీల మాదిరిగా, గ్రామంలో గ్రూపు తగాదాల మాదిరిగా అధికారులపై ఏకంగా రాళ్లు, కర్రలతోనే దాడిచేసే పరిస్థితి ఉండదు. ముందుగా మానసికంగా సిద్ధమైతే తప్ప ఆ స్థాయిలో దాడి చేసేందుకు ఏర్పాట్లు కూడా చేసుకొని ఉండరని మానసిక నిపుణులు చెబుతున్నారు. పైగా.. వచ్చింది జిల్లా కలెక్టర్ అనీ, మిగతా వాళ్లంతా ఉన్నతాధికారులని గ్రామస్తులందరికీ తెలుసు. ఒక కలెక్టర్‌పైనా, ఉన్నతాధికారులపైనా ఈ స్థాయిలో దాడి చేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఈ రోజుల్లో దాదాపు అందరికీ తెలుసు. సాక్షాత్తూ జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌పైకే రాళ్లు, కర్రలతో వెళ్లారని, ఆయనతో వచ్చిన మరో అధికారిపై ఏకంగా హత్యాయత్నానికే పాల్పడ్డారని తెలిసి అందరూ విస్తుపోయారు. ఈ క్రమంలో లగచర్లలో అధికారులపై జరిగిన దాడి వెనుక ప్రతిపక్ష నేతల ప్రోత్సాహం ఉందని అధికార కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. ఈ ఘటన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరగడం చర్చనీయంగా మారింది.

కొడంగల్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ – కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డిపై ప్రజలు విచక్షణా రహితంగా కర్రలతో దాడి చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పైనా దాడికి యత్నించారు. ఈ ఘటనలో ఆయన వాహనం కూడా ధ్వంసమైంది. గ్రామస్థులు తమను మాట్లాడటానికే పిలిచారని, తీరా అక్కడికి వెళ్లాక కొందరు వారిని ప్రోత్సహించారని, దాంతో ఆ ఘటన జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ చెప్పారు.



**లగచర్లలో అసలేం జరిగింది?:**

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ఈనెల 11వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు వెళ్లారు. ముందుగా దుద్యాల శివారులో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ఏర్పాట్లు చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, దుద్యాల తహసీల్దారు విజయ్ కుమార్ కూడా ఆ ప్రాంతానికి వెళ్లారు. అయితే, ప్రజాభిప్రాయ సేకరణ జరిగే వేదిక వద్దకు రైతులెవరూ రాలేదు. వారంతా దుద్యాల మండలంలోని లగచర్ల అనే గ్రామంలో ఉన్నట్లుగా బాధిత రైతుల తరఫున సురేశ్ అనే వ్యక్తి అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికే వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. దీంతో అధికారులు లగచర్ల గ్రామానికి చేరుకున్నారు. అప్పుడే ఒక్కసారిగా జనం అక్కడ గుంపుగా చేరారు. 'కలెక్టర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఆందోళన కారులకు నచ్చజెప్పేందుకు కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు ప్రయత్నించారు. అయితే, ప్రజలు ఎంతకీ వినకపోగా.. అధికారులపైనే దాడికి దిగారు. కలెక్టర్‌ను తోసుకుంటూ ముందుకు వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై ఒక మహిళ వెనక నుంచి చేయి చేసుకు



# పర్యవసానం?

న్నట్లుగా వీడియోలో రికార్డయ్యింది. ఈ పరిణామంతో కలెక్టర్, ఇతర అధికారులు అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో జనం రాళ్లు, కర్రలతో అధికారులు, వారి వాహనాలపై దాడికి దిగారు. ఈ ఘటనలో కలెక్టర్ వాహనం వెనుక అద్దం పూర్తిగా ధ్వంసమైంది. ఇతర వాహనాల అద్దాలూ పగిలిపోయాయి. దుద్యాల తహసీల్దారు కారుపై ఆందోళనకారులు బండరాళ్లు విసరడంతో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. మరికొందరు గ్రామస్థులు వాహనాలను తరుముతూ రాళ్లు విసిరారు.

**ఫార్మా విలేజ్‌పై రగడ**

కొడంగల్ నియోజకవర్గంలోని పోలెపల్లి, హకీంపేట, లగచర్ల, దుద్యాల, ఈర్లపల్లి, పులిచెర్ల కుంట తండాలో పరిధిలో సుమారు 1,375 ఎకరాలు సేకరించి ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాకు పది లక్షల రూపాయల పరిహారం, ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, ఫార్మా కంపెనీలు వస్తే కాలుష్యం పెరుగుతుందని, తమ భూములకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని కొందరు బాధితులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే హకీంపేటలో కొందరు రైతులు సెప్టెంబరు నెల నుంచి నిరాహార దీక్షలు చేయడమే కాకుండా వివిధ రూపాల్లో ఆందోళనలు కూడా చేస్తున్నారు. ఈ యేడాది అక్టోబరు 25న కూడా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించగా, రైతులు అడ్డుకున్నారు. రోటిబండ తండాలో కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు అవిటి శేఖర్‌పై దాడి చేయడంతో పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించారు. తాజాగా అధికారులు మరోసారి ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన సమయంలో అధికారులపై దాడి జరిగింది.

**నిఘా వ్యవస్థల వైఫల్యం :**

ప్రజాగ్రహాన్ని అంచనా వేయడంలో నిఘా వ్యవస్థల వైఫల్యం కారణంగా జిల్లా అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. దీనికి తోడు వారి అతివిశ్వాసం కూడా దాడికి కారణమైంది. ఈ దాడి వెనుక నిఘా వ్యవస్థల తప్పిదాలు కనిపిస్తున్నాయి. పోలీసులకు ముందుచూపు కొరవటం కొట్టొచ్చినట్లు కనిపించింది. 200 మంది పోలీసులను మోహరించినా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సహా ఉన్నతాధికారులపై జరిగిన దాడిని నిలువరించ లేకపోయారు. వందల సంఖ్యలో గ్రామస్తులు, రైతులు అధికారులను రాళ్లు, కర్రలతో తరుముతుంటే ఘటనా స్థలంలో ఒకరిద్దరు పోలీసులు, గన్‌మెన్లు తప్ప ఎవరూ లేకపోవటం నిఘా వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఊరి బయట టెంటు వేశారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులను మాట్లాడదామని గ్రామంలోకి పిలిచి.. వచ్చి రాగానే దాడికి పాల్పడ్డారు. రెండు మూడు నెలలుగా ఫార్మా చిచ్చు రావణ కాష్టంలా రగులుతూ ఉంది.. ఇది వరకే పరిస్థితి లాఠీ చార్జి వరకు వెళ్లింది.. ఇంత జరుగుతున్నా ముందుస్తు వ్యూహం లేకుండా అధికారులు గ్రామంలోకి వెళ్లడం పెద్ద సాహసమే అని చెప్పవచ్చు.. పోలీసులెవరు అధికారుల వెంట లేకపోవడం దాడికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**లగచర్లలో బిక్కుబిక్కు:**

లగచర్ల ఘటనలో పోలీసులు మినహా అందరూ రైతుల చేతిలో దాడికి గురైనవారే. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, వారి గన్‌మెన్లు, సీసీలు, ఇతర రెవెన్యూ యంత్రాంగంపై దాడి జరిగింది. పోలీసులు మాత్రం సేఫ్ సైడ్‌గా ఉండిపోయారు. ఇటీవల ఫార్మాసిటీ భూ సేకరణ కోసం అధికారులు గ్రామానికి వెళ్లిన సమయంలో స్థానికులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఇది లాఠీ చార్జి వరకు దారి తీసింది. పరిస్థితి ఇంత సీరియస్‌గా ఉందని తెలిసి కూడా పోలీసులు అధికారులను రక్షణ కల్పించడంలో విఫలమయ్యారు.

గ్రామం వెలుపల రైతులతో మాట్లాడేందుకు వేసిన టెంటు వద్ద 200 మంది పోలీసులు ఉన్నా.. వారు అధికారులను వెంట గ్రామంలోకి వెళ్లలేదు. ఇప్పుడు దుద్యాల్ మండలం లగచర్ల గ్రామం భయం గుప్పిట్లో బిక్కుబిక్కు మంటోంది. దాడి అనంతరం వందల సంఖ్యలో పోలీసులు గ్రామానికి వెళ్లి పికెట్ ఏర్పాటు చేశారు. అధికారులపై నవంబర్ 11న దాడికి పాల్పడిన యువకులు గ్రామం వదిలి పారిపోయినట్లు సమాచారం. పోలీసులు ఎప్పుడు వచ్చి తీసుకెళ్తారో? ఏ కేసులు పెడతారో? అని బిక్కు బిక్కు మంటూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. చివరకు ఈ అంశం ఎక్కడి వరకు దారి తీస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**ఇటీవల ఫార్మాసిటీ భూ సేకరణ కోసం అధికారులు గ్రామానికి వెళ్లిన సమయంలో స్థానికులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఇది లాఠీ చార్జి వరకు దారి తీసింది. పరిస్థితి ఇంత సీరియస్‌గా ఉందని తెలిసి కూడా పోలీసులు అధికారులను రక్షణ కల్పించడంలో విఫలమయ్యారు. గ్రామం వెలుపల రైతులతో మాట్లాడేందుకు వేసిన టెంటు వద్ద 200 మంది పోలీసులు ఉన్నా.. వారు అధికారులను వెంట గ్రామం లోకి వెళ్లలేదు. ఇప్పుడు దుద్యాల్ మండలం లగచర్ల గ్రామం భయం గుప్పిట్లో బిక్కుబిక్కు మంటోంది.**

**సుజాత గోపగోని,**

**6302164068, సీనియర్ జర్నలిస్ట్**



# అభివృద్ధి- సంక్షేమాలకు సమ ప్రాధాన్యం

**అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను నవంబరు 11న అసెంబ్లీకి సమర్పించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు తన తొలి బడ్జెట్టులో పెద్దపీట వేసింది. ఇప్పటికే రెండు పథకాలు అమలుచేయగా, అమ్మ ఒడి, ఉచిత బస్సు పథకాలకు కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అభివృద్ధికి సముచిత స్థానం కల్పించింది. శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్‌ను, మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శాసనమండలిలో బడ్జెట్‌ను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. వ్యవసాయం, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్లనిర్మాణం సహా అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు ఈ బడ్జెట్ కేటాయింపుల్లో ఎక్కడా తగ్గలేదు.**

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లతో పద్దులు సరిపెట్టిన ప్రభుత్వం రెండు బడ్జెట్లకు కలిపి రూ. 2.39 లక్షల కోట్లకు ఆమోదం తీసుకుంది. 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్ రూ. 2.94 లక్షల కోట్లతో పద్దును స్థిరీకరించారు. కేబినెట్ సమావేశంలో బడ్జెట్ ఆమోదం అనంతరం, ఇ- ఆఫీస్ ద్వారా గవర్నర్‌కు పంపించారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆమోదం తీసుకున్నారు.

**రెండుసార్లూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్లే..**

ఈ ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గత ప్రభుత్వం నాలుగు నెలలకుగాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం మరో నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. నేటి అసెంబ్లీలో వచ్చే 4 నెలలకు పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఏప్రిల్ నుంచి జులై వరకు మొదటి 4 నెలలకు రాష్ట్రంలో జీతాల చెల్లింపులు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి రూ. 1,09,052.34 కోట్లకు ఆమోదం తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ. 2,86,389.27 కోట్లకు ప్రతిపాదించి 4 నెలల ఖర్చుకు ఆమోదం పొందారు.

**సూపర్ సిక్స్‌కు నిధుల కేటాయింపు**

ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కృషి చేస్తామని బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయిస్తావని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1-12వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని వివరించారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సలహాలను పట్టించుకోలేదని, ఈ ప్రాజెక్టును ఏళ్ల తడబడి గాలికొదిలేసిందని మండి పడ్డారు. వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కుంటుపడకుండా చూస్తామని, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్‌ను రూపొందించి నట్లు తెలిపారు. పట్టణాల్లో 204, గ్రామీణ ప్రాంతాల్లో 158 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచస్థాయి నగరంగా అమరావతి నిలవనుందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.

**ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి..**

ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆ మరుసటి నెలలో పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాల్సి ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులపై అవగాహన, పూర్తి సమాచారం కోసం వాయిదా వేయాల్సి వచ్చింది. మరో 4 నెలల కాలానికి తాత్కాలికంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు గవర్నర్ ద్వారా ఆర్డినెన్సు జారీ చేయించారు. ఆగస్టు నుంచి నవంబర్ వరకు ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు ఇతర నిర్వహణ ఖర్చులకూ కలిపి రూ. 1,29,972.97 కోట్లకు అనుమతులు తీసుకున్నారు. ఇప్పటి వరకు 8 నెలల కాలానికి రూ. 2,39,025.31 కోట్లకు అనుమతి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు




ప్రాధాన్యం ఇచ్చింది.

**రాష్ట్ర బడ్జెట్ స్వరూపం..**

వ్యవసాయ బడ్జెట్ రూ.43,402.33 కోట్లు, రెవెన్యూ వ్యయం అంచనా : రూ.2.34 లక్షల కోట్లు, మూలధన వ్యయం అంచనా : రూ.32,712 కోట్లు, రెవెన్యూ లోటు : రూ.34,743 కోట్లు, ద్రవ్యలోటు : రూ.68,743 కోట్లు, జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు అంచనా : 4.19 శాతం., జీఎస్‌డీపీలో ద్రవ్య లోటు అంచనా : 2.12 శాతం.

**వివిధ రంగాలకు కేటాయింపులు**

మానవ వనరులకు రూ.16,705 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.39,007 కోట్లు, ఎస్సీ సంక్షేమం కోసం రూ.18,497 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,557 కోట్లు, మైనార్టీలకు రూ.4,376 కోట్లు, మహిళ, శిశు సంక్షేమం కోసం రూ.4,285 కోట్లు, మానవ వనరుల అభివృద్ధికి రూ.1,215 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 29,909 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,326 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ. 18,421కోట్లు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.16,739 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.11,490 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.4,012 కోట్లు కేటాయించారు. పరిశ్రమలు వాణిజ్య రంగానికి రూ. 3,127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8,207 కోట్లు, ఆర్ అండ్ బీకి రూ. 9,554 కోట్లు, యువజన, పర్యాటక, సాంస్కృతిక విభాగాలకు రూ.322కోట్లు, పోలీస్ శాఖకు, రూ.8,495 కోట్లు, పర్యావరణ, అటవీ శాఖకు రూ. 687 కోట్లు ప్రత్యేకించారు.

**రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్**

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ, ఆరుగాలం ఇంటిల్లిపాది శ్రమించి అన్నం పెడుతున్న రైతన్నకు మనసావాచా కర్మణా శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేసు కుంటున్నా' అంటూ ప్రారంభించారు. 'వాని రెక్కల కష్టంబు లేని నాడు సస్య రమ పండి పులకింప సంశయించు వాడు చెమటోడ్చి ప్రపంచమునకు భోజనము పెట్టువానికి భుక్తి లేదు..” అని ప్రముఖ కవి గుర్రం జాషువా రైతుపై రాసిన కవితను చదివి వినిపించారు. గత ప్రభుత్వం మాత్రం రాష్ట్రానికి వెన్నెముక వంటి వ్యవసాయాన్ని గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర జనాభాలో 62 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడిందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి, రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ బడ్జెట్‌లో పకృతి వ్యవసాయానికి, సాంకేతికతకు ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ఉపయోగించి భూసార పరీక్షలు చేపట్టనున్నామని మంత్రి వివరించారు. ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా రాయితీపై ఎరువుల పంపిణీ చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.

**కేటాయింపులు..**


రాయితీ విత్తనాలకు రూ.240 కోట్లు, భూసార పరీక్షలకు రూ.38.88 కోట్లు, విత్తనాల పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువుల సరఫరాకు రూ.40 కోట్లు, 'పొలం పిలుస్తోంది' కి రూ.11.31 కోట్లు, పీఏసీల ద్వారా ఎరువుల పంపిణీ డిజిటల్ వ్యవసాయానికి రూ.44.77 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు, వడ్డీ లేని రుణాల కింద రూ.628 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.4,500 కోట్లు, రైతు సేవా కేంద్రాలకు రూ.26.92 కోట్లు, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌కు రూ.44.03 కోట్లు, పంటల బీమాకు రూ.1,023 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.8,564.37 కోట్లు, ఉద్యానశాఖ శాఖకు రూ.3,469.47 కోట్లు, పట్టు పరిశ్రమకు రూ.108.44 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్‌కు రూ.314.8 కోట్లు, సహకార శాఖకు రూ.308.26 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422.96 కోట్లు, ఎన్జీ రంగా యూనివర్సిటీ – రూ.507.3 కోట్లు, ఉద్యాన యూనివర్సిటీ – రూ.102.22 కోట్లు, వ్యవసాయ పశు విశ్వవిద్యాలయానికి రూ.171.72 కోట్లు, ఫిషరీస్ యూనివర్సిటకి రూ.38 కోట్లు, పశు సంవర్ధక శాఖకు– రూ.1,095.71 కోట్లు, మత్స్యరంగం అభివృద్ధి కి రూ.521.34 కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ.7,241.3 కోట్లు, ఉపాధి హామీ అనుసంధానం కార్యక్రమానికి రూ.5,150 కోట్లు, ఎన్టీఆర్ జలసిరి – రూ.50 కోట్లు, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ – రూ.14,637.03 కోట్లు కేటాయించారు.

**వైసీపీ పాలనలో బాధ్యతారాహిత్యం**


ఈ పూర్తి స్థాయి బడ్జెట్‌ను నవంబరులో ప్రవేశపెట్టడం ఒకటైతే, బడ్జెట్ వేళ చర్చకు ప్రతిపక్షం లేకపోవడం శోచనీయం. 11 సభ్యులు కలిగిన వైసీపీ తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని కినుక వహిస్తూ చర్చకు హాజరు కాకపోవడం బాధ్యతారాహిత్యం. సమస్యల గురించి ప్రస్తావించేందుకు, ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలకు అసెంబ్లీ సమావేశాలు ఒక చక్కని అవకాశం. ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లోని సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుంటే ఎవరు ప్రస్తావిస్తారు? సమస్యల పరిష్కారం ఎలా సాధ్యం అవుతుంది? జగన్ హాజరు కాకున్నా కనీసం మిగతా ఎమ్మెల్యేలను కూడా పంపక పోవడం పెద్ద తప్పుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. జగన్ తీరు అసలుకే మోసం తెచ్చేలా ఉందని సొంత పార్టీ నేతలే బాహటంగా అంటున్నారు. జనం ఇస్తేనే కదా అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కేది ఆ పదవి ఇస్తేనే సభకు వెళ్తానని మారం చేయడం ఏంటని సొంత పార్టీ నేతలు ఆక్షేపిస్తున్నారు.

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి రెండు రోజుల క్రితం తాడేపల్లిలో తనను ఎదురు ప్రశ్నించని విలేకరులను ముందేసుకుని జగన్ మాట్లాడారు. సభలో మాట్లాడినట్లే మీడియాతో రోజూ గంటసేపు మాట్లాడతానని, ప్రజా సమస్యలు లేవనెత్తుతానని ప్రకటించడం హాస్యాస్పదం అయింది. జగన్ వ్యాఖ్యలపై ప్రత్యర్థి పార్టీలు మండిపడ్డాయి. ఆయన చెప్పిందల్లా వింటేనే ప్రజాస్వామ్యమా? అని విరుచుకుపడ్డాయి.

తమ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తేందుకు జనం శాసనసభ్యులుగా గెలిపించి పంపారని, ప్రతిపక్ష హోదా వస్తుందనో, ప్రతిపక్ష నేత పదవి వస్తుందనో కాదని.. జగన్ సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇదే డిమాండ్‌ను అందుకున్నాయి. జగన్ బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించాయి. సభలో పార్టీలు, సంఖ్యాబలం ప్రకారమే విపక్ష హోదా, విపక్ష నేత హోదా లభిస్తాయని తెలిసీ, నాటకాలు ఆడుతున్నారని ఆ పార్టీల నాయకులు చెప్పారు. గత ఐదేళ్ల దుష్పరిణామాలపై సభలో అధికారపక్షం నిలదీస్తే జవాబు ఇవ్వలేమని ముందే చేతులెత్తేసారని, దీన్ని కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు సాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**




45

# యామునాచార్య లక్ష్య ఫలసిద్ధుడు రామానుజులు

శాంతి, ఇంద్రియ నిగ్రహం, విచక్షణాజ్ఞానం, నిరపేక్షాభావం – ముక్తికి ప్రముఖ సాధనాలని, మరొక విధంగా అనుభవంలోకి రాని ఈ గుణాలను పెంపొందించడం ద్వారా వర్ణాశ్రమ ధర్మములు ఆత్మను క్షాళితం చేస్తాయని కంచి కామకోటి పీఠాధిపతి, పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్రస్వామి అభిభాషించారు. మానవుడు వర్ణాశ్రమ ధర్మాలకు కట్టుబడుతూ, తనను శ్రీహరికి సంపూర్ణంగా అర్పించుకొన్నప్పుడే వైరాగ్యం మొదలైన చతుర్విధ మోక్ష సాధనాలు లభ్యమవుతాయని అన్నారు.

“తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే కార్యకార్య వ్యవస్థితౌ” అని గీత పేర్కొంది. కనుక నీవు ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో అన్న విషయంలో శాస్త్రం నీకు మార్గదర్శకంగా ఉంటుంది. ఈ శ్లోకంలో ‘తస్మాత్’ అంటే ‘అందువలన’ అనేది శాస్త్ర విషయంలో ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే వివేచన గురించి చెప్పింది. ఆ వివేచన అంటే ఏమిటి? ఈ విషయం గీతలో పై శ్లోకం ముందు అదే సందర్భంలో పేర్కొంది. ‘ఆత్మ వినాశనానికి నరక ద్వారాలను తెరిపించే విధానాలు మూడు. అవి కామ,క్రోధ,లోభాలు. ఈ మూడింటినీ వదలి పెట్టాలి. పాపాంధకారానికి ఉనికి పట్టయిన ఈ మూడింటికీ దూరమైనవాడు ఉన్నతిని పొందడమే గాక, చరమ లక్ష్యాన్ని అందుకోగలుగుతాడు. శాస్త్రోక్తమైన ఈ విధిని ఉల్లంఘించి తన ఇష్టం వచ్చి నట్లు ప్రవర్తించే వ్యక్తి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేడు. అట్టివాడు ఆనందానుభూతిని చవి చూడలేదు. చరమ లక్ష్యాన్ని చేరలేడు’అని గీతలో శ్రీకృష్ణపరమాత్మ అన్నారు. ఈ శ్లోకాల తరువాతనే “తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే” అనే శ్లోకం ప్రారంభమైంది. వర్ణాశ్రమ ధర్మానుసరణం ఆత్మోద్ధరణకు, ఆత్మ నైర్మల్యానికి దారి తీయగలదని గీతోపదేశాన్ని అనుసరించే శ్రీ శంకరులు చెప్పారు.


సర్వసంగ పరిత్యాగియైన శ్రీ శంకరులు, ఉపనిషత్తులలోని సత్యాలను తన భాష్యాల ద్వారా గంభీరమూ, రసవంతమై తేటతెల్లమయ్యే శబ్దాలతో చెబుతూ, దక్షిణాన రామేశ్వరం నుంచి ఉత్తరాన హిమాలయాల వరకు పాదయాత్రగా వెళ్లారు. తీర్థక్షేత్రాలు, పల్లె పట్టణాలు, గుడి గోపురాలు అన్నీ వారి కారణంగా పవిత్రమయ్యాయి. వారి యంత్ర, మంత్ర శక్తులతోను, ఆయా ప్రార్థనా పటిమతోను, ఆయా ప్రదేశాల ఆధ్యాత్మికత్వం ఇనుమడించింది. వారి దివ్య సాంగత్యం వల్ల ప్రభావితం కాని పవిత్ర ప్రదేశం ఏదీ లేదు. ఇప్పటికీ కూడా మన దేశంలో ప్రతిచోటా శంకరులు తమ ఆలయాన్ని పవిత్రం చేశారనీ, యంత్రాలద్వారా వాటిని మరింత ప్రభావితం చేశారనీ ప్రజలు సగర్వంగా చెప్పుకొంటూ ఉంటారు. వేద పారాయణం జరిగే ఏ ప్రదేశంలోనైనా, గురుశిష్య సంప్రదాయాన్ని అనుసరించి, ముక్తిని కాంక్షించే ఏ ప్రాంతంలోనైనా శ్రీ శంకరుల భాష్యాలను చదవని చోటు లేదు. ఈనాటికీ వేద విద్యాభ్యాసం జరిగే ప్రతిచోట శ్రీ శంకరుల భాష్యం చదవాల్సిందే.

నవీన శాస్త్రాభివృద్ధి జీవిత చైతన్యాన్ని మారణాయుధాలతో రూపుమాపేదనీ, ప్రపంచానికి కలిగే అనంతమైన అపాయానికి ఆలవాలమైనదనీ అంటున్నారు. కానీ ఇంకో దృక్కోణం నుంచి శాంత చిత్తంతో పరికిస్తే ఈ శాస్త్రాభివృద్ధి మానవ శాంత్యభ్యుదయాలకు కారణభూతమని తెలుస్తుంది. యాభై సంవత్సరాల క్రితం పదార్థం అనేక రకాల మూల వస్తులతో కూడి ఉన్నదనీ, వస్తువులకు ఎటువంటి సంబంధం లేదనీ పదార్థ విజ్ఞాన శాస్త్రజ్ఞులు భావించారు. కాని ఇప్పుడు మాత్రం వారు పదార్థంలోని మూల ద్రవ్యాలన్నీ సంబంధ విహీనములైనవి కావనీ, స్వరూపం గల పదార్థంలోను, స్వరూప రహితమైన వాటిలోను భేదం లేదంటూ, అవన్నీ ఒకే శక్తి రూపాంతరాలని చెప్పుతున్నారు. ఈ విధంగా నవీన విజ్ఞానవేత్తలు విభేద సూత్రాన్ని వదలి, విభేదరహిత తత్వంలోని సత్యాన్ని అవగాహన చేసుకుంటున్నారు. అందులో ముఖ్యంగా ఐన్‌స్టీన్ సర్ జేమ్సు, జీన్స్ ఎడ్డింగ్‌టన్ వంటి మేధా సంపన్నులు, శ్రీ శంకర భగవత్పాదులు ప్రవచించిన అద్వైత సిద్ధాంతానికి చేరువగా వస్తున్నారు.

దృగ్గోచరణమైన భౌతిక జగత్తు చరమ సత్యం కాదనీ, అది సాపేక్షం మాత్రమే సత్యమనీ ప్రకటించారు.

**– శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి, 22.5.59 జాగృతి**

ఆధ్యాత్మికం




# శ్రీరామ మార్గదర్శి సుతీక్ష్ణుడు

‘అందరిని దరిజేర్చే మారాజువే/అద్దరిని చేర్చమని అడుగుతుండావే’అని గుహుడి పాత్ర ద్వారా శ్రీరాముడిని అడిగించాడు ఒక జానపద కవి. త్రేతాయుగంలో ఇది నిజమని పురాణాలు చెబుతున్నాయి. మహాశక్తిమంతులు, మానవ శ్రేయోభిలాషులైన మహర్షులు దేవునికే దారిచూపగల ధన్యాత్ములనేందుకు సుతీక్ష్ణ మహర్షి ఒక ఉదాహరణ. ఆయన అగస్త్యుడి సోదరుడు, శిష్యుడు. దుష్పన్యుడనే క్రూరుడిని సద్గుణ సంపన్నుడిని చేశాడు. దండకారణ్యంలో దేవతా సముదు శరభంగ మహర్షి ఆతిథ్యం స్వీక రించిన శ్రీరాముడు, భార్య సీత, సోదరుడు లక్ష్మణుడి సమేతంగా సుతీక్ష్ణ మహర్షి ఆశ్ర మానికి చేరుకున్నాడు. మహాకాలమేఘంలా ఎత్తుగా, విశాలంగా ఉన్న పర్వత ప్రాంతంలోని ఆశ్రమంలో శరీరం దుమ్ముధూళితో నిండి, జడలు కట్టిన కేశాలతో తపోనిమగ్నులైన మహర్షికి రాముడు వినయాంజలి సమర్పించాడు. ‘ఈ దేహం వీడి ఇంద్రలోకానికి వెళ్లవలసిన వాడిని. శరభంగ మహర్షిని దర్శించిన దేవేంద్రుడు ఇక్కడికీ వచ్చి తన లోకానికి ఆహ్వానించాడు. కానీ చిత్రకూటం నుంచి ఏ క్షణాన వస్తావోనని నిరీక్షిస్తున్నాను. నీ రాకతో ఈ ఆశ్రమం పావనమైంది’ అని సాదరంగా స్వాగతం పలికాడు మహర్షి.శరభంగ మహర్షిలానే తన తపోశక్తులను ధారపోసేందుకు

# వర్ణాశ్రమ ధర్మ పరిరక్షణతోనే పురుషార్థ సాధన సాధ్యం

45



విశిష్టాద్వైత ప్రవర్థకులు యామునాచార్యుల దర్శనం కోసం శ్రీరంగం చేరుకున్న రామానుజా చార్యులకు ఆ భాగ్యం దక్కలేదు. అప్పటికే పరమ పదం చేరిన ఆయన మూడ వేళ్లు ముకుళితమై ఉండడాన్ని గమనించిన రామానుజులు అక్కడి వారిని కారణం అడుగగా, బ్రహ్మ సూత్రాలపై భాష్య రాయడం, ఆళ్వారుల సిద్ధాంత ప్రచారం ద్వారా ప్రవృత్తి మార్గాన్ని లోకానికి బోధించడం, విశిష్టా ద్వైతమును దిగ్విజయ పూర్వకముగా ప్రతిష్ఠించడం. ఆయన ఆశయాలని బదులిచ్చారు. వాటిని నెరవేర్చుతానని రామానుజులు ప్రతిజ్ఞ చేయగానే యామునువారి వేళ్లు తెరచుకున్నాయి.

రామానుజులు శ్రీరంగం నుంచి కంచి తిరిగి వచ్చి కాంచీపూర్ణుని శుశ్రూష చేయుసాగారు. తన భావి కార్యక్రమం నిర్ణయించవలసిందిగా వరద రాజస్వామిని ప్రార్థించగా, శ్రీరంగం వెళ్లవలసినదిగా అక్కడి అర్చకస్వామి సూచించారు.దానిని భగవదాజ్ఞగా భావించి అక్కడికి ప్రయాణమయ్యారు. త్రోవలో మధురాంతకంలో తనకోసం వస్తున్న మహా పూర్ణస్వామిని కలసికొని దీక్ష స్వీకరించారు. ఆయనతోపాటు తిరిగి కంచికి చేరి, మహాపూర్ణుని తన ఇంటనే ఉంచుకొని బ్రహ్మసూత్రాలతో పాటు మూడువేల గాథలను ఆయన వద్ద అధ్యయనం చేశారు.

రామానుజుల భార్య ఆయనకు తగినట్టిది కాదాయెను. ఒకనాడు అధమ జాతికి చెందిన భక్తు డొకడు ఇంటికి రాగా, రామానుజులు సగౌరవంగా ఆతిథ్యమిచ్చారు. ఆతను వెళ్లిపోయిన తరువాత రామానుజుల భార్య ఆ ప్రదేశాన్ని కడగారు. రామానుజులకు అది ఎంతో దుఃఖం కలిగించింది. మరొకమారు ఆయన చెప్పినప్పటికీ ఆమె ఒక భిక్షువునకు భోజనం పెట్టదాయె. మరొకసారి ఆయన లేనప్పుడు ఆయన భార్య గురుపత్నిని ఎన్నో మాటలతో తూలనాడెను. అందుపై గురువు శ్రీరంగంనకు వెళ్లిపోయారు. విసుగెత్తిన రామా నుజులు భార్యను పుట్టింటికి పంపి తాను వరదరాజ స్వామి అనుమతితో సన్యాసం గ్రహించారు. అప్పటికి ఆయన వయస్సు 30–32 ఏళ్లు.

రామానుజులు సన్యాసియైన తరువాత తన మేనల్లుడు, అనంతభట్టు కుమారుడు కూర్మనాథునికి మొదటగా దీక్ష ఇచ్చారు. ఆయన పూర్వపు గురువు యాదవ ప్రకాశుడు కూడ ఆయనకు శిష్యుడై "గోవిందదాసు" అను పేరు గ్రహించి "యతిధర్మ సముచ్చయ" అనే గ్రంథం రాశారు. రామానుజల కీర్తి దిగంతములకు పాకింది. అసంఖ్యాకులగు విద్యార్థులు ఆయన వద్ద వేదాంతాధ్యాయనముకై రాసాగిరి. ఆ రోజులలోనే యామునాచార్యుల పుత్రుడు వరదరంగాదులు వచ్చి, ఆయనను శ్రీరంగానికి దయచేసి అక్కడి అధ్యక్ష పదవి గ్రహించవలసిందిగా ప్రార్థించారు.

శ్రీరంగం చేరుకున్న రామానుజులు తిరిగి గోష్ఠీపూర్ణుని వద్ద దీక్ష పొందగా, మంత్ర రహస్యం ఉపదేశించి,దానిని మరెవరికి చెప్పరాదని శాసించారు. దానిని తారక మంత్రంగా ఎరిగిన రామానుజులు ఆలయ గోపునం ఎక్కి, స్త్రీ పురుషుల విచక్షణ లేకుండా బిగ్గరగా మంత్రం పఠించారు. ఆగ్రహించిన గోష్ఠీ పూర్ణుడు, 'నీవీ పని చేసినందులకు ఎంతో కాలము నరకం అనుభవిస్తావు' శపించాడు. శ్రీ రామానుజులు శాంతంతో 'ఈ మంత్రం వల్ల ఇంతమంది ముక్తులైనప్పుడు, నేనొక్క డను నరకంలో ఉండేందుకు ఇష్టమే'నని బదులు చెప్పారు.ఆయన ఉదారతకు ముగ్ధుడైన గురువు, నేటి నుంచి విశిష్టా ద్వైతం 'రామానుజ దర్శనం'గా కీర్తి పొందుతుందని ఆశీర్వదించారు. రామానుజుల యశోవిస్తారమునకు ఓర్వని రంగనాథుని అర్చకుడు ఆయనకు విషం పెట్టి చంపజూచారు. కాని రామానుజుల యతివేషముపై ముగ్ధురాలైన అర్చకుని భార్య ఈ కుట్రను బయటపెట్టింది.అర్చకుడు, తన నీచతకు సిగ్గొంది రామానుజుల శరణువేడగా ఆయనను క్షమించారు.

రామానుజుల కీర్తి పతాక పతనాన్ని అపేక్షించి ఎంతోమంది విద్వాంసులు ఆయనతో శాస్త్రార్థమునకై రాసాగిరి. యజ్ఞమూర్తి అనే అద్వైత సన్యాసి దిగ్విజ యార్థం శ్రీరంగంవచ్చి రామానుజులతో 16 రోజులు శాస్త్రార్థము చేసి ఓడిపోయాడు. ఆ తరువాత ఆయన 'దేవరాట్' లేక "దేవమన్నాధ" అనే పేరుతో వైష్ణవుడై, 'జ్ఞానసారం' "ప్రమేయసారం' అనే గ్రంథాలు రాశారు. రామానుజులు మొదటగా "గద్యత్ర యమును" రాశారు.

–కె.సచ్చిదానందమూర్తి, 10.5.65 జాగృతి

సంసిద్ధులు అవుతుండగా,'మహాత్మా! ఇప్పుడు మా ఆవాసానికి ప్రశాంతమైన ప్రదేశం కావాలి. ఆ మార్గం చూపి తరింప చేయండి' అన్న రాముడితో, ఈ తపో భూమి పరమ పవిత్రమైనదని, ఇక్కడ నీరు, కందమూలాలు సర్వం సమృద్ధిగా ఉన్నాయి కనుక ఇది ప్రశస్థమైనదని సూచించాడు. మీ ఆదేశం శిరోధార్యం కానీ, ఇక్కడికి వచ్చే మృగ సంతతి రక్షణార్థం చేసే ధనుష్టంకారం ఇక్కడి ప్రశాంత తకు భంగం కలగవచ్చుని, మరో ప్రాంతాన్ని అన్వేషిస్తానని బదులు ఇచ్చాడు రాముడు. రుషులు స్వీకరించే ఆహారాన్ని సుతీక్ష్ణులే వారికి స్వయంగా వడ్డించారు. ఆతిథ్య సత్కారాలు నిరుపమానమంటూ రాముడు కృతజ్ఞతలు తెలిపాడు. ఆయన వినయవిధేయతలకు సంతోషించిన మహర్షి, ఈ దండకారణ్యంలో మహనీయ మహర్షులను దర్శించి ఆశీస్సులు అందుకోవాలని దీవించాడు.

మునిగణ, వనచరులను కాపాడేందుకు, రాక్షససంహారంకోసం అవతరించిన శ్రీరామ చంద్రునికి తమ వంతు సాయం అంద చేయా లన్నదే అందరి భావన .అంతేతప్ప ఆయన బల పరాక్రమాలను తక్కువగా అంచనావేయడం కాదని ఆధ్యాత్మికవేత్తలు వ్యాఖ్యానిస్తారు. మనిషిగా చరించి, సర్వులనూ ప్రేమిస్తూ వారి సలహా సూచనలు స్వీకరించి 'మనీషి' ఎదిగారని చెబుతారు. విద్యాబుద్ధులు నేర్పిన కులగురువు వశిష్ఠుడు, అస్త్రశస్త్రాదులు ప్రసాదించిన విశ్వా మిత్రుడిలానే సుతీక్ష్ణాది మహర్షులు రాముడికి మార్గదర్శులే.

– రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి

**Serve the living God,**
**God comes to**
**you in the blind,**
**in the halt, in the poor,**
**in the weak,**
**in diabolical**

కళ్లులేనివాడు కదు దరిద్రుండును
దూర్తుడైనవాడు దుర్బలుండు
వివిధ రూపములను విష్ణువున్ సేవించు
వినుడి స్వామి సద్వివేకవాణి॥





బండిరాజుల శంకర్





**నా పేరు వంశీధర్! అందరూ వంశీ అనీ పిలుస్తారు. సివిల్ ఇంజనీరింగ్‌లో జేయేన్‌టీయూ నుంచి డిగ్రీ చేసాను. నా స్నేహితులందరూ కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిగ్రీ చేస్తే నేను మాత్రం పాతకాలపు సివిల్ ఇంజనీరింగ్‌లో చెయ్యడం చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది.**

నేను మా ఊళ్లో పదవ తరగతి దాకా చదివి ఆ తరువాత దగ్గరలోని చిన్న పట్నంలో ఇంటర్ చదివాను. పదవ తరగతి చదువుతున్నప్పుడు నాకు నలుగురు స్నేహితులుండేవారు. వాళ్లు సమీర, మధు, శ్రీరామ్. సమీరది మా ఊరే. మా మేనమామ కూతురు. మధు, శ్రీరామ్‌లవి పక్క ఊళ్లు. మా నలుగురికీ పదవ తరగతిలో ప్రథమశ్రేణి రావడంతో మేమంతా కలిసి ఒకే కాలేజీలో ఇంటర్ చదివాం. అందరం ఎంపీసీ గ్రూప్ తీసుకున్నాం.

పదవ తరగతి దాకా సాదాసీదాగా సాగిన మా జీవితం ఇంటర్లో చేరిన తరువాత ఒక నూతనత్వాన్ని సంతరించుకుంది. దానికి కారణం మా కాలేజీ లెక్చరర్లు. ముఖ్యంగా ఇంగ్లీషు లెక్చరర్ అనంతరాం గారు. ఆయన మాకు హీమాన్... హీరోలా కనిపించే వారు. ఎప్పుడు ఇస్త్రీ నలగని బట్టలతో, టక్, టైతో చాలా హుందాగా ఉండేవారు.

ఆయన 'మర్చెంట్ ఆఫ్ వెనీస్' నాటకాన్ని అద్భుతంగా చెప్పేవారు. టెనిసన్, వర్డ్స్‌వర్త్‌ల పోయిట్రీ కూడా అంతే బాగా చెప్పేవారు. అలాగే తెలుగు లెక్చరర్ సుబ్రహ్మణ్యశర్మ గారు. పద్యభాగాన్ని అద్భుతంగా చెప్పేవారు.



గన్నవరపు నరసింహమూర్తి

"అటజని గాంచె భూమి సురుడంబర చుంబి
శ్శిరస్సర ఝ్జరీ పటల ముహుర్ముహుర్లుఠ ధభంగ తరంగ
మృదంగ నిస్వన స్ఫుట నటనానుకూల పరిపుల్లవ కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్"

అన్న మనుచరిత్రలోని పెద్దన పద్యాన్ని ఎంతో హృద్యంగా ఆలపిస్తూ వర్ణిస్తూ దాని అర్థాన్ని చెప్పేవారు. చిన్నప్పట్నుంచీ నాకు పద్యాలంటే బాగా ఇష్టం. దానికి కారణం మా ఊళ్లో చూసిన పౌరాణిక పద్య నాటకాలు. ప్రతి శివరాత్రికీ నాటకాలు పెట్టేవారు. పీసపాటి, షణ్ముఖి ఆంజనేయరాజు లాంటి గొప్ప నటులు శ్రీకృష్ణరాయబారం, హరిశ్చంద్ర, గయోపాఖ్యానం లాంటి నాటకాలాడే వారు. ఆ నాటకాలు చూడటం వల్ల మాకు పద్యాలు కంఠోపాఠం అయ్యేవి.

వేమన పద్యాలు, సుమతీ శతకం, రంగస్థల పద్యాలు, ఇలా మా నోటి వెంట చాలా పద్యాలు అలవోకగా పలికేవి. ఇంటర్లో సెలవులకు మా ఊరు వచ్చినపుడు చాలా ఆనందంగా గడిచేది.

ఇంతకీ మా పల్లె గురించి మీకు చెప్పలేదు కదూ! అది ఏటి ఒడ్డున ఒదిగి ఉండే ఓ అందమైన, అమాయకమైన పల్లె. అందులో మాది అగ్రహారం వీధి. మా పెరట్లోనే ఏరు. తూర్పు వాహినిగా పారుతుంటుంది.

తెల్లవారిందంటే మేమంతా ఏటి ఒడ్డునే ఉండేవాళ్లం. కబాడీ, కోకో, వాలీబాల్ ఆటలు ఆ ఒడ్డునే ఆడేవాళ్లం. ఆటల తరువాత ఏట్లో స్నానం చేసి ఇంటికి వచ్చేవాళ్లం. వర్షాకాలంలో ఏటికి బాగా నీరొచ్చేది. అప్పుడు గంటకి పైగా అందులో ఈత కొట్టేవాళ్లం. మా ఊరి ఎలిమెంటరీ స్కూల్లో మా నాన్న టీచర్‌గా పని చేసేవారు. పేరు శర్మ... మా మేనమామ రమణమూర్తి కూడా టీచరే.. ఆయన కూతురే సమీర... ఆమె పూర్తి పేరు మలయ సమీర.

ఆమె నా కన్నా సంవత్సరం చిన్న. తెలివైనదని నాలుగు నుంచి ఆరవ తరగతిలో చేర్పించాడు మా మామ. అందుకే నేనూ, సమీరా ఆమె చిన్నదైనా ఒకే క్లాసు చదివేవాళ్లం.

పదవ తరగతి దాకా మాకు చదువంటే పెద్దగా అవగాహన ఉండేది కాదు. ఏదో చదవాలి కాబట్టి చదివే వాళ్లం. వేసవి తరువాత పొలం పనులు మొదలయ్యేవి. నాకు చిన్నప్పట్నుంచీ వ్యవసాయం అంటే బాగా ఇష్టం. ప్రతీరోజూ మా రైతు నారాయణతో పొలానికి వెళ్లేవాణ్ణి.

మా పొలం దగ్గర పెద్ద చెరువు ఉండేది. దాన్నించే మా పొలాలకు పెద్ద బట్టి ద్వారా నీళ్లు వచ్చేవి. ఒక్కోసారి నేను ఆ చెరువు గట్టు మీదకు



వెళ్లి అక్కడ చింతచెట్టు కింద చాలా సేపు కూర్చునే వాణ్ణి. బాగా వర్షాలు పడినప్పుడు చెరువు నిండు కుండలా ఉండేది. కనుచూపు మేరంతా నీరే. ఆ నీటి మీద తెల్లటి నీటి బాతులు, కొంగలు ఎగురు తుండేవి. అప్పుడప్పుడు మా రైతు నారాయణ చేపల కోసం అందులో దిగి వాటిని పట్టేవాడు.

అతడు, 'బాబూ మీరు చేపలు తింటారా?' అనీ నన్ను వెటకారం చేసేవాడు. వర్షాలు పడకపోతే చెరువు నిండేది కాదు. పంటలు పండేవి కావు. మేము జూలైలో వరి నారు, అంటే ఆకు పోసేవాళ్లం. అవి పెద్దదైన తరువాత నీరుంటే పొలాల్లో ఊడవాలి.

వినాయక చవితి పండగప్పుడు మా ఊరి రైతులంతా రోజూ వర్షం పడాలనీ దేముడికి దండాలు పెట్టేవారు. ఒక్కోసారి బాగా కరవొచ్చి వర్షాలు పడక పోతే బ్రాహ్మణులు ఏటి దగ్గర అభిషేకాలు చేసేవారు.

అభిషేకం చేసేరోజు మా చిన్నాన్న రామమూర్తి ఏటి ఒడ్డున ఉపవాసంతో విరాటపర్వం పారాయణ చేసేవాడు. అది పూర్తయ్యేసరికి, అంటే అర్జునుడి ఉ త్తర గోగ్రహణం తరువాత వర్షాలు పడతాయనీ మా ఊరివాళ్ల నమ్మకం. ఒకోసారి యాదృచ్ఛికంగా వర్షం పడితే విరాటపర్వం పారాయణం, అభిషేకం వల్లే వర్షం పడిందనీ ఊళ్లో వాళ్లు చెప్పుకోవడం

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**



నాకు వింతగా తోచేది. చిన్నప్పట్నుంచీ నేను అలాంటి నమ్మకాలకు వ్యతిరేకం.

ఇంత ఏరు పారుతున్నా పొలాలకు నీళ్ల లేకపోవడం అప్పుడప్పుడు ఆశ్చర్యం కలిగేది... ఆ ఏటి నీటిని చెరువులోకి మళ్లిస్తే అన్న ఆలోచన కలిగేది. బహుశా ఇటువంటి ఆలోచనలే భవిష్యత్తులో నేను సివిల్ ఇంజనీరింగ్ చదవడానికి ప్రేరణ కలిగించాయేమో అన్న సంశయం నాకు కలుగు తుంటుంది.

పదవ తరగతిలో నేను, సమీర పోటీ పడేవాళ్లం. క్వార్టర్లీ పరీక్షల్లో ఆమెకు ఫస్ట్ వస్తే, హాఫ్ యర్లీలో నాకు వచ్చేది. అలా మా ఇద్దరి చదువు పోటా పోటీగా సాగేది. మధు, శ్రీరామ్‌లు కూడా బాగా చదివే వాళ్లు. ఎలాగైతేనేం పదవ తరగతిలో మేం నలుగురం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యాము.

ఫలితాలొచ్చిన నాడు మా ఆనందం చూడాలి... మా అమ్మ లడ్లు చేసి ఊరందరికి పంచింది.

ఆ తరువాత మేం నలుగురం పక్కనే ఉన్న పట్నంలోని జూనియర్ కాలేజీలో ఇంటర్లో చేరాము. రోజూ అడ్డురోడ్డు దాకా నడిచి అక్కణ్ణుంచి నేను, సమీర బస్సులో కాలేజీకి వెళ్లేవాళ్లం.

ఒకరోజు కాలేజీకి వెళుతూ సమీరను పిలిచేందుకు వాళ్లింటికి వెళ్లాను. సమీర గాబరా పడుతూ బయటకు వచ్చింది. ఇద్దరం అడ్డరోడ్డుకి చేరుకున్నప్పుడు 'మా ఇంటికి ఎప్పుడూ రావద్దు. నాన్నకిష్టం ఉండదు. నేను రోజూ నీతో కలిసి కాలేజీకి వెళుతున్నానని తెలిస్తే నాన్న కోప్పడతాడు' అంది.

ఆమె మాటలకు నేను ఆశ్చర్యపోయాను. ఒకే స్కూల్లో మా నాన్న ,మా మేనమామ లిద్దరూ ఉపాధ్యాయులైనా బావ, బావమరుదిలిద్దరికీ పడేది కాదు. మా అమ్మనాన్నల పెళ్లిలో ఏదో గొడవొచ్చిందిట. అప్పట్నుంచీ రెండు కుటుంబాల మధ్య ఎడం పెరిగింది. ఆ తరువాత నేనెప్పుడూ సమీర వాళ్లింటికి వెళ్లలేదు. ఒకే ఊళ్లో ఉంటున్నా మా అమ్మ ఎందుకు తమ్ముడింటికి వెళ్లదో నా కిప్పుడు అర్థం అయింది.

ఈ విషయం పక్కన పెడితే సమీర నాతో సన్నిహితంగానే ఉండేది. ఆమె అన్నింటికి నామీదే ఆధార పడేది. బస్సు పాసు దగ్గర్నుంచీ కాలేజీలో కట్టే ఫీజులు దాకా అన్నీ నేనే చెయ్యాలి... పుస్తకాలను నేనే కొనే వాడిని. ఇంక కాలేజీకి వెళుతున్నప్పుడు, ఇంటికి వస్తున్నప్పుడు బస్సులో ఆమెకు అర్థం కాని లెక్కలు, సైన్స్ చెప్పేవాడిని.

నా పేరెప్పుడూ ఆమె పెదవుల మీద ఉండేది.– మాట్లాడిందంటే వంశీ అని వచ్చేది... అంతగా నాతో చనువు పెంచుకుంది. నేను మొదట్లో పట్టించుకోకపోయినా అప్పుడప్పుడు నాతో సన్నిహితంగా పక్కనే కూర్చున్నప్పుడు ఆమెని తేరిపారా చూస్తూండేవాడిని. సమీర స్వతహా చాలా అందగత్తె.. ముఖం తిప్పుకోలేనంతటి అందం ఆమెది. తెల్లటి మేను, పిరుదులు దాటే జడ, పెద్ద పెద్ద కళ్లు, బుగ్గ మీద పుట్టమచ్చ.. చూడటానికి అప్సరసలా ఉండేది. రాను రాను ఆమె యవ్వనంలోకి ప్రవేశించడటంతో మరిన్ని అందాల్ని సంతరించుకొని ముగ్ధలాగా కనిపించసాగింది. మాటలాడుతుంటే సెలయేటి గలగలల్లా వినిపించేవి. నవ్వితే గుప్పెడు బొండు మల్లెలు జారినట్లుండేది. నడుస్తుంటే హంసలా కనిపించేది. ఆమెను అప్పుడప్పుడు చూస్తూంటే...

మాటేమో హోరైనది
హోరేమో ఏరైనది
ఏరేమో సమీరైనది...
అనీ అనిపించేది.

**(సశేషం)**

తమ అస్తిత్వాన్నీ కాదనుకున్నారు, చరిత్రను వక్రీకరించుకున్నారు. సుదీర్ఘ కాలగమనంలో చూస్తే నిన్నటి మొన్నటి వరకూ భారతదేశంలో భాగంగా ఉన్నవారు, ఒకే పూర్వీకులను కలిగినవారే కూడా. అలాంటి పాకిస్తానీలు మత ముసుగులో తమను తాము మోసం చేసుకుంటూ జీవించడం అలవాటు చేసుకున్నారన్నది స్పష్టం. స్వాతంత్ర్య సమరయోధుడు 'భగత్‌సింగ్'ను కాదనుకోవడంతో, దూషించడంతో ఆ ధోరణి మరొక్కసారి స్పష్టమైంది. నాడు భారత్‌లో భాగం లాహోర్‌కు చెందిన భగత్‌సింగ్ చేసిన మహోన్నత త్యాగాన్ని విస్మరించి, ఆయనను తీవ్రవాదిగా ముద్రవేయడానికి మతోన్మాదంతో ఊగిపోతున్న పాకిస్తానీయులు ప్రయత్నించడం గర్హనీయం.

నేటికి యువతకు స్ఫూర్తిగా నిలిచే స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్. ఆయన శౌర్యసాహసాలు, ఆలోచనలు తరాలు గడిచినా యువతను ఆకర్షిస్తూనే ఉన్నాయి, ఉంటాయి. పరాయి పాలనలో తన మాతృభూమికి జరుగుతున్న అన్యాయాలను సహించలేకపోవడమే నేరం అయితే, స్వాతంత్ర్య సమరం జరిగిన ఏ దేశానికీ స్వేచ్ఛ లభించేది కాదు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ముగ్గురూ బ్రిటిష్ పోలీసు అధికారిని హత్య చేశారన్న ఆరోపణలతో 1931లో షాద్‌మాన్ చౌక్‌లో ఉరి తీశారు. దేశ విభజన తరువాత కూడా ఏళ్ల తరబడి భగత్‌సింగ్ త్యాగనిరతి యువత మనసులను వెంటాడిందని తారేక్ ఫతా వంటి రచయితలు పేర్కొన్నారు. ఆ క్రమంలోనే భగత్‌సింగ్‌ను తమవాడిగా భావించి ఫవారా చౌక్ షాద్‌మాన్ పేరును భగత్‌సింగ్ చౌక్‌గా మార్చాలని నిర్ణయించారు. కానీ, ఒక సైనిక అధికారి బుర్రలో పురుగు తొలిచింది. రిటైర్డ్ కమడోర్ తారిక్ మజీద్ దీనికి అభ్యంతర పెట్టాడు. భగత్‌సింగ్ విప్లవకారుడు కాదు, ఒక బ్రిటిషు పోలీసు అధికారిని చంపిన 'నేరగాడు', నేటి మాటల్లో చెప్పాలంటే 'తీవ్రవాది' అంటూ మజీద్ అభ్యంతర పెట్టడంతో లాహోర్ మెట్రొపాలిటన్ కార్పొరేషన్ అదే విషయాన్ని లాహోర్ హైకోర్టుకు నివేదించింది.

**పేరు మార్చాలని ఎప్పుడో నిర్ణయం**

లాహోర్ మెట్రోపాలిటన్ కార్పొరేషన్ డిసెంబర్ 5, 2012న జరిగిన దిల్‌కాష్ లాహోర్ కమిటీ సమావేశంలో నగరంలో ఉన్న ఫవారా చౌక్ షాద్‌మాన్ సహా రహదారులు, చౌక్‌లు, బ్రిడ్జిల పేర్లు మార్చాలని నిర్ణయించింది. ఆ సమయంలోనే షాద్‌మాన్ చౌక్ పేరును భగత్‌సింగ్ చౌక్‌గా మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రజల సూచనలను, అభ్యంతరాలను కోరుతూ పత్రికలలో ప్రకటన వెలువడింది. చౌక్ పేరు మార్చాలన్న ప్రతిపాదనను అనేకమంది వ్యతిరేకించగా, భగత్‌సింగ్ మెమోరియల్ ఫౌండేషన్ అనే ఎన్జీవో లాహోర్ హైకోర్టులో షాద్‌మాన్ చౌక్‌ను భగత్‌సింగ్ చౌక్‌గా మార్చాలంటూ కేసు దాఖలు చేసిందని, పాకిస్తానీ పత్రిక 'డాన్' పేర్కొంది.



షాద్‌మాన్ చౌక్

**డాన్ పత్రిక కథనం**

ఆ పత్రిక కథనం ప్రకారం, కోర్టులో కేసు దాఖలైన నేపథ్యంలో సైన్యాధికారి తారిక్ మజీద్, భగత్‌సింగ్ కథనమే పుక్కిటి పురాణమంటూ ప్రకటించి, ఒక 'అవగాహనా పత్రాన్ని' ప్రభుత్వానికి సమర్పించడమే కాదు, షాద్‌మాన్ చౌక్ పేరును భగత్‌సింగ్ చౌక్‌గా మార్చడానికి వీలులేదని వాదించాడు. అంతటితో ఆగక ఆ మతోన్మాద సైన్యాధికారి, భగత్‌సింగ్‌ను ఒక విప్లవకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా చూపిస్తూ నకిలీ ప్రచారం చేయడం ద్వారా ఆ ఎన్జీవో కుట్ర పన్నుతోందని అభాండాలు మోపాడు. భారత ఉపమహాద్వీప స్వాతంత్ర్య సమరంలో భగత్‌సింగ్‌కు పాత్రే లేదని ప్రకటించేశాడు. భగత్‌సింగ్ విప్లవకారుడు కాదని, అతడు ఒక బ్రిటిష్ పోలీసు అధికారిని హత్య చేసిన నేరగాడని, అందుకే అతడినీ అతడి సహచరులనూ ఉరి తీశారంటూ ఉన్మాదంతో ఊగిపోతూ పేర్కొన్నాడు. వీటన్నింటినీ మించి, ఆ మతోన్మాద అధికారి భగత్‌సింగ్ పాకిస్తాన్‌కు విదేశీయుడని, దేశ ఇస్లామిక్ భావజాలానికి శత్రువని తన మనసులో ఉన్న అసలు విషాన్ని కక్కాడు. పేరు మార్పును డిమాండ్ చేస్తున్న భగత్ సింగ్ ఫౌండేషన్ అన్నది పాకిస్తానీ భావజాలానికి వ్యతిరేకంగా పనిచేస్తోంది కనుక దానిని నిషేధించాలని కూడా డిమాండ్ చేశాడు. దీనిపై ఫౌండేషన్ చైర్మన్ ఇంతియాజ్ రషీద్ ఖురేషీ నాటి పంజాబ్ ప్రధాన కార్యదర్శికి వ్యతిరేకంగా కంటెంప్ట్ పిటిషన్‌ను దాఖలు చేయగా, తన ఆరోపణలతో సైన్యాధికారి కోర్టుకు పత్రాలను సమర్పించాడు. కేసును కోర్టు జనవరి 17, 2025కు వాయిదా వేసింది.

**విద్యార్థుల డిమాండ్‌తోనే నాడు పేరు మార్చాలన్న నిర్ణయం**

భగత్‌సింగ్ 91వ వర్ధంతి సందర్భంగా 'భగత్‌సింగ్ అమర్‌రహే' నినాదాలతో పాకిస్తాన్‌లోని లాహోర్‌లోని షాద్‌మాన్ చౌక్ దద్దరిల్లింది. మార్చి 23, 1931లో అదే స్థలంలో భగత్‌సింగ్‌ను, అతడి సహచరులిద్దరినీ ఉరితీసిన ప్రదేశమది. అందుకే, భగత్‌సింగ్ చౌక్ అని పేరు పెట్టాలని విద్యార్థులు నాడు డిమాండ్ చేశారు. ఆ చౌక్ గతంలో లాహోర్ సెంట్రల్ జైల్లో భాగంగా ఉండేది.

ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ కలెక్టివ్‌లో సభ్యులుగా ఉన్న విద్యార్థులు దానికి షహీద్ భగత్‌సింగ్ అని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. విప్లవకారులుగా వారు చేసిన త్యాగాలు ఉప ఖండంలో శాశ్వతంగా గుర్తు ఉంటాయంటూ భగత్‌సింగ్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ ఇంతియాజ్ రషీద్ ఖురేషీ కూడా పేర్కొన్నాడు. అంతటితో ఆగక, 'పాకిస్తాన్‌లో కూడా భగత్‌సింగ్‌ను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించాలని, చౌక్‌కు కూడా అతడి పేరు పెట్టాలని' డిమాండ్ చేశారు. పాకిస్తాన్ ఖాయిద్-ఎ-ఆజంగా పిలుచుకునే జిన్నా కూడా సెప్టెంబర్ 4, 1929న ఢిల్లీ అసెంబ్లీలో భగత్‌సింగ్‌ను ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశాడు.

నేటి పాకిస్తాన్‌లోని ఫైస్లాబాద్ గ్రామంలో జన్మించిన భగత్ జ్ఞాపకాలపై పాకిస్తాన్‌కు కూడా హక్కు ఉందంటూ, జీవించిన అతి స్వల్ప, అర్థవంత మైన జీవితంలో అతడు లాహోర్‌లోనే ఎక్కువ గడిపాడని కూడా ఖురేషీ చెప్పటం గమనార్హం. స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నంగా భగత్‌సింగ్ ఉన్నాడని, మా సుసంపన్నమైన వారసత్వాన్ని లాక్కొనే హక్కు ఎవరికీ లేదని కూడా స్పష్టం చేశాడు.

**భగత్‌సింగ్ భక్తుడిగా మారిన ఖురేషీ**

ఏది ఏమైనా షాద్‌మాన్ చౌక్ పేరును మార్పించాలన్న పట్టుదలతో ఉన్న ఖురేషీ 2013లో భగత్‌సింగ్ అంతిమ కేసును తిరిగి తెరవవలసిందిగా లాహోర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న జేపీ శాండర్స్‌ను 1928లో హత్య చేసిన ఘటనలో

# భగత్‌సింగ్‌లోను ముస్లిం వ్యతిరేకిని చూస్తున్నారు!



దాఖలైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ నిర్ణయానికి రావచ్చని అతడు వాదించాడు. చౌక్ పేరు మార్చవలసిందిగా కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు జిల్లా యంత్రాంగం సహా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఖురేషీ 2018లో కేసు నమోదు చేశాడు.

**ఎఫ్ఐఆర్‌లో భగత్‌సింగ్ పేరులేదా?**

నాడు శాండర్స్‌ను హత్య చేసేందుకు పన్నిన లాహోర్ కుట్ర కేసులో 23 ఏళ్ల భగత్‌సింగ్‌కు కూడా జోక్యముందంటూ బ్రిటిష్ వారు విచారణ అనంతరం 1931లో ఉరి తీశారు. హత్యానంతరం ఈ కుట్రకు సంబంధించి 1928లో భగత్, అతడి సహచరులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ కావాలని ఖురేషీ కోరాడు. పంజాబ్ పోలీస్ న్యాయ వ్యవహారాల కార్యాలయంలో 1895–1928 వరకూ రికార్డులు ఉన్నాయని, కానీ పోలీసులు మాత్రం 1928లో వారిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని ఇవ్వలేదని ఖురేషీ ఆరోపించాడు. ఈ క్రమంలోనే లాహోరు హైకోర్టు ఈ కేసును విచారించేందుకు మరింత పెద్ద బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రధాన న్యాయమూర్తికి పంపింది.

1928లో బ్రిటిష్ పోలీసు అధికారి హత్య కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌లో భగత్‌సింగ్ పేరును కూడా ప్రస్తావించలేదని, కానీ ఉరిశిక్ష వేశారని లాహోర్ పోలీసులు కనుగొనడం కొసమెరుపు. అందుకే, భగత్‌సింగ్‌ను ఉరి తీసి ఎనిమిది దశాబ్దాలు అవుతున్నా, కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉందని ఖురేషీ పేర్కొన్నారు. భగత్‌ను ప్రేమించే పాకిస్తాన్‌లోని సాధారణ పౌరులు, విద్యార్థులు ఆయన జయంతి, వర్ధంతి రోజున ఆ యోధుడిని జ్ఞాపకం చేసుకుంటున్నారు.

**భారత్ మండిపాటు**

పాకిస్తాన్ మతోన్మాది చేసిన వ్యాఖ్యలకు పంజాబ్ నుంచి ప్రతిస్పందన వెలువడింది. అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు ఇద్దరూ భగత్‌సింగ్ నేరగాడంటూ మాజీ సైన్యాధికారి చేసిన చౌకబారు వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలపై పాకిస్తాన్ వివరణ కోరేందుకు భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, భవిష్యత్తులో అటువంటి వ్యాఖ్యలు ప్రకటనలు వెలువడకుండా, మజీద్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి లాహోర్ హైకోర్టు తొలగించాలని, ఆప్ విజ్ఞప్తి చేసింది. భగత్‌సింగ్‌ను అవమానిస్తే తాము సహించమంటూ ఆనంద్‌పూర్ సాహిబ్ ఎంపీ, ఆప్ నాయకుడు మాల్విందర్ సింగ్ కాంగ్ హెచ్చరించారు. భగత్‌సింగ్, డా॥ అంబేడ్కర్ సిద్ధాంతాలను తాము అనుసరిస్తామని, వారి ఆలోచనలే మన మౌలిక సూత్రాలంటూ కాంగ్ స్పష్టం చేశారు. భగతసింగ్ వారసత్వం సాహసమని, స్వతంత్ర భారతదేశంలో ఆయన దృష్టి ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చిందని, ఆ వారసత్వాన్ని రద్దు చేసేందుకు పాక్ చేస్తున్న యత్నాన్ని ఖండిస్తున్నామని కాంగ్ ఘాటుగా పేర్కొన్నారు.

భగత్‌సింగ్ ప్రతిఘటన చర్యలు బ్రిటిష్ పాలకుల నుంచి భారత్‌ను విముక్తం చేయడానికే తప్ప తర్వాత వచ్చిన ప్రాంతీయ విభజనలకు వ్యతిరేకంగా కాదని పాకిస్తాన్‌కు ఆయన గుర్తు చేశారు. అంతేకాదు, భగత్‌సింగ్ జైల్లో రాసుకున్న డైరీని ప్రస్తావిస్తూ, అతడు స్వతంత్రమైన, సామాజికంగా న్యాయమైన భారతం కోసం రాసుకున్న రాతలను గుర్తు చేశారు. ఎవరికీ హాని చేయడం భగత్‌సింగ్ ఉద్దేశం కాదని, బ్రిటిష్ వారు భారతీయులపై చేస్తున్న అకృత్యాలను గుర్తు చేసే లక్ష్యంతోనే అతడి చర్యలు ఉన్నాయని అన్నారు.

భారతీయ జనతా పార్టీ మరింత ఘాటుగా స్పందిస్తూ, తీవ్రవాదులను పెంచి పోషించే దేశానికి ఒక హీరోను నేరగాడంటూ అవమానించడం వారి కపటత్వాన్ని బయటపెడుతోందని విమర్శించింది. అవిభజిత భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన వీరుడిపై నిందలు వేయడం గర్హనీయమంటూ దాడి చేసింది. ఇది జాతీయ నాయకుడి వారసత్వం, భారత్ ఆత్మగౌరవంపై దాడిగా పార్టీ అభివర్ణించింది. పాకిస్తాన్ ఉనికిలోకి రాకముందే అఖండ భారతం కోసం భగత్ సింగ్ తన జీవితాన్ని త్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేసింది. తన జీవితాన్ని స్వాతంత్రం కోసం తృణప్రాయంగా భావించిన భగత్ సింగ్ వంటి అమరవీరుడిని నేరగాడంటూ తీవ్రవాదులను పెంచి పోషించే దేశం పేర్కొనడం హేయంగా ఉందని బీజేపీ నాయకులు విమర్శించారు. ఒకవైపు తీవ్రవాదులను పెంచిపోషిస్తూనే, నిజమైన హీరోను అవమానించి నందుకు పాకిస్తాన్ సిగ్గు పడాలని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**– జాగృతి డెస్క్**

ఉదారవాదులు సిగ్గుపడవలసిన సందర్భం... మానవ హక్కుల కార్యకర్తలంతా గొంతెత్తి నినదించవలసిన సమయం... ముఖ్యంగా ఫెమినిస్టులు తిరగబడవలసిన ఘటన... కానీ భారతదేశంలో ఈ మూడు వర్గాలకు చెందిన ఉద్యమకారులంతా నిస్సిగ్గుగా, నిర్మొహమాటంగా ముఖం తిప్పుకుంటున్నారు. భారత్‌లో రెండవ అతిపెద్ద మెజారిటీ అయిన ముస్లింలపై ఈగవాలినా దానిని కుట్రగా చూసి, అభివర్ణించే వీరు, తాము ధరించకపోగా, మన వాతావరణానికి, సంస్కృతికి సరిపడనిది అయినా బుర్ఖా వ్యవహారాన్ని సమర్థించి, వ్యక్తిగత ఎంపిక అంటూ ఉపన్యాసాలు దంచిన విషయం తెలిసిందే. ఇందులో ప్రముఖులైన ఆర్ఫా, రాణా, స్వరా వంటి పలువురు స్త్రీవాదులు ముందు వరుసలో ఉంటూ తాము ఎంత గొప్ప ఫెమినిస్టులమో చెప్పుకుంటుంటారు. కానీ, ఇరాన్‌లోని ఒక యూనివర్సిటీలో ఒక యువతి ముఖానికి సరిగా ముసుగువేసుకోలేదనే సాకుతో అక్కడ నైతిక పోలీసులు చేసిన దౌర్జన్యం, ఆ షాక్‌లో దాదాపు వివస్త్రగా ఆమె యూనివర్సిటీలో తిరుగుతుంటే ఆమెను మాయం చేసిన తీరుపై ఎందుకో వీరెవరూ మండిపడటం లేదు.



# ముస్లిం దేశంలో జరిగే దారుణాల పట్ల మౌనం

పైగా ఈ ఘటనను షాహీన్‌బాగ్ ఘటనతో సమానం చేస్తూ ఆర్ఫా ఖానుమ్ షెర్వానీ చేసిన ట్వీట్లు వారి అసలు స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఈ వైఖరికి సామాన్యులు నిర్ఘాంతపోతున్నారు. హిపోక్రసీ రూపం ధరిస్తే వీరిలాగే ఉంటుందంటూ విమర్శిస్తున్నారు. ఇంతకీ, వీరందరికీ ఒక ముస్లిం దేశం చేస్తున్న తప్పును ఎత్తి చూపాలంటే భయమా? లేక వారి పట్ల అభిమానమా?

ఇంతకీ ఏం జరిగింది? నవంబర్ 3వ తేదీన ఇరాన్‌లోని ఒక యూనివర్సిటీలో విద్యార్థిని ముఖానికి సరిగా మాస్కు వేసుకోలేదనే సాకుతో అక్కడ నైతిక పోలీసులు బలవంతంగా లాక్కుపోవడాన్ని చూసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆమెను దారుణంగా లాక్కుంటూ పోయి సెక్యూరిటీ గదిలోకి తోస్తుంటే, ఆ యువతి తీవ్రంగా ప్రతిఘటించడంతో, ఆమె బుర్ఖా చిరిగిపోయింది. దానితో ఆగ్రహించిన యువతి లోపల వేసుకున్న ప్యాంటును కూడా వారి ముఖాన కొట్టి, తప్పించుకొని కేవలం లోదుస్తులతో యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్లి తిరిగి తన నిరసన తెలిపింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాసేపట్లో ముగ్గురు గూండాలు వచ్చి ఆమెను కారులోకి తోసి తీసుకువెళ్లి పోయారు. ఇప్పటివరకూ ఆమె ఆచూకీ ఎవరికీ తెలియదు.

అహూ దర్యాయీ అన్న ఈ యువతి కేవలం ఇరాన్ ప్రభుత్వానిదే కాదు, ఆర్ఫా వంటివారి 'సౌకర్యవంతమైన' ఫెమినిజంను బట్టబయలు చేసి నిలబెట్టింది. ఇరాన్ నైతిక పోలీసులు కొట్టిన దెబ్బలకు ఆమె కోమాలోకి అయినా వెళ్లి ఉండవచ్చు లేదా ఈ భూమి మీద నుంచే మాయమై ఉండి ఉండవచ్చు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరాన్ పౌరులకు, ఇతరులకు 2022లో జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేసింది. ఒకవైపు యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, తల్లిదండ్రులు, ప్రజలు ఈ ఘటనను ఖండిస్తూ భారీగా నిరసన ప్రదర్శనలు జరుపుతుండగా, భారత్‌కు చెందిన స్త్రీవాదుల గొంతుల నుంచి మాటలు రావడం లేదు. ప్రపంచమంతా స్వేచ్ఛ కోసం ఎలుగెత్తుతుండగా, మన మేధావులు మాత్రం అసలు సమస్యను వదిలేసి, ఈ ఘటనతో సంబంధంలేని విషయాలను దీనికి జోడించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా బాధితురాలికి లభిస్తున్న మద్దతును దారి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి సౌకర్యవంతమైన, ఎంపిక చేసిన ఫెమినిజాన్ని ప్రదర్శించడం ద్వారా తమ దుర్బుద్ధిని బయటపెట్టుకుంటున్నారు.

ప్రస్తుతం ఇరాన్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనకు అహూ దర్యాయీ అన్న బాధిత యువతి అంతర్జాతీయ సంకేతంగా మారింది. మేధావులు, ఫెమినిస్టులు, ఉదారవాదులు వంటివి ఏమీ కాని సాధారణ భారతీయు లంతా సోషల్ మీడియాలో ఆ యువతికి మద్దతునివ్వడమే కాదు, అసలైన ఫెమినిజపు సాహసానికి సంకేతమని కొనియాడుతున్నారు. అయితే, ఈ ఘటనను షాహీన్‌బాగ్ ఘటనతో అర్ఫావంటివారు పోల్చడంతో నెటిజన్లు ఆమెకి తగిన సమాధానాలే ఇస్తున్నారు.

నిజానికి షాహీన్‌బాగ్ అన్నది రాజకీయంగా జరిగిన నిరసన ప్రదర్శన. ఇక్కడ ఏ మహిళా కూడా క్రూరత్వాన్ని, వస్త్రాపహరణాన్ని, అమానవీయ ఆంక్షలను ఎదుర్కోలేదు. బదులుగా అక్కడ నిరసనకారులు ప్రభుత్వ సహనాన్ని, రక్షణను పుష్కలంగా పొందారు. దీనికీ, ప్రపంచంలోనే అత్యంత క్రూర పాలనలలో ఒకటైన ఇరాన్ ప్రభుత్వంతో అహూ చేస్తున్న వంటరి పోరాటానికీ అసలు సంబంధమే లేదు. ఈ క్రమంలోనే ఆర్ఫా పోలిక ఎంత దురుద్దేశ్య పూర్వకమో వెలుగులోకి రావడమే కాదు, తన అజెండాకు తగినట్టు స్పందించే ద్వంద్వత్వాన్ని బహిర్గతం చేస్తోంది.

**ప్రమాదకరమైన ఆర్ఫా నమూనా**

ఇటువంటి ఎంపిక చేసిన స్త్రీవాదం ఆర్ఫా ఖానుమ్ షేర్వానిలోని మోసాన్ని, ప్రమాదాన్ని బయట పెడుతోంది. కేవలం ఆర్ఫా మాత్రమే కాదు, భారత్‌లో అనేకమంది ఫెమినిస్టులు ఇరాన్‌ను వేలెత్తి చూపడానికి తటపటాయిస్తారు. అహూ సాహసం ప్రపంచ దృష్టిని ఆకర్షించిన అనంతరం, "పితృస్వామ్య అణచివేత"కు వ్యతిరేక ఉద్యమకారులమనే వారంతా మాయమై పోయారు. ఈ నకిలీ ఫెమినిస్టులు, ఉద్యమకారులు అంతా కూడా తమకేం ప్రమాదం లేదనుకున్న చోట్ల స్త్రీల పట్ల వివక్షను తక్షణమే ఖండిస్తుంటారు. ఇస్లామిక్ పాలనలో జరిగినప్పుడు మాత్రమే బలంగా ఘర్షణను నివారిస్తారు. అందుకే, ఇరాన్ యువతి సాహసం మీద నుంచి దృష్టిని మణిపూర్, షాహీన్‌బాగ్, అత్యాచార గణాంకాలు తదితరాల గురించి వైపు మళ్లించి మాట్లాడుతున్నారు.

అది సురక్షితమైన కథనంతో సరిపోలినప్పుడు మాత్రమే వారు స్త్రీవాదాన్ని ప్రదర్శిస్తారు. కనుక, ఒక షియా దేశానికి చెందిన అహూ వంటి మహిళ




# ఎందుకు?

ఎదుర్కొంటున్న నిజమైన బాధను విస్మరించడంలో మనం ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. అయితే, విషయాన్ని పక్కదారి పట్టించి, అసలు ఘటన పట్ల మౌనం పాటించడం వెనుక కలవరపెట్టే సత్యం ఒకటి మనకు స్పష్టంగా కనిపిస్తుంది. వారి నిబద్ధత మహిళల హక్కుల పట్ల కాదు, అత్యంత జాగ్రత్తగా మలచిన అజెండాల పట్ల అన్న విషయం వెలుగులోకి రావడమే.

**మహిళల ప్రతిఘటనను అణచివేసేందుకు పరికరం**

ఈ రకంగా తమ నిరసన తెలిపిన మహిళలపై 'మానసికంగా అస్థిరమైనవారు' అనే ముద్ర వేయడం ఇరాన్‌లో సంప్రదాయంగా మారుతోంది. కేవలం ఇరాన్ పాలకులే కాదు, కొందరు వ్యక్తులు కూడా దానినే ప్రచారం చేస్తున్నారు. మహిళల ప్రతిఘటనను తక్కువగా చూపి, వారి గొంతుకలను నొక్కివేయాలన్న వ్యూహంతో ఇరాన్ అధికారులు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. కేవలం ఇరాన్ కాదు, కొందరు సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లుగా పిలిచేవారు కూడా నిస్సిగ్గుగా ఇదే ప్రచారం చేస్తున్నారు. అహూ సాహసాన్ని మెచ్చుకోవడానికి బదులు మన ఫెమినిస్టులకు మానసిక ఆరోగ్య సంక్షోభమనే ముద్రను ప్రచారం చేయడానికి అనుకూలంగా ప్రచారం చేయడం కనిపిస్తుంది.

మానసిక ఆరోగ్యం అనే పరదా కింద అణచివేసే, క్రూర పాలకుల అధికారిక వ్యాఖ్యానాలను కొందరు ఉద్యమకారులు ప్రతిధ్వనించడం అనేది ఒక ప్రపంచ స్థాయి సరళిగా మారడం ప్రమాదకరం. మహిళా యోధులను పక్కకు తప్పించడానికి ఇరాన్‌కు ఇది ఒక సౌకర్యవంతమైన మార్గం. బాధితురాలు మానసికంగా అస్థిరమని ప్రకటించమనీ లేదంటే అతివాద ఇస్లామిక్ పాలకుల చేతిలో అత్యాచారాలు, మరణాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ బాధితుల కుటుంబాలకు ఎంపికలు ఇస్తారు. తద్వారా స్వాతంత్ర్య యోధులను హీరోలుగా చూడకుండా తమ స్త్రీ వ్యతిరేక ఇస్లామిక్ పాలకులు తమ శక్తిని ఉపయోగించి వారి నోరు మూయిస్తారు.

**నిజమైన ఫెమినిస్టు అహూ**

అర్ఫా వంటివారికి భిన్నంగా అహూ దర్యాయి



నిజమైన స్త్రీవాదాన్ని ప్రతిబింబిస్తుంది. క్రూరమైన రాజ్యానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి అహూ మూల్యం చెల్లిస్తోంది. తనకు స్వేచ్ఛ లేకపోవడం పట్ల నిరసనగా ఆమె తన జీవితాన్నే ప్రమాదంలో పడేసుకుంది. ఇరాన్‌లోని అణచివేత చట్టాల కారణంగా నిత్యం బాధపడే మహిళకు, 'ధిక్కారానికి చిహ్నమైన' మహసా అమీనీ సాహసాన్ని అహూ నిరసన ప్రతిధ్వనిస్తోంది.

దురదృష్టవశాత్తు ఎంపిక చేసిన స్త్రీవాదులకు ఆమె పోరాటం అసౌకర్యంగానే ఉంటుంది. ఈ స్త్రీవాదులంతా కూడా సురక్షితమైన, నియంత్రిత వాతావరణాల్లో గొంతెత్తుతారు తప్ప నిజమైన అత్యాచారాలకు వ్యతిరేకంగా కాదు. ఒకవైపు నిజమైన స్త్రీవాదులు స్వేచ్ఛను డిమాండ్ చేయడానికి తమ ప్రాణాలను కూడా పణంగా పెడుతుంటే, ఇతరులు నినాదాలు, సౌకర్యవంతమైన కథనాల వెనుక దాక్కుంటూ జనాన్ని మోసపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటంటే, మహిళలు, వారి హక్కులను ఇస్లామిక్ పాలకులు కాలరాయడం నుంచి దృష్టి మళ్లించడానికి అహూ పేరును ఉపయోగించుకోవడం వల్ల ఆమె సాహసాన్ని ప్రపంచం అనుమతిస్తుందా అన్నదే.

వారిని నిందించడం, వారిపై దాడి చేయడమే ఒక విప్లవాత్మక చర్యగా భావించేంతగా సమాజంలోని ప్రతి అవకరానికీ బ్రాహ్మణులే కారణమని వాదించే కొందరు ఉదారవాదులు, దళితవాదులు దానిని ఎంతగా అమానవీకరించారు. ఈ క్రమంలోనే ఈ రెండు వర్గాల మధ్య జరిగిన మాటల యుద్ధం, అహూ కావాలని నగ్న ప్రదర్శన చేసిందనేంతగా దిగజార్చింది. ఇరాన్‌లో మహ్సా అమీనీని దారుణంగా హత్య చేసిన తర్వాత, ఇరాన్‌లో గణనీయమైన మహిళా వర్గం తమ 'జాన్, జిందగీ, ఆజాదీ' (ప్రాణాలను, జీవితాన్ని, స్వేచ్ఛను) తిరిగి సాధించుకునేందుకు హిజాబ్‌ను తప్పనిసరిగా ధరించాలనే చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు.

ఒకవైపు ఇరాన్ అధికారులు అహూను మానసికంగా అస్థిరమని ముద్రవేస్తుంటే, ఇరానియన్ ఉద్యమకారులు మాత్రం మహిళలు ఏం ధరించాలి, ఏం ధరించకూడదు అని నిర్ణయించే స్వేచ్ఛ నైతిక పోలీసులకు, ఇస్లామిస్టులకు లేదని, అది కేవలం మహిళల చేతుల్లో ఉందని, ఆ విషయాన్ని చెప్పేందుకే అహూ ఈ నిరసనను కావాలని చేసిందని ప్రకటిస్తున్నారు.

సరిగ్గా ఏడాది కిందట, అర్మితా గెరావాంద్ అనే 16 ఏళ్ల యువతికీ, ఇరాన్ నైతిక పోలీసు అధికారులకు టెహ్రాన్ మెట్రోలో ఇస్లామిక్ వస్త్రధారణపై జరిగిన వాగ్వాదం, ఆమె అందుకు అనుగుణంగా దుస్తులు ధరించలేదన్న ఆరోపణతో పోలీసులు చేసిన జులుం తర్వాత ఆ మైనర్ బాలికను ఆసుపత్రిలో చేర్చడం, ఆమె నాలుగు రోజులు తిరుగకుండానే కోమాలోకి వెళ్లడం, ఒక ఇరవై రోజుల్లోపు వైద్యులు ఆమెను బ్రెయిన్ డెడ్ అని ప్రకటించడం వరుసగా జరిగిపోయాయి. ఈ విషయం అంతగా వెలుగులోకి రాకపోవడానికి కారణం, ఆమె ఫోటోను సోషల్ మీడియాపై పంచడం కానీ, మానవ హక్కుల సంస్థలకు ఈ విషయం తెలిపినా దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించడంతో వారు ఆ పని చేయలేదు. ఈ కారణంగానే ఈ విషయం అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు.

మహిళలకు వ్యతిరేకంగా ఇంత ఘోరమైన అణచివేత జరుగుతుండగా, మన దగ్గర స్త్రీవాదులు, కులవాదులు, ఇస్లామిస్టులు, ఉదారవాదులు, వామపక్షవాదులు సహా ఉద్యమకారులంతా అక్కడ జరుగుతున్న ఘటనలపై విచారాన్ని వ్యక్తం చేయడంలేదు, ఖండించడం లేదు. భారత్‌లో హిజాబ్‌కు అనుకూలంగా అది వ్యక్తిగత ఎంపికంటూ ఉద్యమించిన క్రాంతికారులు, ఇరాన్‌లో దానిని తీసివేయాలని జరుగుతున్న నిరసనకు మద్దతు ఇవ్వకపోవడం చూస్తుంటే, వారు ఉదారవాదుల, స్త్రీవాదుల ఇత్యాది వాదుల ముసుగులో ఉన్న అతివాద ఇస్లామిస్టులని అనిపించక మానదు.

– నీల



భారతదేశంలో నరనారాయణుల ఆరాధనకు కీర్తిగాంచిన రెండో పెద్ద పుణ్యక్షేత్రం లింబాద్రిగుట్ట. ఇది ప్రధానంగా నారసింహ క్షేత్రం. నరనారాయణులు ఇక్కడ స్వయం భువులుగా వెలిశారు. నింబాచలం లేదా లింబాద్రిగుట్టగా వ్యవహరించే ఈ క్షేత్రానికి ఉన్న మరొక ప్రత్యేకత ప్రకృతి రామణీయకత. ఇదొక కొండ. అది కూడా రెండు అంతస్తులను మరిపిస్తుంది. ప్రథమార్థంలో సువిశాల పుష్కరిణి, కల్యాణ మంటపం, రథం కనిపిస్తాయి. దీనిని మాడ వీధి

# దక్షిణాది నర

ఈ క్షేత్రానికి ఉన్న పౌరాణిక ప్రాధాన్యం ఘనమైనది. శ్రీరాముడి సూచన మేరకు మారుతి ఇక్కడ తపస్సు చేశాడని చెబుతారు. గోదావరి తీరంలోని ఈ క్షేత్రంలో బ్రహ్మ, ప్రహ్లాదుడు కూడా తపస్సు చేశారని ప్రతీతి. గర్భగుడిలో యోగరూపంలో ఎడమ తొడపై లక్ష్మీదేవితో కలసి లింబాద్రి లక్ష్మీ నరసింహుడు పూజలందుకొంటున్నాడు. మూల విరాట్టుకు ఎడమవైపున కృష్ణార్జునులు నరనారాయణ రూపాలతో వెలిశారు. ఇంకా ఆంజనేయస్వామి, మధ్వాచార్యులు, ప్రహ్లాదుడు ఇదే గర్భగుడిలో పరివార దేవతలుగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. గర్భగుడికి ఈశాన్యభాగంలో శంకరుడు జోడు లింగాల రూపంలో దర్శనమిస్తాడు. స్వామివారి ఆలయ మెట్లకు ఉత్తరాన కమల పుష్కరిణి పేరుతో కోనేరు ఉంది. స్వామివారి గుట్టకు వాయవ్య భాగంలో మెట్ల ప్రక్కన ఆంజనేయస్వామి అయోధ్యా ఆంజనేయుడు అనే పేరుతో దర్శనమిస్తాడు. అక్కడనే చింతామణి తటాకం ఒక చిన్న కుంటగా మిగిలింది. ఈ క్షేత్రంలోని ప్రతి ప్రాంతానికి ప్రత్యేక పురాణ కథ ఉండడం కూడా విశేషమే.

బ్రహ్మావైవర్తిక పురాణంలో కనిపించే శ్రీమన్నింబాచల మహాత్మ్యం ప్రకారం విష్ణు స్మరణ చేతనే మోక్షం లభిస్తుందా లేదా చెప్పమని శౌనకాది రుషులు సూతుల వారిని కోరారు. అందుకు సూత మహాముని ఈ మాటలు చెప్పారని పురాణ కథనం.

ఈ ప్రశ్నను ఇంతకు పూర్వమే జనమేజయ మహారాజు, నారదుడికి వేశారు. విష్ణుస్మరణ మాత్రం చేతనే ముక్తినిచ్చే మహా పుణ్యకరమైన పవిత్ర క్షేత్రం గౌతమీ నదికి దక్షిణ దిశగా రెండు యోజనాల దూరంలో ఉంది. అదే నింబాచలం. ఇది తపోక్షేత్రం, వృక్షాలు దేవతాంశ గలవి. హిరణ్యకశిపుని సంహారం తర్వాత క్రోధాయమానమైన నృసింహరూపాన్ని లక్ష్మీదేవి చూచి భీతురాలై ఇక్కడి పుష్కరిణిలో ఉన్న పద్మంలో ఘడియ కాలం దాగి ఉంది. అందుకే ఈ పుష్కరిణికి పద్మ సరోవరం / కమల పుష్కరిణి అని పేరు వచ్చింది.

శ్రీరామచంద్రుడు సీతాసమేతుడై ఈ క్షేత్రంలో సంచరించి రుషుల్ని పూజించాడు. శ్రీరాముడు నిర్యాణ సమయంలో ఆంజనేయస్వామి వరం కోరుకోవలసిందని చెప్పగా, ఆంజనేయుడు బ్రహ్మ పదవి ఇప్పించమని కోరాడు. నీవు నింబాచలం మీద తపమాచరించి నృసింహదేవుని అనుగ్రహం పొందమని చెప్పాడు. ఆంజనేయుడు తపమాచరించి దివ్యానుగ్రహం పొందాడు. పరమాత్ముని ఆజ్ఞతో ఈ క్షేత్రంలో మారుతి, అయోధ్య ఆంజనేయుడన్న



పుష్కరిణి



అయోధ్యాంజనేయ మందిరం



జోడు లింగాలు



నందీశ్వరుడు

అంటారు. కొండ ఎగువ అంటే ద్వితీయార్థంలో గుహలో నరసింహస్వామి వేంచేసి ఉన్నాడు. గర్భగుడిలో లక్ష్మీదేవి, కృష్ణార్జునుల విగ్రహాలు ఉన్నాయి. ఇదే కూడిక బద్రీనాథ్‌లో మాత్రమే ఉంది. ఇక్కడ నరసింహస్వామి ప్రసన్నంగా దర్శనమిస్తాడు. అదీ కాకుండా గుహ లేదా ఆలయం చుట్టూ బిల్వ వృక్షాలు నిండి ఉంటాయి. సాధారణంగా శివపూజకు ఉపయోగించే బిల్వపత్రాలను ఇక్కడ నరసింహ స్వామి ఆరాధనకు ఉపయోగిస్తారు. వేపచెట్లు కూడా ఇక్కడ ప్రత్యేకమే. ఆ వేపచెట్ల పేరిట క్షేత్రానికి ఆ పేరు (నింబాచలం) వచ్చిందని చెబుతారు.



# నారాయణ క్షేత్రం

రూపంతో కొలువై ఉన్నాడు.

శ్రీకృష్ణ నిర్యాణ సమయంలో ధర్మార్జునులు దుఃఖ సాగరంలో మునిగి పోయారు. కృష్ణుడు ధర్మరాజును ఓదార్చేందుకు, అర్జునుడు, తాను నరనారాయణ రూపంతో శ్రీన్నింబాచల క్షేత్రంలో నివసిస్తామని అభయమిచ్చాడు. శంకరుడు నారదుని ద్వారా ఈ క్షేత్ర మహిమను తెలుసుకొని, పార్వతీ సమేతుడై ప్రమథ గణాలు సహా వచ్చి, బ్రహ్మ శిరః ఖండన పాప పరిహారార్థం తపమాచరించాడు. పరమాత్ముని ఆజ్ఞతో శంకరుడు ఈ క్షేత్రంలో భక్తుల కోరికలు తీర్చేందుకు జోడు లింగాల రూపంలో కొలువై ఉన్నాడు. భృగు మహర్షి ఇచ్చిన శాపం నుంచి విముక్తురాలు కావడానికి పార్వతీదేవి శంకరుడిని ఉపాయం కోరింది. శ్రీమన్నింబాద్రి క్షేత్రంలో విరజానది ఒడ్డున చండికా రూపంలో నృసింహుని ఉపాసించుమని శంకరుడు చెప్పాడు. ఆవిధంగా పార్వతీదేవి శాపవిముక్తురాలైంది.



ఆలయం

ఇంద్రుడు, నందీశ్వరుడు నింబాచలంనకు వచ్చి శాప విమోచన పొందారు. నంది నందీతటాకంలో తపమాచరించి స్వామిని ప్రసన్నం చేసుకున్నాడు. పూర్వం నందీ తటాకంలోనే గద్ద పడి మరణించింది. ఆ క్షణమే స్త్రీ రూపం దాల్చి వెంటనే పురుషరూపం కూడా పొంది శంఖ చక్రాది చిహ్నాలతో పుష్పకంపైన వైకుంఠానికి వెళ్లింది. నందీ తటాకం కృష్ణ భాగీరథిలతో సమానమైనది.

యమధర్మరాజు బ్రహ్మ ద్వారా ఈ క్షేత్ర మహాత్మ్యం విని తపమాచరించి పరమాత్ముని ఆజ్ఞతో తాను బిల్వవృక్షరూపమై ఈ క్షేత్రంలో నిలిచాడు. ఆ బిల్వపత్రాలతోనే అర్చన జరిగేటట్లు వరం పొందాడు. ఇక్కడ బిల్వ వృక్షాలకు అంత ప్రాశస్త్యం ఉంది. తాను భూలోకంలో సంచరించే విధంగా వరమివ్వమని విరజానది వరం కోరగా విష్ణుదేవుడు నింబాచల క్షేత్రంలో పశ్చిమ భాగంలో ప్రవహిస్తూ జీవులనుద్ధరించుమని ఆజ్ఞాపించాడు.

విరజానది పరమ పవిత్రమైది. ఒకసారి ఈ నది ప్రవాహం పెరిగి ఒక కుక్క పడి చనిపోయింది. అటు విష్ణుదూతలు, ఇటు యమదూతలు కళేబరం కోసం వచ్చారు. యమదూతలను విష్ణుదూతలు అడ్డగించారు. ఈ జీవులు పాపకృత్యాలకు పాల్పడ్డారు కాబట్టి యమలోకానికి తీసుకువెళతామని యమ దూతలు, ఎంతటి పాపులైనా విరజానది స్నానం చేత ముక్తియోగ్యులౌతారు కాబట్టి వైకుంఠ ప్రాప్తి ఉంటుందని విష్ణుదూతలు వాదించుకున్నారు. దీనితో యమధర్మరాజు బ్రహ్మతో మొరపెట్టుకొన్నాడు. విరజానది జలస్పర్శ మాత్రం చేత ఏ జీవికైన ముక్తి కలుగుతుందని బ్రహ్మ యమధర్మరాజుతో చెప్పాడు. చింతామణి నారాయణమూర్తి వక్షస్థలం మీద హారం. ఆ దేవత ఈ క్షేత్రంలో తపస్సు చేసి తటాకరూపంలో వెలసింది.

భార్యా విక్రయదోషం పోవడానికి హరిశ్చంద్రుడు ఈ క్షేత్రంలోనే తపస్సు చేశాడని చెబుతారు. ఇక్కడ భైరవస్వామి శంకరుని ఆజ్ఞతో క్షేత్రపాలకు నిగా స్థిరపడ్డాడు. ఈ నృసింహమూర్తి కృత యుగంలో శ్వేతవర్ణంతో, త్రేతాయుగంలో లోహిత వర్ణంతో, ద్వాపరంలో పసుపు వర్ణంతో, కలియుగంలో మేఘవర్ణంతో ఉన్నాడని నమ్ముతారు.

ఇంతటి మహత్తర క్షేత్రం తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో భీమ్‌గల్ పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో లింబాద్రి గుట్ట మీద ఉన్నది.

ఆలయంలో సనాతనంగా పరంపరాగతంగా శ్రీమాన్ మధ్వాచార్యుల మూల మహా సంస్థానమైన శ్రీమదుత్తరాది మఠాధీశుల పర్యవేక్షణలో తంత్రసార పద్ధతిలో నిత్య పూజా కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. సంవత్సరమంతా పూజలందుకొంటూ బ్రహ్మోత్సవ సమయంలో లింబాద్రిగుట్టపై ఉత్సవ కార్యక్రమాలలో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తున్నాడు స్వామి.

నంది, నందీ తటాకం భీమగల్ పట్టణంలో ఉన్నాయి. నందీ తటాకం కాలగర్భంలో కలసిపోయింది. భీమ్‌గల్, పెద్దంగంటి (బడాభీమ్‌గల్) మధ్యన ఎల్లమ్మ పేరుతో చండికాదేవి పూజలందు కొంటున్నది.

ప్రతి కార్తిక శుక్ల పంచమి మొదలుకొని కృష్ణపక్షం ద్వితీయ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. పంచమి, అంటే మొదటిరోజు భీమగల్ గ్రామాలయం నుంచి స్వామివారి పల్లకీ బయలు దేరుతుంది. ముత్తైదువుల మంగళహారతులతో, అమ్మవారి బోనంతో గుట్టకు చేరుతుంది. అప్పటి నుంచి ఉత్సవాలు పూర్తయ్యే వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దశమినాడు స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. పౌర్ణమికి రథయాత్ర నిర్వహిస్తారు.

రథోత్సవానికి దాదాపు లక్షన్నర మంది భక్తులు హాజరవుతూ ఉంటారు. ఆ మరునాడు డోల్సోవం, పుష్పయాగం, మూడో రోజు చివరిగా చక్కెర తీర్థం పూజలతో లింబాద్రి గుట్ట నుంచి భీమగల్ ఆలయానికి స్వామివారు చేరుకుంటారు. 12 రోజుల ఈ ఉత్సవాన్ని దాదాపు రెండున్నర లక్షల మంది దర్శించుకుంటారు. ఉత్తర తెలంగాణలో ఇది అతి పెద్ద జాతర. రాష్ట్రం నుంచే కాకుండా, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తారు.

– యెన్ను శ్రీధర్



**మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్టు ప్రపంచాన్ని అరచేతిలోకి తేవడంతో ఏ విషయాన్ని అయినా తెలుసుకోవడం తేలికైపోయింది ఈ తరానికి. దీనితో పుస్తకాల జోలికి పోకుండా అందులో ఇచ్చిన సమాచారమే నిజమనే భావనలో ఉంటున్నారు. ముందుగా 'గూగుల్' తల్లికి నమస్కరించి, 'స్వేచ్ఛాయుతమైన' విశ్వకోశంగా చెప్పుకునే 'వికిపీడియా'లో ఈది, సేకరించిన సమాచారమంతా నిజమనుకుంటే తప్పులో కాలు వేసినట్టే. మోదీ ప్రభుత్వం ఇటీవలే వికిపీడియా పక్షపాతపూరిత, తప్పుడు సమాచారాన్ని ప్రచురిస్తోందంటూ ఆ సంస్థకు నోటీసులు ఇవ్వడంతో ఒక స్వేచ్ఛాయుత వేదికనని చెప్పుకుంటూ ప్రారంభమైన వికిపీడియా అసలు రూపం వెలుగులోకి వచ్చింది.**

వికిపీడియాలో ప్రజలను మోసపుచ్చే అంశం మరొకటి ఉంటుంది. ఎవరైనా అక్కడ ఇచ్చిన సమాచారంలో లోటుపాట్లు ఉన్నాయనుకుంటే వారు హాయిగా ఎడిట్ చేసుకోవచ్చంటూ మనం చదివే పేజీలో ఉండటాన్ని చూస్తూనే ఉంటాం. లోతైన జ్ఞానం కలిగిన వారు ఏదో పొరపాటును సరిచేద్దామనుకుని ఎడిట్ చేస్తే, ఆ మార్పులు అందులో కనిపిస్తాయనుకుంటే పొరపాటే. ఎందుకంటే, ఎటువంటి సమాచారం అయితే జోడించాలి, దేనిని వదిలేయాలి అనే విషయాన్ని నిర్ణయించే ందుకు ఒక గుప్పెడుమంది ఉంటారు. తమకు అనుకూలంగా లేదనుకుంటే వారు సత్యమైనా దాన్ని జోడించరు. ఈ రకంగా అర్థసత్యాలు, అర్థ సమాచారంతో కూడిన విషయాలను ప్రచారం చేస్తున్నందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వికిపీడియాకు నోటీసులు జారీ చేసింది. కొద్దిమంది ఎడిటర్ల ఆధిపత్యం, విషయాంశాలపై వారి నియంత్రణను ఆ నోటీసులు పట్టి చూపాయి.

**అయితే ఏమిటంటారా?**

నిజానికి ఎవరైనా సమాచారాన్ని ఎడిట్ చేయవచ్చనే మాయమాటల కారణంగా, అక్కడ సమాచారం ఎలాంటిదైనా బాధ్యత వహించకుండా తాను 'కేవలం మధ్యవర్తిని' మాత్రమేననే సాకుతో వికిపీడియా తప్పించుకు తిరుగుతోంది. అందుకే ప్రభుత్వం తన నోటీసులలో, కొద్దిమంది ఎడిటర్లు మాత్రమే సమాచారాన్ని నియంత్రిస్తున్నప్పుడు వారిని ప్రచురణకర్తలుగా ఎందుకు భావించకూడదని ప్రశ్నించింది. నిజానికి 'ఆప్ ఇండియా' అనే వెబ్‌సైటు ఈ విషయాన్ని గతంలో పట్టి చూపింది. వికిపీడియాలో కనిపిస్తున్న పక్షపాత ధోరణి, అర్థసత్యాలపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, కొందరు ఎడిటర్లు మాత్రమే దానిని ఎడిట్ చేస్తున్నందున దానిని మధ్యవర్తిగా కాకుండా ప్రచురణకర్తగా ఎందుకు పరిగణించకూడదంటూ ప్రశ్నించిందని వికిపీడియాకు మంత్రిత్వశాఖ నోటీసులు పంపింది.

వికిమీడియా ఫౌండేషన్ యాజమాన్యంలో ఉన్న వికిపీడియాకు ఇటువంటి నోటీసులు, కేసులు కొత్త కాదు. ఇప్పటికే, ఎఎన్ఐ వంటి వార్తా సంస్థ సహా పలు సంస్థలు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని, అప్రతిష్ఠపాలు చేసేలా తప్పుడు సమాచారాన్ని, అర్థసత్యాలను ప్రచురిస్తున్నందుకు భారత్‌లోనే అనేక కేసులను ఎదుర్కొంటోంది. వికిపీడియాపై ఇప్పటికే ఆప్ ఇండియా సహా అనేకులు పరిశోధన చేసి పలు విషయాలను బయటపెట్టారు. వారు ఏం తేల్చారో చూద్దాం –

**వికిపీడియా తటస్తమైంది కాదు**

తనను తాను అందరికీ అందుబాటులో ఉండే 'సమూహ వివేకం, జ్ఞానం' పై ఆధారపడిన విశ్వకోశంగా చెప్పుకుంటూ, ప్రపంచం మొత్తానికీ ఉచితంగా జ్ఞానాన్ని అందించడానికి కట్టుబడి తాము ఉన్నామని వికిపీడియా తనను తాను నిర్వచించుకుంది. తాను ప్రాథమికంగా, న్యాయమైన, స్వచ్ఛమైన, తటస్త వేదిక అంటూ వికిపీడియా ప్రకటించుకుంటుంది.

అయితే, దాని భావజాలపర పక్షపాతాన్ని అత్యంత జాగ్రత్తగా, నిర్మాణా త్మకంగా రూపొందించి అందులో పొందుపరిచారు. ఈ విషయంలో వికిపీడియా సహ వ్యవస్థాపకుదు లారీ సెంగర్ సహా ఇప్పటికే బోలెడు మంది వివరణాత్మకంగా పరిశోధన చేసి, అది ఎలా తటస్తం కాదో చూపారు. మాన్‌హట్టన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డేవిడ్ రొజాడో 2024లో ప్రచురించిన పరిశోధనా పత్రం ప్రకారం, వికిపీడియాకు భారీ వామపక్ష మొగ్గు ఉంది. మరొక పరిశోధన అయిన క్రిటిక్– వికిపీడియాకు చెందిన రెండు ఇంటర్నెట్ విధానాలైన తటస్త దృక్పథం, విశ్వసనీయతలపై దృష్టి పెట్టి పరిశోధన సాగించింది. కంటెంట్‌లో ప్రస్తావించేందుకు ఏ ఆధారాలు విశ్వసనీయమైనవి, ఏవి కాదు అనే విషయాన్ని ఎడిటర్లు మాత్రమే తేలుస్తారు తప్ప ఇతరుల ప్రమేయం ఉండదనే భావనకు క్రిటిక్ వచ్చింది. విశ్వసనీయమైన ఆధారాలని వారు తేల్చేవి వామపక్ష భావజాల పరమైనవేనని, రైటిస్టు మొగ్గు ఉన్న వాదనలను బ్లాక్ లిస్ట్ చేస్తున్నారని ఆ పరిశోధన కనుగొంది.

కనుక, తటస్త దృక్పథం అంటే 'విశ్వసనీయ ఆధారాల'కు ప్రాతినిధ్యం వహించడమే. అంతే తప్ప, అన్ని అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించడం కాదు. వీటన్నింటినీ మించి, దాని సహ వ్యవస్థాపకుడే వికిపీడియాను వామపక్ష భావజాల మొగ్గు కలిగిన, అవిశ్వసనీయ, పక్షపాత ధోరణి కలిగిన కోశంగా విమర్శించడం గుర్తుపెట్టుకోవలసి విషయం.

**వికిపీడియా ఎడిటింగ్‌పై కఠిన నియంత్రణ**

ఎవరైనా ఎడిట్ చేయవచ్చని వికిపీడియా చెప్పుకున్నా, దేనిని జోడించాలి, ఏది వదిలేయాలి అని నిర్ణయించేది కొద్దిమంది వ్యక్తులే. ఎడిట్‌లను, ఎడిట్‌చేసే వారిని నిషేధించేందుకు, వివాదాలను నిర్ణయించేందుకు, పేజీలను తొలిగించేందుకు, పేజీలను లాక్ చేసేందుకు, విషయాంశాలను




తిరస్కరించేందుకు ఆ గుప్పెడుమంది వ్యక్తులే కారణం. ప్రపంచవ్యాప్తంగా కోటానుకోట్ల మంది వాడుతున్న ఈ వికిపీడియాకు కేవలం 435 అడ్మినిస్ట్రేటర్లు మాత్రమే ఉండటమే కాదు, వారికి అపరిమిత అధికారాలు కూడా ఉంటాయి. ఆర్బ్‌కామ్‌లో కేవలం 10మంది క్రియాశీల సభ్యులే ఉన్నారు. 'ఎడిటర్ రిటెన్షన్ ప్రోగ్రాం' పేరుతో వారిని కొనసాగించేందుకు వికిమీడియా ఫౌండేషన్ చురుకుగా నిధులు సమకూరు స్తుంటుంది. దానిని అందుకుంటున్న ఎడిటర్లు, అడ్మినిస్ట్రేటర్లు భారత్‌లో కూడా ఉన్నారు. 'ప్రాజెక్టుల కోసం నిధులు' పేరుతో కూడా ఈ చెల్లింపులను చేస్తుంటారు. ఇతర ప్రచురణ సంస్థలలాగే వికిపీడియాలో కూడా బలమైన అధికార క్రమం ఉంటుంది. కఠినమైన ఎడిటోరియల్ నియంత్రణ, ఉల్లంఘించకూడని భావజాలాన్ని



# వికీపీడియా సమాచారం పక్షపాత పూరితం

ఎడిటర్లు, అడ్మినిస్ట్రేటర్లు అనుసరిస్తారు.

**'అజ్ఞాత' నిధులు, వాటి వినియోగం**

టైడ్స్ ఫౌండేషన్, వికీమీడియా ఫౌండేషన్ ఒకరికొకరు నిధులు ఇచ్చుపుచ్చు కుంటారు కానీ దానిని 'అజ్ఞాత' విరాళాలుగా చూపుతుంటారని పరిశోధనలు వెలుగులోకి తెచ్చాయి. ఎందుకంటే, దాతలు ఇచ్చిన నిధుల వివరాలను వారు లెక్కల్లో వివరంగా చూపాల్సిన అవసరం లేదు. ఎటువంటి చందాలను, కార్పొరేట్ నిధులను తీసుకోకుండానే దశాబ్దాల తరబడి ఎటువంటి సమస్యా లేకుండా వికీపీడియాను నడిపేందుకు వికీమీడియా ఫౌండేషన్ వద్ద తగినన్ని నిధులు ఉన్నాయిట. అయినప్పటికీ వారికి చందాలు గ్రాంట్లు రావడానికీ కారణాలు వేరే ఉన్నాయి. తన స్వంత ప్రయోజనాల కోసం మిలియన్లను ఖర్చు పెట్టడమే కాదు, మీ విరాళం లేకపోతే వికీపీడియాను సజీవంగా ఉంచలేమన్న పేరుతో వసూలు చేసిన నిధులను వామపక్ష సంస్థలకు గ్రాంట్లుగా వికీమీడియా ఇస్తుంది.

ఉచితంగా జ్ఞానం అన్న ముసుగులో ఇదంతా జరగడమే కాదు, భారత్ వంటి దేశాలలో స్థానిక చట్టాల నుంచి తప్పించుకుని ఇది జరుగుతుంది. వికీపీడియా స్వయంగా ప్రకటించుకున్న వివరాల ప్రకారం, అమెజాన్, గూగుల్, జార్జ్ సోరోస్, మస్క్ ఫౌండేషన్, ఫేస్‌బుక్, రోథ్స్‌చైల్డ్ ఫౌండేషన్లు మిలియన్ల కొద్దీ నిధులు కుమ్మరించాయి. కాగా, మస్క్ ఫౌండేషన్ తన నిధులను నిలిపివేస్తున్నట్టు పేర్కొంది.

**భారత వ్యతిరేక, హిందూ వ్యతిరేక సంస్థలకు వికీపీడియా తోడ్పాటు**

పలు భారత వ్యతిరేక, హిందూ వ్యతిరేక సంస్థలకు, శక్తులకు వికీమీడియా ఫౌండేషన్, టైడ్స్ ఫౌండేషన్‌లు నిధులు సమకూరుస్తుంటాయి. హిందువులతో ఎలాంటి సంబంధంలేని, ఇస్లామిస్టులు, ఖలిస్తానీలతో లంకె గలిగి, రెండు ఇస్లామిస్టు అనుకూల గ్రూపులైన ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ (ఐఎఎంసి), ఆర్గనైజేషన్ ఫర్ మైనార్టీస్ ఆఫ్ ఇండియా (ఒఎఫ్ఎంఐ) కలిసి 2019లో ప్రారంభించిన 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్' (హెచ్ఎఫ్‌హెచ్ఆర్)కు వీరు నిధులు ఇచ్చారు.

నక్సల్ అయిన బినాయక్ సేన్ కోసం ప్రచారం చేయడమే కాదు, అర్వింద్ కేజ్రీవాల్ ఎన్జీవోకు, వేర్పాటువాదులతో సంబంధం ఉన్న అసోసియేషన్ ఫర్ ఇండియాస్ డెవలప్‌మెంట్ (ఎయిడ్-ఎఐడి)కి టైడ్స్ ఫౌండేషన్ నిధులు ఇచ్చింది.

రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, ఆక్స్‌ఫాం, యూరోపియన్ కమిషన్ ఫర్ హ్యూమానిటేరియన్ ఆర్గనైజేషన్స్, ఇతరులతో సహా తమకు భాగస్వామ్యం ఉందని ప్రకటించే అమన్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్టు (అమన్)కు టైడ్స్ ఫౌండేషన్, నిధులు సమకూర్చింది. వివాదాస్పదమైన 'న్యూస్‌క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్తకు కూడా నిధులు ఇచ్చినట్టు అతడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారత్‌లో సిఎఎ గురించి అబద్ధపు వార్తలు ప్రచారం చేసే ఆర్ట్స్+ ఫెమినిజం సంస్థకు, ఈక్వాలిటీ లాబ్స్, బ్లాక్ లంచ్ టేబుల్ వంటి వామపక్ష సంస్థలతో లంకె ఉన్న హూస్ నాలెడ్జ్‌కు వికీమీడియా నిధులు ఇస్తుంది. పలువురు ప్రముఖుల పేర్లు ఈ సంస్థలతో, వీటి అనుబంధ సంస్థలతో ముడిపడి ఉండడం గమనార్హం.

**భారత చట్టాలను పాటించని వికీపీడియా**

వికీపీడియా యజమాని వికీమీడియా ఫౌండెషన్‌కు భారత్‌లో ఉనికిలేదు, అంటే కార్యాలయం లేదు. తాను విదేశీ సంస్థను కనుక, భారతీయ కోర్టులకు తనపై విచారణాధికారం లేదని బీబీసీ డాక్యుమెంటరీ వివాదం నేపథ్యంలో ఈ సంస్థ ప్రకటించింది. భారత్‌లో దాని ఉనికిలేకపోయినా, ఇక్కడ తన వ్యాపార, భావజాలపర ప్రయోజనాల కోసం సంస్థలకు నిధులు అందిస్తూనే ఉంది. వికీమీడియా భారతీయుల నుంచి విరాళాలను తీసుకోవడమే కాదు, ఇక్కడ మిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తుంది. భారతీయ చట్టాలను పాటించడాన్ని తిరస్కరిస్తూ ఇంత చేస్తుంది. కఠినమైన ఎడిటోరియల్ వైఖరిని అనుసరిస్తూనే, తాను ప్రచురణకర్తను కాదు మధ్యవర్తినని వాదించే సాహసం వికీమీడియాకి ఉండటమే దాని దుర్బుద్ధిని బయటపెడుతోంది.

**వికీపీడియా మధ్యవర్తి కాదు, ప్రచురణకర్త**


నిర్వచనం ప్రకారం, మధ్యవర్తి నిర్దిష్టమైన ఎడిటోరియల్ పంథాను అనుసరించాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే ఒక వేదికగా మాత్రమే ఇది ఉండాలి. కానీ, వికీపీడియా వ్యవహారం అది కాదు.

అందరూ వికీపీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయలేరు. రెండవది, ఏ వ్యాసంలో అయినా జోడించే విషయాల స్వభావంపై కొద్దిమంది ఎడిటర్లు, అడ్మినిస్ట్రేటర్లదే ఆఖరి మాట. దీనితో, ఈ వ్యాసాలు ఏకపక్షంగా, పక్షపాతంతో, ఒక నిర్దిష్ట భావజాలాన్ని అనుసరిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తుంటాయి. మూడవది, తమ వ్యాపార, భావజాల ప్రయోజనాలను కొనసాగించడానికి వికీమీడియా అనేకమంది 'వాలెంటీర్ల'కు నిధులు అందిస్తుంది. వికీపీడియా వ్యాసాలలో ఇదే పక్షపాత ధోరణి కనిపిస్తుంది.

ఈ వాస్తవాల వెలుగులో, వికీపీడియా మధ్యవర్తి వర్గం కిందకి రాదు, ప్రచురణకర్తల వర్గంలోకి వస్తుంది. ముఖ్యంగా, ఆర్థికంగా లేదా సంపాదకత్వం పరంగా భారతీయ చట్టాలను అనుసరించకుండానే భారతదేశ ప్రయోజనాలను చురుకుగా బలహీన పరుస్తున్నది. ఈ క్రమంలో దానిని నియంత్రించేందుకు ప్రభుత్వం మేలుకోవడం ఒక మంచి పరిణామం.

– డి.ఎ.

# ఆ ఆలోచనల్లోంచి రూ



ముదుగంటి రవీందర్ రెడ్డి
(జితేందర్ రెడ్డి నిర్మాత)

సినిమాను వ్యాపార సాధనంగా భావిస్తున్న ప్రస్తుత తరుణంలో దేశం కోసం, ధర్మం కోసం జీవితాలను అర్పించిన వారి చరిత్ర తెర మీదకు రావడం బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజంపై బాధ్యతతో రూపుదిద్దుకుంది 'జితేందర్ రెడ్డి' సినిమా. ఏబీవీపీ, భారతీయ జనతాపార్టీ యువమోర్చా నేతగా పనిచేస్తూ, దేశద్రోహ నక్సలైట్ల గుండెల్లో గుబులు పుట్టించాడు జగిత్యాల టైగర్ జితేందర్ రెడ్డి. అతని అడ్డు తొలగించకపోతే తమ ఆటలు సాగవని భావించిన నక్సలైట్లు 1987లో ఏకే 47 తుపాకులతో కాల్చి చంపేశారు. జితేందర్ రెడ్డి వీరమరణం పొందిన 37 సంవత్సరాలకు ఆయన తమ్ముడు ముదుగంటి రవీందర్ రెడ్డి 'జితేందర్ రెడ్డి' బయోపిక్ నిర్మించారు. నవంబర్ 8న ఈ సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా ఆయనతో జరిపిన ముఖాముఖి:

**జితేందర్ రెడ్డిని నక్సలైట్లు కాల్చి చంపినప్పుడు మీ వయస్సు ఎంత?**

నాకు అప్పుడు 22 సంవత్సరాలు. అన్నయ్యను నక్సలైట్లు చుట్టుముట్టి కాల్పులు జరుపుతుంటే... పక్కనే ఉన్న సుభాష్ కొన్ని కిలోమీటర్ల పాటు పరిగెత్తుకుని వెళ్లి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాంతో వారు జీపులో జగిత్యాలలో ఉన్న నా దగ్గరకు వచ్చారు. అప్పటికి అసలు ఏం జరిగిందో వారికీ తెలియదు. నన్ను తీసుకుని సంఘటన స్థలానికి వెళ్లేసరికే అన్నయ్య విగతజీవుడై పడి ఉన్నాడు. కిలోమీటరు పాటు అక్కడ పెద్ద యుద్ధవాతావరణం కనిపించింది. నక్సలైట్లతో దాదాపు రెండు గంటల పాటు అన్నయ్య పోరాటం చేశాడని అర్థమైంది. అలా వీర మరణం పొందిన అన్నయ్య భౌతికకాయాన్ని చూసిన మొదటి కుటుంబ సభ్యుడిని నేనే.

**జితేందర్ రెడ్డి జీవితాన్ని వెండితెరకెక్కించాలనే ఆలోచన ఎప్పుడు, ఎందుకు కలిగింది?**

అన్నయ్య వీర మరణం పొంది మూడున్నర దశాబ్దాలు గడిచిపోయింది. ఓ తరం మారి పోయింది. ఇప్పటి వారికి అప్పటి దేశభక్తుల గురించి చెప్పాల్సిన అవసరం ఉందనిపించింది. నిజానికి జితేందర్ రెడ్డి జీవితాన్ని పుస్తకంగా ప్రచురిద్దామనే ఆలోచన వచ్చింది. కానీ ఇలాంటి వారి జీవితాన్ని పుస్తక రూపంలో కంటే విజువల్‌గా చూపిస్తే హృదయానికి హత్తుకుంటుందనే భావన కలిగింది. దాంతో షార్ట్ ఫిల్మ్ చేయాలని అనుకున్నాం. కానీ కొందరు మిత్రులు ఇచ్చిన సలహాతో ఫీచర్ ఫిల్మ్ చేస్తే ఎక్కువ మందిని ఇది చేరుకుంటుందనే ఉద్దేశంతో చివరకు సినిమా తీయాలనే నిర్ణయాన్ని తీసుకున్నాను.

**మీరు సినిమా రంగానికి చెందిన వ్యక్తి కాదు. మరి మీ సోదరుడి జీవితగాథను సినిమాగా తీయాలనుకున్నప్పుడు మీకు బయటి నుండి అలానే సినిమా రంగం నుండి ఎలాంటి సహకారం లభించింది?**

మా నాన్న మల్లారెడ్డి గారు ఆర్ఎస్ఎస్‌లో ప్రాంత బాధ్యతలను నెరవేర్చారు. ఆ రకంగా మాది సంఘ కుటుంబం. అన్నయ్య జీవించి ఉన్నప్పుడు రామచంద్రయ్యగారు మాకు విభాగ్ ప్రచారక్‌గా ఉండేవారు. లింగం సుధాకర్ రెడ్డి గారు మా జిల్లా ప్రచారక్. జితేందర్ రెడ్డి గురించి వారికి బాగా తెలుసు. వారి సలహాలు సంప్రదింపులు తీసుకుని ఈ సినిమా ఎలా ఉంటే బాగుంటుందనే ఆలోచన చేశాను. అన్నయ్యతో పరిచయం ఉన్నవారి నుండి కొన్ని విషయాలను సేకరించాం. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారి నుండి కొంత సమాచారం తీసుకున్నాం. ఆర్ఎస్ఎస్ ప్రచారకులు, జాతీయవాద రచయిత అప్పాల ప్రసాద్ గారికి ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పినప్పుడు ఆయన ఎ. దయాకరరావుగారిని పరిచయం చేశారు. ఆయన ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నంగారి తమ్ముడు. ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. ఆయన ద్వారానే సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్ గారి పరిచయం అయ్యింది. వారే దర్శకుడిగా విరించి వర్మను సూచించారు. విరించి వర్మ గతంలో 'ఉయ్యాల జంపాల, మజ్ను' చిత్రాలను తెరకెక్కిం చారు. వారిని కలిసి జితేందర్ రెడ్డి జీవితం గురించి చెప్పినప్పుడు స్ఫూర్తి పొంది ఈ సినిమాను తప్పకుండా చేస్తానని మాట ఇచ్చారు. అలా 'జితేందర్ రెడ్డి' సినిమా మొదలైంది.

**నటీనటుల ఎంపిక ఎలా జరిగింది?**

ఆ బాధ్యతను పూర్తిగా దర్శకుడు విరించి వర్మ తీసుకున్నారు. ఇది బయోపిక్ కాబట్టి... నిజజీవిత వ్యక్తుల ఛాయా చిత్రాలను ఆయనకు ఇచ్చాను. దానికి తగ్గ ఆర్టిస్టులను ఎంపిక చేసుకుని, ఆడిషన్ నిర్వహించి సెలెక్ట్ చేశారు. అలానే జితేందర్ రెడ్డి పాత్రను రాకేశ్ వర్రె పోషించారు. ఆయన తన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేకూర్చారు. ఎప్పటికప్పుడు నాకు ఏ పాత్రకు ఎవరిని తీసుకుంటున్నారో చెప్పేవారు. సినిమా నిర్మాణంలో జరిగిన జాప్యం కారణంగా డేట్స్ అడ్జస్ట్ కాక కొంతమంది పాత్రధారులను మార్చాల్సి వచ్చింది. ఏదేమైనా ప్రతి ఒక్కరూ ఇది తమ చిత్రంగా భావించి, ఆయా పాత్రలను చక్కగా పోషించారు.

**సినిమా రంగం నుండి మీకు ఎలాంటి సహకారం లభించింది?**

మీరన్నట్టుగా నేను ఈ రంగానికి చెందిన వాడిని కాదు. అయితే ఓ సత్ సంకల్పంతో ఈ సినిమా ప్రారంభించాను. చాలామంది ఇలాంటి సినిమాలు తీయడం కష్టమని నా నిర్ణయాన్ని మార్చుకోమని సలహాలు ఇచ్చారు. సినిమాను సమయానికి పూర్తి

# పుదిద్దుకున్నదే 'జితేందర్ రెడ్డి'

చేసి విడుదల చేయలేననీ అన్నారు. నక్సలిజాన్ని వ్యతిరేకిస్తూ సినిమా తీయొద్దంటూ కొందరు చెప్పారు. 'జితేందర్ రెడ్డి' బయోపిక్ తీయాలనే నిర్ణయం తీసుకున్నప్పుడే నేను వీటన్నింటినీ ఎదుర్కొనడానికి సిద్ధపడ్డాను. ఎవరి మెప్పుకోసమో, ఎవరికో భయపడో సినిమాను తీయాలని అనుకోలేదు. నిజాన్ని నిర్భయంగా ఈ సినిమా ద్వారా చెప్పాలనుకున్నాను. ఒకప్పుడు తెలంగాణలో పారలల్ గవర్నమెంట్ నడిపిన నక్సలైట్ల వల్ల ఈ దేశానికి, ధర్మానికి జరిగిన అన్యాయాన్ని కచ్చితంగా తెర మీద చూపించాలని నిర్ణయించుకున్నాను. ఆ దిశగా ముందుకు సాగాను.

**మీకు ఎవరి నుండి బెదిరింపులు రాలేదా?**


ఇక్కడ మీకో విషయం చెప్పాలి. నేను ఆర్ఎస్ఎస్ వాడిని. కానీ ఈ సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం లేదు. దాంతో సహజంగా సినిమా రంగంలోని కొందరు ఇలాంటి సినిమా ఎందుకు చేస్తున్నారు? దీనివల్ల మీ కెరీర్ ఇబ్బందిలో పడే ఆస్కారం ఉందని చెప్పారట. నాకూ కొన్ని కాల్స్ వచ్చాయి. ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ ధైర్యంగా తమ పేరును ప్రకటించి నన్ను బెదిరించి ఉంటే నేను దానిని సీరియస్‌గా తీసుకునే వాడిని. కానీ పేరూ, ఊరు చెప్పుకునే ధైర్యంలేని వారి కాల్స్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను భావించాను. అలాంటి బెదిరింపులకు బెదిరే వ్యక్తినీ కాదు. అందుకే వాటిని సీరియస్‌గా తీసుకోలేదు.

**'జితేందర్ రెడ్డి' సినిమా విడుదలలో జాప్యం జరిగింది. ఎందుకలా?**

సినిమా నిర్మించాలనే ఆలోచన నాలుగేళ్లుగా ఉంది. షూటింగ్ మొదలు పెట్టడానికి ముందు విరించి వర్మ టీమ్ ప్రీ ప్రొడక్షన్ సమయంలోనే చాలామందిని కలిసి, అభిప్రాయాలు సేకరించి, కథ, కథనాలను తయారు చేసుకుంది. ఆ తర్వాత నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరిగింది. నిజానికి షూటింగ్ తొందరగానే జరిగింది. కానీ సెన్సార్ కావడం ఆలస్యమైంది.

**సెన్సార్ పరంగా మీరు ఎదుర్కొన్న ఇబ్బందులేమిటీ?**

మేం తీసిన 'జితేందర్ రెడ్డి' పొలిటికల్ మూవీ కాదు. ఇది దేశం కోసం, ధర్మం కోసం ప్రాణాలు అర్పించిన ఓ యోధుడి కథ. సెన్సార్ అధికారి అప్పట్లో సెలవులో ఉండటంతో అనుకున్న సమయా నికి ఇది సెన్సార్ కాలేదు. ఆ తర్వాత టెంపరరీగా వేరే వారు



జితేందర్‌రెడ్డి

వచ్చారు. వారు ఇతర సభ్యులతో సినిమా చూసి, చాలా బాగుందని అభినందిస్తూనే, 30కి పైగా మార్పులు, చేర్పులూ సూచించారు. వాటిని సవరించడానికి బాగా టైమ్ పట్టింది. ఆ తర్వాత ముంబై నుండి క్లియరెన్స్ వచ్చే సరికే లేట్ అయ్యింది. ఈ లోగా ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎన్నికల సమయంలో ఈ సినిమాను విడుదల చేయకూడదని సూచించారు. అందువల్ల ఇంకొంత ఆలస్యమైంది. చివరకు నవంబర్ 8న సినిమాను జనం ముందుకు తీసుకొచ్చాం.

**'జితేందర్ రెడ్డి' సినిమాలో రామన్న, గోపన్న మధుసూదన్ గౌడ్, సామా జగన్ మోహన్ రెడ్డి బలిదానం కూడా చూపించారు. వారి కుటుంబ సభ్యుల స్పందన ఏమిటి?**


ఇది బేసికల్‌గా జితేందర్ రెడ్డి బయోపిక్. కుటుంబపరంగా వచ్చిన రాజకీయ వారసత్వం కారణంగా అన్నయ్య బీజేవైఎంలోనూ క్రియాశీలక పాత్ర పోషించాడు. ఈ లోగా నక్సల్ చేతిలో హతమయ్యాడు. అయితే అన్నయ్యకు ముందు కూడా ఇలానే కొందరిని నక్సలైట్లు దారుణంగా హత మార్చారు. మరీ ముఖ్యంగా గోపన్న మా కుటుంబానికి బాగా కావాల్సిన వ్యక్తి. అన్నయ్యకు ఆయనంటే ఎంతో ఇష్టం. అలానే అన్నయ్యకు పరిచయం ఉన్న ఏబీవీపీ కార్యకర్తలనూ నక్సల్స్ పొట్టనబెట్టుకోవడాన్ని అతను సహించలేకపోయాడు. వారి జీవితాలను ఈ సినిమాలో అవసరమైన మేరకు చూపించే ప్రయత్నం చేశాం. వారి కుటుంబ సభ్యులకు సినిమాను చూపించాం. కొందరైతే ఆ నాటి రోజుల్ని తలుచుకుని కన్నీరు పెట్టుకున్నారు.

**'జితేందర్ రెడ్డి' కేవలం మీ ఇంటి బిడ్డ కాదు. దేశ ద్రోహులతో పోరాటం చేసి అమరుడైన వ్యక్తి. మరి అతని బయోపిక్‌కు ఎలాంటి స్పందన వస్తోంది?**


ఇది డబ్బుల కోసం తీసిన సినిమా కాదు. జాతీయవాదాన్ని పదిమందికి తెలియచెప్పడం కోసం తీసిన సినిమా. దీని నిర్మాణానికి నేను ఎవరి సహాయం తీసుకోలేదు. అయితే విడుదల సమయంలో మాత్రం సంఘ పెద్దలు, ఏబీవీపీ విద్యార్థులు, బీజేపీ నాయకులు ఈ సినిమాను చూసి ప్రోత్సహించాల్సిందిగా కోరారు. సంఘ పెద్దలు ఈ విషయంలో ఎంతో సాయం చేశారు. అలానే ఏబీవీపీ విద్యార్థులు తమ నాయకుడి సినిమాగా భావించి ఆదరిస్తున్నారు. బీజేపీ నాయకులు ఈ సినిమాను చూసి, తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలియ చేస్తున్నారు. ఇటీవలే కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గారు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ గారు సినిమా చూసి చాలా బాగా తీశానని అభినందించారు. ఇలాంటి వాటిని సాధారణ ప్రేక్షకులు కూడా ఆదరిస్తే... మరిన్ని మంచి సినిమాలు వచ్చే ఆస్కారం ఉంటుంది. ఎక్కువ మందిని ఈ సినిమా రీచ్ కావడం కోసం మేం చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేస్తున్నాం.

**'జితేందర్ రెడ్డి'ని ఓటీటీలో ఎప్పుడు చూడొచ్చు? ఇతర భాషల్లోకి అనువదించే ఆలోచన ఉందా?**

అమెజాన్ ప్రైమ్‌తో చర్చలు జరుగుతున్నాయి. వారి కోరిక మేరకు వివిధ భాషల్లోకి దీనిని అనువదించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. అయితే ఓటీటీలో వచ్చే వరకూ వేచి ఉండాలనే ఆలోచన పెట్టుకోకుండా ప్రతి ఒక్కరూ థియేటర్ లో 'జితేందర్ రెడ్డి' సినిమాను చూస్తే బాగుంటుంది. జాతీయ వాదుల చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. అలా వచ్చిన వాటిని ఆదరించడం తమ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలి.



**వడ్డి ఓంప్రకాశ్ నారాయణ**
సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



# ఇదొక వెలుగుధార

**జా**గృతి దీపావళి ప్రత్యేక సంచిక (2024) అత్యంత శోభాయమానంగా రూపొందిందంటే అతిశయోక్తి కాదు. సనాతనధర్మంలోని ఎన్నో విషయాలను, ధర్మసూక్ష్మాలను తెలియచేశారు. చాలా సంతోషం.

'గుడి-గుండె' సంపాదకీయం, 'దేవాలయం-హైందవ ధర్మదీపం' సందేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

'ఆలయం భారతీయ ఆత్మ'.. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతిస్వామి వారితో ముఖాముఖి ద్వారా సనాతన హైందవ ధర్మంలోని ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాం. ప్రపంచంలో, దేశంలో సకల సమస్యలకు హిందూ ధర్మం పరిష్కారం చూపించగలదని స్వామివారు ఉద్బోధించారు.

'భావములోన బాహ్యమునందున...' వ్యాసం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని చరిత్రను క్లుప్తంగా సోదాహరణంగా వివరించి ఆనందింప చేసింది. 'జై సోమనాథ్!' అద్భుతం. చరిత్రలో మరుగును పడిన విషయాలు చాలా తెలిశాయి.

'అంతా రామమయం'లో అయోధ్య, భద్రాచలం, ఒంటిమిట్ట, రామతీర్థం విశ్లేషణలు బాగున్నాయి.

'శక్తిపీఠాల మహాశక్తి పీఠం భారత్' వ్యాసం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ రాయడం సంచికకే ప్రత్యేకతను తెచ్చింది. చాలా విషయాలు తెలిశాయి.

'జ్యోతిర్లింగ క్షేత్రాలు', 'సర్వం సర్వలోకేశ్వరీశ్వరం' శైవం గురించి చాలా విపులంగా వివరించారు.

భారతదేశ అక్షాంశాల ద్వారా మన పూర్వీకుల జ్ఞానం వివేకం అర్థమయింది.

పంచారామాలు, గ్రామదేవతలు, పంచభూత క్షేత్రాలు, శ్రీకూర్మం, శిల్ప విలాపం, మహానంది, ఇంద్రకీలాద్రి, "ఉలి హొయలు"ఎన్నో విషయాలను తెలియజేశాయి.

'మన గుడులు' చిన్న వ్యాసమైనా మన ఆలయాల విశ్వరూపాన్ని దర్శింప చేసింది.

'ఆలయ నిర్మాణ రీతులు' ముఖాముఖీతో మన గుడుల నిర్మాణ రహస్యాలు అర్థం చేసుకునే ప్రయత్నానికి అవకాశం వచ్చింది.'ఆలయ ప్రతిష్ఠ' అందుకు ప్రేరణ ఇచ్చేదిగా ఉంది.

పూరి జగన్నాథుని విశిష్టత వ్యాసకర్త చాలా బాగా చెప్పారు

'మందిర ఆర్థిక వ్యవస్థ సారం ధర్మమే', 'అయోధ్య రామ మందిరం', 'సర్వసమానత్వం అయ్యప్పతత్వం', 'ద్వారక చరిత్ర' బాగున్నాయి

'ప్రభుత్వ జోక్యం పెద్ద అనర్థం' ముఖాముఖీ చదివిన తరువాత హిందువులకు కనువిప్పు కాగలదని అనిపించింది.

'విద్య ఆకలి తీర్చాలి వ్యక్తిని మార్చాలి' నాగపూర్ సందేశం కదిలించే రీతిలో ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సందేశం భవిష్యత్తులో భారత్ ఎదుర్కొనే సవాళ్లను, వాటిని అధిగమించి భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలిపేందుకు కావలసిన దిశా నిర్దేశం చూపించింది. సర్ సంఘచాలక్ సందేశం ఈ జాగృతి ప్రత్యేక సంచికకే వన్నెతెచ్చినది

అన్నవరం, రామప్ప, చార్‌ధామ్ అమర్నాథ్, హిమసానువులలో ఆదర్శనీయ క్షేత్రాలు, మహాప్రసాదం వ్యాసాలు అలరించాయి.

జాగృతి 'ఆత్మ' ద్వారా భండారు సదాశివరావు గురించి విపులంగా తెలుసుకొనే అవకాశం వచ్చింది.

అనంత విధ్వంసం-79 డిగ్రీల తూర్పు రేఖాంశం, నారసింహ క్షేత్రాలు హంపి, ఒకే ఒక్క ఆలయం, కోణార్క్, జాతీయ సమైక్యత యాత్ర, కృష్ణం వందే జగద్గురుం, ఉలి ఎత్తిన కీర్తి పతాక, శ్రీరంగం, రామేశ్వరం ఆలయం, కుంభాభిషేకం, ఆ గోడలన్నీ చరిత్ర పుటలే చదివేటప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనైనా, హైందవ ధర్మ చరిత్రను తెలుసుకుంటూ చాలా సంతోషించాను.

ఈ సంచిక చదివినప్పుడు కొన్ని ఆలోచనలు నాకు వచ్చాయి. వాటిని సూచనల రూపంలో మీ ముందుకు తెస్తున్నాను.

వ్యాసకర్త పేరుతో పాటు, సెల్ నెంబరు ఉంటే బాగుండేది. ఏదైనా వ్యాసం పై ఇంకా వివరం కావాల్సి వచ్చినప్పుడు వారితో మాట్లాడవచ్చును. లేకపోతే వారికి ధన్యవాదాలు తెలియచేయాలని కూడా కొందరికి ఉంటుంది.

అనేక దేశాలలో సనాతన ధర్మం పాటిస్తూ దేవాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటి వివరాలు కూడా తెలియచేసి ఉంటే బాగుండేదని పించింది.

మెసపుటోమియా, సుమేరియా నాగరికత ఒకప్పుడు హిందుత్వంలో భాగమే. ఆ వివరాలు కూడా వచ్చేవ్యాసం ఉంటే బాగుండేది. సిరియా, జోర్డాన్, పాలస్తీనా ఇవన్నీ 2000 సంవత్సరాలకు పూర్వం హిందూ ఆచారాలు (వామాచారం) లో ఉన్నవే. ఆ వివరాల కోసం ఎదురు చూసే వారూ ఉన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకో వలసిందిగా కోరుతున్నాను.



ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన మహానుభావులు, వీరుల గురించి కూడా ఒక వ్యాసం ఇచ్చి ఉంటే బాగుండేది.

ఈ వ్యాసాల కోసం సమాచారాన్ని కష్టపడి శోధించి, పరిశోధించి మనకు అందించిన జాగృతి డెస్క్‌వారికి, జ్ఞానమూర్తులైన వ్యాసకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రస్తుతం నా వయస్సు 60+ జాగృతి చదువుతున్నప్పుడల్లా నా విద్యాభ్యాసంలో 1977-1982 ఇంటర్మీడియట్, డిగ్రీలలో ఈ సమాచారం తెలుసుకోలేక పోయినందుకు చాలా బాధ, మనోవేదన ఉంది. మన జాగృతి వార పత్రిక ద్వారా చాలా సమాచారం మన భరతభూమి గురించి, మన సనాతన ధర్మం గురించి, నా కర్తవ్యం గురించి తెలుసుకుంటున్నందుకు ఎంతో ఆనందంగా, మరెంతో ఉత్సాహంగా ఉందని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

**భారత్ మాతాకీ జై**

**- బండారు జ్వాలానరసింహం.**

**(జిల్లా సహ సంయోజక్, హిందూ చైతన్య వేదిక) బాపట్ల జిల్లా, 9000160030.**

## దీప మకుటం

*ప్రజాక్షేత్రాన అక్షరవెలుగు వెదజల్లి*
*దాశ్యశృంఖలవాణి రుద్రతాండవ మాడించి*
*77వత్సరాలుగ సాంప్రదాయాలు పరిఢవిల్ల*
*తెలుగుదనపత్రిక "జాగృతి"వార పత్రిక.*
*ఈ అభిమాపత్రికకు నా కార్తికమాస దీప*
*మకుటమీ చిరుకానుక*

- ఒక పాఠకుడు










నిజానికిది సమీక్ష కాదు; దేశమే దేవాలయం అన్న మాటతో కళ్లింత చేసి చూచి, మనసంతా విశాలం చేసుకొని ఆలోచించి హృదయంతో చెప్పుకొన్న నివేదన మాత్రమే! చదువుతుంటే, జాతీయోద్యమ కాలంలో కర్షక కవి శ్రీ తుమ్మల పలికిన పద్యం గుర్తుకు వచ్చింది.

దేవుడన మాతృదేశమ / దేవతల ప్రజలు, యజ్ఞదీక్షయనంగా / సేవావ్రత నిష్ఠయ, ఇవి / జీవన సూత్రములుగా ప్రసిద్ధిం గనుమా!….

నా మాతృదేశమే నాకు దేవుడు; ప్రజలందరూ దేవతలే; యజ్ఞదీక్ష అంటే సేవ చేయడమే; ఇవే బ్రతుకు మార్గాలుగా భావించి పేరు తెచ్చుకో!

ఆ భావనతోనే 77 సంవత్సరాలుగా పనిచేస్తున్న పత్రిక జాగృతి. ఈ దీపావళి ప్రత్యేక సంచికను దేశమే దేవాలయం శీర్షికతో వెల్వరించింది.

దేవనిష్ఠనూ, దేశ నిష్ఠనూ పెంచుతున్న పత్రిక జాగృతి. ఎందరినో అపూర్వ దేశభక్తులుగా తీర్చిదిద్దిన పత్రిక జాగృతి.

ఇక ప్రత్యేక సంచికల ద్వారా జానపద విజ్ఞానాన్నీ, వనవాసీ (ఆదివాసీ–గిరిజన) సంస్కృతినీ, పారిశ్రామికాంశాలనూ, సాంకేతిక వైజ్ఞానికాంశాలనూ, ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని జాతీయోద్యమ విశేషాలనూ, స్వాతంత్ర్య అమృతోత్సవ విషయాలనూ అందించి జాగృతి పాఠకుల మానసిక వికాసానికి దోహదం చేసిన మా (మన) పత్రిక జాగృతి.




# దీపావళి దివ్యజాగృతి


ఇప్పుడు దేశమే దేవాలయం అనే అంశంమీద భారతీయ ఆధ్యాత్మిక శక్తిని మనకందించి. అగ్నిమీళే పురోహితమ్…. అన్న సంస్కృత వాక్యం ప్రపంచంలోనే మొదటి వాక్యం. ఈ వాక్యం (మంత్రం)తో ఒక వ్యాసం ఇందులో యజ్ఞం నుండి దీపారాధన వరకున్న అనేకాంశాలు శాస్త్రీయ దృష్టితో రచయిత విశ్లేషించారు. గుడి – గుండె అన్న సంపాదకీయం మనమేమిటో ఏం చేయాలో అన్న అంశాలపై మార్గదర్శనం చేస్తుంది. దేవాలయం హైందవ ధర్మదీపం అన్న వ్యాసం పాఠకుల్లో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగిస్తుంది. భావములోన అనే వ్యాసం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాస పరబ్రహ్మాన్ని మన కన్నుల ముందుంచింది. అంతా రామమయం అనే వ్యాసం దేశంలోని రామమందిరాలనూ, అయోధ్య రామమందిర నిర్మాణోద్యమాన్ని గుర్తుచేసింది. శక్తి పీఠాల భారత్ అనే వ్యాసం అష్టాదశ శక్తి పీఠాలను దర్శింపజేసింది. అంతేగాక త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ అన్న వందేమాతరాన్ని గుర్తు చేసింది. గ్రామ దేవతలకు సంబంధించిన వ్యాసం జానపదుల శాక్తేయ శక్తికి మూలం ఆదిశక్తే అని నిరూపించింది. పంచారామాలు – పంచభూత క్షేత్రాలు ఆయా క్షేత్ర మహిమల్ని అంతరార్థాల్ని సాక్షాత్కరింపజేశాయి.




శిల్ప విలాపం ఈ ఆలయ సంస్కృతిమీద జరిగిన విదేశీయుల దాడిని కళ్లకు కట్టించింది. మందిర ఆర్థిక వ్యవస్థ సారం ధర్మమే చైతన్యాన్ని నిర్మాణం చేస్తుంది అని నిరూపించింది.

ప్రభుత్వ జోక్యంవల్ల కలిగిన అనర్థాల్ని, త్రిమతాచార్యుల (శ్రీమద్ రామానుజ, ఆదిశంకర, మధ్వా చార్య) యోగదానాన్ని, ఆ సింధు సింధు పర్యంతా అన్నట్లు అన్ని ఆలయాల విశేషాల్ని అందించిన ఈ జాగృతి మామూలు సంచిక కాదు.

ఇది దివ్య జాగృతి. తెలుగువాళ్లందరు చదవాల్సిన జాగృతి.





**– ఆచార్య కసిరెడ్డి, విశ్వహిందూ**
**మాసపత్రిక సంపాదకులు,**
**9866956250**

'దాచేస్తే దాగని నిజం' అన్న శ్రీశ్రీ మాట ఇప్పుడు అందరికీ గుర్తుకు రాక తప్పదు. భారతదేశం లేదా హిందూ దేశం ఏ ఇతర దేశం మీద సైనిక దాడి చేయలేదు. కానీ సాంస్కృతిక విజయాలు ఎన్నో సాధించింది. ఇదే విషయాన్ని చర్చిస్తూ ఇటీవల ప్రపంచ పాఠకలోకం ముందుకు వచ్చిన పుస్తకమే 'ది గోల్డెన్ రోడ్: హౌ ఏన్షియెంట్ ఇండియా ట్రాన్స్‌ఫార్డ్మ్ ది వరల్డ్'. ప్రపంచ ప్రసిద్ధ రచయిత విలియం డాల్‌రింపుల్ తాజా రచన ఇది. 'స్వర్ణపథం: పురాతన భారతదేశం ప్రపంచాన్ని ఎలా మార్చింది' అన్న అర్థంలో దీనిని చదువుకోవచ్చు. ఇప్పుడు కమ్యూనిస్టు చైనా రకరకాల మార్గాలలో, జీ జింగ్‌పింగ్ నాయకత్వంలో ఆసియాకు తానే గుండెకాయ వంటిదానని ప్రచారం చేసుకోవచ్చు. ఈ వాదనకే ఒక పెద్ద వర్గం మీడియా కళ్లు మూసుకుని ప్రచారం కల్పిస్తున్నది. కానీ ఒకప్పుడు భారతదేశమే ఆ స్థానంలో ఉన్నదన్నదే డాల్‌రింపుల్ రచన సారాంశం. ఈ వాస్తవమే ఇప్పుడు దాచేస్తే దాగని నిజం అంటారాయన.

# స్వర్ణయుగానికి సమాధి కట్టినవి

కొన్ని భారతీయులందరికీ నచ్చే విధంగా, కొన్ని కొందరికి ఆగ్రహం కలిగించే విధంగా డాల్‌రింపుల్ రచనలు ఉంటాయి. కానీ అవన్నీ ప్రధానంగా భారతదేశ చరిత్ర నుంచి స్వీకరించిన ఇతివృత్తాలతోనే సాగుతాయి. వైట్ మొగల్స్, రిటర్న్ ఆఫ్ ది కింగ్, ది అనార్కీ అలాంటివే. ఇటీవలి ఈస్టిండియా కంపెనీ అన్న రచన ఒకింత భారతీయుల ఆగ్రహానికి గురైనదే. వైట్ మొగల్స్‌లో ప్రాచ్య పాశ్చాత్య సాంస్కృతిక సంఘర్షణలను ఆయన చిత్రించారు. ది అనార్కీలో వలసకాలం నాటి దోపిడీ గురించి రాశారు. అధిక సమాచారాన్ని సృజనాత్మక రచనల ఛాయలతో అందించడం ఆయన ప్రత్యేకతగా విమర్శకులు చెబుతారు. ఇప్పుడు స్వర్ణపథం కోసం స్వీకరించిన ఇతివృత్తం– ప్రపంచ పురోగమనానికి భారత ఉపఖండం అందించిన సేవ.

చరిత్రను వక్రీకరించడం అనేక రీతులుతో సాగుతుంది. అగ్రరాజ్యానికి అనుకూలంగా చరిత్ర రచన జరగడం ఇటీవలి ఒక విషాదం. వలస రాజ్యాలకు చరిత్ర రచన అంటే పాలితులను అవమానకరంగా చిత్రించడమే. దానికి





అడ్డుకట్ట వేసే ప్రయత్నం ఎక్కడో చోట జరగాలన్న అభిప్రాయం బలపడుతున్నది. అందుకే డాల్‌రింపుల్ రచన సరైన సమయానికి ప్రపంచ పాఠకుల ముందుకు వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మొగలులు, వలస పాలన అనంతర భారత దేశ వర్ణన నుంచి ఆయన పురాతన భారత వైభవం మీద ఒక్కసారిగా దృష్టి మరలించారు. భారతదేశం నుంచి యురేసియాకు తాత్విక, శాస్త్ర, ధార్మిక అంశాలు ఎలా ప్రయాణించాయో తెలియచేసే మంచి ప్రయత్నం చేశారాయన. బౌద్ధం, హిందూత్వం, ఖగోళ విజ్ఞానం, సున్న, చదరంగం ఇక్కడ నుంచి వెళ్లాయని ఆయన తన పుస్తకంలో రాశారు.

1980 నుంచి ప్రపంచమంతటా విస్తరిస్తున్న సమాచారం ఒక్కటే– ఆధునిక ప్రపంచం ప్రస్థానాన్ని ప్రభావితం చేసినది చైనా అనేదే. సిల్క్‌రోడ్ అన్న రచన ఇందుకు ఉన్న అనేక కారణాలలో ఒకటి. ఇదే విషయం మీద దాదాపు నాలుగ వేల పుస్తకాలు వెలువడినాయని అంచనా. అచ్చుకు అవసరమైన కదిలే ములుకులు, కాగితం, తుపాకీ మందు, కాగిత రూపంలోని నగదు, తపాలా విధానం ఇవన్నీ చైనా ఘనతగా నమోదైనాయి. భారతదేశానికి ఇంత ప్రతిష్ఠ ఇవ్వడానికి విద్యావంతులకు మనసు ఒప్పదు. అయితే యోగా వంటి అద్భుత ప్రక్రియకు ఆద్యులాలు భారతమేనన్న వాస్తవాన్ని దాచలేకపోయారు. వర్తమానంలోను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ అవతరించిన వాస్తవాన్ని కూడా మరుగున పరచడం సాధ్యం కావడం లేదు. ఇవన్నీ ఎలా ఉన్నా పురాతన భారతానికి ప్రపంచం కృతజ్ఞత చూపవలసిన అవసరం ఉందనే డాల్‌రింపుల్ అంటున్నారు.

నౌకాశ్రయాలు, విస్తృత విపణులతో భారతదేశం ప్రపంచ పటంలో వైభవోపేతంగా నిలబడిన కాలం చరిత్రలో ఒక వాస్తవం. అనేక మంది విదేశీ వ్యాపారులు ఇక్కడకు వచ్చారు. పురాతన కాలపు భారతీయులు కూడా విదేశాలకు వెళ్లి వాణిజ్యం సాగించారు. ఈజిప్ట్, ఇథియోపియా, వియత్నాం, చైనాలతో మన పూర్వికులు వ్యాపార వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్నారు. బ్రాహ్మణ సంస్కృతి మీద తిరుగుబాటుగా ఆవిర్భవించిన బౌద్ధం తన అనుయాయులను ఖండాంతర ప్రయాణాలకు ప్రేరేపించింది. అంతకంటే ముందే బౌద్ధం సాగరాలు దాటివెళ్లింది. దీనితో అపార సంపద సృష్టికి వాతావరణం ఏర్పడింది. బౌద్ధం మార్గంలో కాకున్నా రోమ్‌తో భారత్‌కు బలమైన వాణిజ్య బంధం ఉండేది. తాజాగా దొరికిన పురావస్తు ఆధారాలతో డాల్‌రింపుల్ ఇదే విషయాన్ని ఆవిష్కరించారు. ఎర్ర సముద్రం ద్వారా జరిగిన వాణిజ్యం ఇతోధికంగా సుంకాలు

**ఇస్లామిక్ మతోన్మాద చరిత్ర, ఐరోపా సామ్రాజ్యవాద చరిత్ర చాలాసార్లు చాలా సన్నిహితంగా చాలా ప్రమాదకరంగా పెనవేసుకున్నాయి. ఒకరి విషం మరొకరికి జీవనాధారం అయింది.**

**– విలియం డాల్‌రింపుల్**



# ఇస్లాం దాడులే!

చెల్లించింది. ఆ ధనరాశి ఎంత అంటే రోమ్ సామ్రాజ్య బడ్జెట్‌లో మూడో వంతు. భారత్ నుంచి వెళ్లిన మూడు నౌకల సరుకు మీద వేసిన సుంకంతో తెచ్చిన ఆదాయం మూడునుంచి ఆరు వేలు ఉండే ఒక రోమన్ సైనిక శ్రేణి నిర్వహణకు సంవత్సరం పాటు సరిపోయేది.

ఏమైనా క్రీస్తుపూర్వం 3 నుంచి క్రీస్తుశకం 12, 13 శతాబ్దాల కాలం వరకు భారత్ సువర్ణాధ్యాయాన్ని లిఖించుకుంది అన్నదే డాల్‌రింపుల్ వాదన. ఇది కొందరికి నచ్చలేదనుకోవాలి. ప్రధానంగా భారతీయ అన్న మాట వినిపిస్తే జడుసుకునే వారికి ఇది నచ్చలేదు. అలాగే భారత్ విశ్వగురు స్థానానికి వెళుతుందని ఎవరు ఆశాభావం వ్యక్తం చేసినా వాళ్లని మోదీ వాదులుగా ముద్ర వేసే వారికి కూడా ఆ వాదన అసలు నచ్చలేదు. డాల్‌రింపుల్ పుస్తకం మీద వెలువడిన సమీక్షలలో ఇదే వ్యక్తమయింది. ఇలాంటి సమీక్షకులకు లేదా మేధావులు బిరుదాంకితులకు నచ్చని విషయం కూడా ఉంది.

భారతీయ గణితశాస్త్రం, ఖగోళశాస్త్ర సూత్రాలు అరబ్ దేశాలకు వెళ్లి అక్కడ నుంచి యూరప్ ఖండాన్ని తాకిన క్రమం కూడా డాల్‌రింపుల్ ఇందులో చెప్పారు. ప్రాచీన భారతం విశ్వగురు అనడానికి ఆయన వెనుకాడలేదు. ఆ మాటను ససేమిరా అంగీకరించరు మన మేధావులు. అక్కడితో ఆగలేదు. 12వ శతాబ్దంలో ముస్లిం పాలకులు నిజానికి దురాక్రమణదారులు భారతదేశానికి రావడంతో ఆ స్వర్ణయుగానికి అంతం ఆరంభమైందన్న వాదన కూడా ఆయన ప్రతిపాదించారు. కాబట్టి ఈ పుస్తకం హిందుత్వ వాదులకు నచ్చుతుందని కొందరు సమీక్షకులు పైత్యం ప్రదర్శించారు. పైత్యం అని ఎందుకు అనవలసి వస్తున్నదంటే, డాల్‌రింపుల్ చేసిన పరిశోధన, ఇచ్చిన ఆధారాలను బట్టి కాకుండా, ముందు నుంచి స్థిరపడిపోయిన కొన్ని అభిప్రాయాలతోనే సదరు సమీక్షకులు రాశారు. చిరకాలంగా భారతీయత ఔన్నత్యాన్ని నమ్ముతున్నవారు చేస్తున్న వాదనను డాల్‌రింపుల్ సరైనదని రుజువు చేశారు. క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం, క్రీస్తుశకం 12,13 శతాబ్దాల మధ్య భారతదేశం ఏమిటి? ప్రపంచానికి వనరు.చైనాను మించినది. ఇదీ డాల్‌రింపుల్ తేల్చిన విషయం. ఆ కాలం రోమ్‌కు తరువాత మధ్యధరా యూరప్‌లకు గ్రీస్ ఎటువంటిదో దక్షిణాసియా మధ్య ఆసియా ఆమాటకొస్తే చైనాకూ భారత్ అలాంటిది అన్నారు ది గోల్డెన్ రోడ్ రచయిత.ఇది గతంలోను వాస్తవమే. అయినా ఇప్పుడు చెప్పడం చైనా–భారత్‌ల మధ్య విరోధానికి దారి తీస్తుందికదా అని చిత్రమైన తర్కం లేవదీస్తున్నారు.

ప్రాచీన భారతదేశం సమకాలీన ప్రపంచంలో తీసుకువచ్చిన మార్పుల గురించి, చూపిన ప్రభావం గురించి డాల్‌రింపుల్ తన పుస్తకంలో వివరించారు. ఇంకొక కీలక చారిత్రక వాస్తవం కూడా ఉంది. చైనా తనను తాను ఈ ప్రపంచానికి కేంద్రబిందువుగా చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇక్కడి నుంచి పాశ్చాత్య దేశాలకు ప్రత్యక్ష వాణిజ్య వ్యాపారాలు జరిగిన జాడలేవీ లేవని నిర్ధారించారు డాల్‌రింపుల్. అసలు పాశ్చాత్య దేశాలు చైనా గురించి వినడమే తప్ప, దాని గురించి తెలిసినది చాలా తక్కువ అన్నారాయన. అదే భారత్‌కూ, రోమ్‌కూ మధ్య విశేషమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇంతకు ముందు భారత్ వాణిజ్య నౌకలు చెల్లించిన సుంకం పెద్ద ఎత్తున ఉండేదని ముందు చెప్పుకున్నాం. అంతకు మించి విస్తుపోయే మరొక ఆధారం ఇచ్చారు డాల్‌రింపుల్. భారత ప్రదర్శనశాలల్లో రోమ్‌లోను, దాని సరిహద్దు దేశాలలోను కూడా లేనన్ని రోమన్ నాణేలు ఉన్నాయి.

ఈ రచన ఏ తీరులో సాగింది? రోమ్‌తో ఘనమైన వాణిజ్యం డాల్‌రింపుల్ కొత్త పుస్తకంలో ఒక విభాగం. చైనా, మధ్య ఆసియాలకు ఆపై సైబీరియా, మంగోలియాలకు బౌద్ధం విస్తరణ మరొక విభాగం. అలాగే గణితం, ఖగోళశాస్త్రాల ప్రయాణం మరొక విభాగం. హిందూత్వం, సంస్కృత భాష దక్షిణ ఆసియాకు, కంబోడియాలకు వెళ్లిన తీరు కూడా ఆయన తీసుకున్నారు. వీటిని ఆధారాలతో చెప్పారాయన. కానీ మార్క్సిస్టు చరిత్రకారులు, ఆ జాడలే ఉన్న ఇతర రచయితలు ఇది చైనాతో విరోధానికి దారి తీస్తుంది కదా అని వాదించడమే విడ్డూరం. చారిత్రక వాస్తవాలను మరుగు పరిచి ముస్లింలను సంతృప్తి పరచాలని ఎంతో చరిత్రను వక్రీకరించారు. ఆ పని ఇప్పుడు చైనా విషయంలో కూడా జరుగుతుంది కాబోలు.

**– జాగృతి డెస్క్**



# కెనడా ఖలిస్తానీవాదులు సిక్కులందరికీ ప్రతినిధులు కారు

కెనడాలో ఉన్న ఖలిస్తాన్ మద్దతుదారులు ప్రపంచం మొత్తం మీద సిక్కు మతస్థులకు ప్రతినిధులు కారని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యానించారు. భారత్–కెనడా దౌత్య సంబంధాలు తీవ్ర స్థాయిలో పతనమైన నేపథ్యంలో ట్రూడో ఈ మాటలన్నారు. కెనడాలో ఖలిస్తాన్ ఉగ్రవాదాన్ని సమర్థించేవాళ్లు చాలామంది ఉన్నారు కానీ, వాళ్లు మొత్తం సిక్కు ప్రపంచానికి ప్రతినిధులు కారని వివరించారాయన. నవంబర్ 4 అట్టావాలోని పార్లమెంట్ హిల్ కార్యక్రమం సందర్భంగా ట్రూడో ఈ వ్యాఖ్య చేశారు. విభజించి పాలించు అన్న బ్రిటిష్ సిద్ధాంతం ఈ పాత వలసను పాలిస్తున్న ట్రూడో కూడా బాగా వంటబట్టించుకున్నట్టే ఉంది. ఖలిస్తానీ మద్దతుదారులైన సిక్కులను వేరు చేశాడు. అలాగే కెనడాలో నరేంద్ర మోదీ సమర్ధకులైన హిందువులు ఉన్నారు, వారంతా మొత్తం హిందువులకు ప్రాతినిధ్యం వహించరు అని కూడా వ్యాఖ్యానించారు. మోదీని సమర్థించినా సమర్థించకున్నా హిందువు లంతా హిందువులే. అయితే ఈ ప్రకటన ద్వారా ట్రూడో నోటి నుంచి ఒక వాస్తవం వెలుగులోకి వచ్చింది. అది– కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులు ఉన్నారు.

బ్రామ్‌టన్ రగడ అంత అప్రజాస్వామికంగా, హింసాయుతంగా సాగినా కెనడా తొందరపాటు చర్యలు మానలేదు. బ్రామ్‌టన్ హిందూ సభ ఆలయ ప్రధాన పూజారిని విధుల నుంచి తొలగించి తరువాత లెంపలు వేసుకుంది. హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడారంటూ హిందూ సభ ప్రధాన పూజారి రాజిందర్ ప్రసాద్‌ను ఆ నగర మేయర్ పాట్రిక్ బ్రౌన్ విధుల నుంచి బహిష్కరించిన తరువాత ఆయన తప్పిదం ఏమీ లేదని తేలడంతో తిరిగి విధులలోకి తీసుకున్నారు. హిందూ కెనేడియన్ ఫౌండేషన్ ఈ సంగతిని ఎక్స్ ద్వారా వెల్లడించింది.

# కురుక్షేత్ర కేంద్రంగా పర్యాటకాభివృద్ధి

పురాణ, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశాలు భారతదేశంలో ఎన్నో ఉన్నాయి. వాటి ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచించడం మంచి ప్రయత్నమే. ఆ పని హరియాణా ప్రభుత్వం ప్రారంభించింది. మహా భారత గాథలో కీలకమైన కురుక్షేత్ర యుద్ధం జరిగినట్టే చెప్పే ప్రదేశం హరియాణాలో ఉంది. ఆ ప్రదేశాన్ని ఇప్పటికీ కురుక్షేత్ర అనే పిలుస్తున్నారు. దీని కేంద్రంగానే పర్యాటక రంగాన్ని వృద్ధి చేయబోతున్నట్టు ఆ రాష్ట్ర పర్యాటక మంత్రి డాక్టర్ అరవింద్‌కుమార్ శర్మ తెలియచేశారు. దీనికి 'మహా భారత సర్క్యూట్' అని పేరు పెట్టారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల అధికారులతో ఇటీవల కర్నాల్‌లో జరిగిన సమావేశంలో ఈ ప్రణాళిక చర్చకు వచ్చింది. పురాణ ప్రాధాన్యం కలిగిన కురుక్షేత్ర, చారిత్రక ప్రాధాన్యం కలిగిన కర్నాల్, పానిపట్‌ల అభివృద్ధి గురించి చర్చించారు. వీటిని ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దాలన్నదే వారి ప్రయత్నం. బృందావన్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దిన తీరులోనే కురుక్షేత్రను కూడా తయారు చేయాలన్నదనే హరియాణా ప్రయత్నం. కృష్ణ భగవానుడి జీవితంతో ముడిపడి ఉన్న బృందావన్‌కు పర్యాటకులు పోటెత్తుతూ ఉంటారు. కురుక్షేత్రను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మలచాలన్నదే తమ ధ్యేయమని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఉత్తర ప్రాంత విభాగం సంచాలకులు ఆర్‌కె సుమన్ చెప్పారు. కురుక్షేత్రతో పాటు దేశ వ్యాప్తంగా అటు రామాయణం, ఇటు భారత గాథలతో సంబంధం ఉన్నట్టు చెప్పే అన్ని ప్రదేశాలను



# స్విస్‌లో బుర్ఖా నిషేధం



జనవరి 1, 2025 నుంచి స్విట్జర్లాండ్‌లో బుర్ఖా మీద నిషేధం అమలులోకి వస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాయిటర్ వార్తా సంస్థ నవంబర్ 6న వెల్లడించింది. బుర్ఖా మీద నిషేధం మొదలవుతున్నది. దీనిని ఉల్లంఘించిన వారు 1000 స్విస్ ఫ్రాంక్‌లు (1.144 డాలర్లు) జరిమానా చెల్లించాలి అని ఫెడరల్ కౌన్సిల్ తెలియచేసింది. 2021లో దేశంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్వల్ప ఆధిక్యంతోనే అయినా బుర్ఖా మీద నిషేధానికి సానుకూలత వ్యక్తమయింది. దీనిని సహజంగానే ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. మసీదుల మీద మీనారేట్స్ నిర్మాణం మీద 2009లో అక్కడ నిషేధం మొదలయింది. భద్రత, కొన్ని సంప్రదాయాలు పాటించే క్రమంలో, వాతావరణంలో మార్పులు, వినోదం, వ్యాపార ప్రకటనల చిత్రీకరణ వంటి వాటి కారణాలతో మాత్రమే ముఖానికి ముసుగు ధరించవచ్చు. భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం ముందస్తు అనుమతితో కూడా ముఖానికి ముసుగు ధరించవచ్చు. కొద్దిమంది స్విస్ మహిళలు అఫ్ఘానిస్తాన్ మహిళల మాదిరిగా ముఖాన్ని పూర్తిగా కప్పుకుంటూ కనిపిస్తున్నారు. ముస్లింలు, ఆ తరహాలో ముఖాలను కప్పుకుంటూ వస్త్రాన్ని ధరించే సంప్రదాయాన్ని నిషేధించడానికి గడచిన సెప్టెంబర్‌లో స్విట్జర్లాండ్ దిగువ సభ అంగీకారం తెలిపింది. నేషనల్ కౌన్సిల్ కూడా 151–29 ఓట్లతో ఇదే నిషేధం నిర్ణయం ఆమోదించింది. పాప్యులిస్ట్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టానికి పాటు పడింది. అయితే కొన్ని రాజకీయ పక్షాలు దీనిని వ్యతిరేకిం చాయి. దీని మీదనే 2021లో దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. నిజానికి స్విస్‌లో రెండు ప్రాంతీయ ప్రభుత్వాలు టిసినో, సెయింట్ గల్లాన్ ఇప్పటికే బుర్ఖా మీద నిషేధం అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతాలనే కేంటన్‌లు అంటారు. బుర్ఖా నిషేధంలో బెల్జియం, ఫ్రాన్స్ అనుసరించిన దారిలోనే స్విట్జర్లాండ్ కూడా ప్రయాణించింది. స్విట్జర్లాండ్‌లో ఒక రాజ్యాంగ సవరణ జరగాలంటే మొదట లక్ష సంతకాలతో ప్రతిపాదన రావాలి. అందులో సగం సంతకాలు వచ్చినా పార్లమెంట్ చేసిన చట్టాల మీద ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. ప్రజాభిప్రాయ సేకరణకు వరకు విషయం వచ్చిందంటే దేశం ఆమోదం ఉన్నట్టే. ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణ జెట్ విమానాల కొనుగోలు, బుర్ఖా నిషేధం మీద జరిగింది.

★

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న యోజన ఉన్నది. ఇందుకు రూ. 200 కోట్లు ఖర్చు చేయాలని కూడా ప్రతిపాదించారు. మహాభారత రెండో సర్కిట్ పేరుతో సాగిన కర్నాల్ సదస్సుకు 130 మంది పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. మూడు రోజులు ఈ కార్యక్రమం జరిగింది.

బ్రహ్మదేవుని గాథలతో బంధం ఉన్న బ్రహ్మ సరోవర్, శ్రీకృష్ణా మ్యూజియం, భీష్ముడు అంపశయ్య ఎక్కాడని చెప్పుకునే భీష్మకుండ్, గీతోపదేశం జరిగిన ప్రదేశంగా చెప్పే జ్యోతిసార్ ప్రదేశాలను మహాభారత సర్కిట్ ప్రణాళిక పేరుతో పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. షేక్ చిష్లి గుమ్మటం, నవి పథషాహి గురుద్వారా, స్థానేశ్వర్ మహాదేవ్ ఆలయం, భద్రకాళి ఆలయం వంటివాటిని దర్శనీయ చారిత్రక ప్రదేశాలుగా మలచాలన్న ఆలోచన ఉంది. మహాభారత సర్కిట్ ప్రణాళికలో గుర్తించిన ప్రదేశాలు ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల లోను విస్తరించి ఉన్నాయి. హస్తినాపురం, మథుర, బద్రీనాథ్ అలాంటివే. హరియాణా పర్యాటక శాఖ చెబుతున్న వివరాలను బట్టి ఒక్క కురుక్షేత్ర పరిధే 147 చదరపు కిలోమీటర్లు. ఈ ప్రాంతంలోనే అనేక దేవాలయాలు, పవిత్ర క్షేత్రాలు ఉన్నాయి. ★



# కొత్త సంగతి చెప్పొచ్చు కదా!




కాంగ్రెస్ ధరించిన సెక్యులర్ ముసుగు గురించి వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక బట్టబయలు చేసిందని కేరళ ముఖ్య మంత్రి, సీపీఎం నాయకుడు పినరయి విజయన్ తేల్చేశారు. ఈ విషయం ఆయన కొత్తగా కని పెట్టినట్టు ఎక్స్ వేదికగా ప్రకటన ఇచ్చినప్పటికీ అది పాత నిజం. ఇది గట్టిగా నవ్వుకోవలసిన విషయమే. కాంగ్రెస్‌లో సెక్యులరిజం లేదన్న సంగతి ఇప్పుడు జాతికి చెప్పాలా విజయన్? అదేమైనా రహస్యమా? వయనాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక జమాత్ ఎ ఇస్లామ్ మద్దతుతోనే పోటీ చేస్తున్నారని విజయన్ చెప్పారు. జమాత్ ఎ ఇస్లామ్ సిద్ధాంతాలేమిటో భారతీయులందరికీ తెలుసు. ఆ సంస్థ చరిత్ర కూడా కూడా మనందరికీ తెలిసినదే. ఒకటే ప్రశ్న అవన్నీ ప్రజాస్వామ్యానికి అనుగుణమైనవేనా? అని ప్రశ్నించారు విజయన్. జమాత్ అసలు ఒక దేశం అనే భావననే అంగీకరించదు. అలాగే దేశ పాలన వ్యవస్థ మీద నమ్మకం కలిగినది కాదు. రాజకీయాల పేరుతో సంక్షేమం పేరుతో మత రాజకీయాలను నడుపు తుందని ఆయన అన్నారు.

ఈ మధ్య సీపీఎంకూ ఇండీ కూటమికీ దూరం బాగా పెరిగిన మాట నిజం. ఇండీ కూటమి ఏర్పాటు తరువాత వామపక్షాల మధ్య దూరం ఇంకాస్త పెరిగిందని ఆ పార్టీ ప్రముఖ నాయకురాలు బృందాకారత్ అన్నారు. అంతేనా! ఇండీ కూటమిలో తాము లేకున్నా తమ జెండాను ఉపయోగించు కుంటున్నారని ఆరోపిస్తూ సీపీఎం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ★

**దేశీయ ఆయుధాల ఉత్పత్తిలో దూసుకుపోతున్న భారత్ ప్రస్తుతం తాను తయారు చేస్తున్న వాటిలో ఒక ఆయుధాన్ని భవిష్యత్తులో అత్యంత విశ్వసనీయమైన క్షిపణి ప్రయోగ వ్యవస్థగా చేసేందుకు సిద్ధమవుతోంది. దేశీయంగా తయారు చేసిన పినాక మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్ (బహుళ రాకెట్లను ప్రయోగించగల వ్యవస్థ – ఎంఎల్ఆర్ఎస్) సామర్థ్యాన్ని ప్రస్తుతానికన్నా నాలుగురెట్లు పెంచేందుకు ప్రక్రియను ప్రారంభించింది. పినాకను దీర్ఘశ్రేణి క్షిపణిగా మార్చేందుకు దాని పరిధిని, శక్తిని పెంచే పని ప్రారంభమైందని రక్షణ వర్గాలు చెబుతున్నాయి.**

# దీర్ఘశ్రేణి క్షిపణి ప్రయోగ వ్యవస్థ 'పినాక'



పినాక నుంచి స్పెషల్ ఏరియా డెనియల్ మ్యునిషన్ (ఏడీఎం)లో కాల్పులను జరపడంపై పని జరుగుతోంది. ఇది శత్రు దళాలు ముందుకు రాకుండా దూర ప్రాంతం వరకు మందుపాతరలను వెదజల్లనుంది.

పినాక పరిధిని నాలుగు రెట్లు పెంచడం ద్వారా ప్రపంచంలోనే ఉత్తమమైన రాకెట్ ప్రయోగ ఆయుధ వర్గంలోకి దీనిని తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ఈ దిశలో పురోగతి సంతృప్తికరంగా ఉందని రక్షణ అధికారులు చెబుతున్నారు. అంతేకాదు, ఇది అత్యంత అద్భుతమైన ఆయుధంగా రూపుదిద్దుకోనుందని వారు విశ్వసిస్తున్నారు.

**గత మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్న పినాక**

భారతీయ సైన్యానికి పినాక కొత్త ఆయుధమేం కాదు. దీనిని దాదాపు మూడు దశాబ్దాలుగా భారతీయ సైన్యం ఉపయోగిస్తోంది. తన శక్తి సామర్థ్యాలను 1999లో యుద్ధ రంగంలో పినాక తొలిసారి ప్రదర్శించింది. కార్గిల్ యుద్ధ సమయంలో పాకిస్తానీ చొరబాటుదారులు ఆ ఎత్తైన పర్వత శ్రేణుల్లోకి చొచ్చుకు రాకుండా ఆ ప్రాంతాలను నిష్ప్రభావం చేసేందుకు సైన్యం వీటిని మోహరించింది. తర్వాత సంవత్సరంలో వీటిని భారతీయ సైన్యంలోకి అధికారికంగా ప్రవేశపెట్టారు. ఇందులో ప్రతి లాంచర్‌లోనూ 122ఎంఎం సామర్థ్యం గల రాకెట్లను ప్రయోగించేందుకు 12 గొట్టాలు ఉంటాయి. ఈ మొత్తం రాకెట్లను కేవలం 44 సెకెండ్లలో పేల్చవచ్చు. ఈ లాంచర్‌ను ఎక్కడ కావాలంటే అక్కడకు వేగంగా ప్రయాణించగల ఎత్తుగా ఉన్న ట్రక్కుపై అమరుస్తారు. మొదట పినాక పరిధి 37.5 కి.మీలుగా ఉండేది కానీ తర్వాతి కాలంలో దానిని 70 కి.మీల వరకూ పెంచారు. దానిని 90 కి.మీ పరిధికి సంబంధించిన క్షిపణి పరీక్షలు త్వరలో జరుగనుండగా, దాదాపు 120 కిమీలు, 300 కి.మీల వరకు దాని పరిధిని పెంచేందుకు కూడా పరీక్షలు ప్రయోగాలు జరుగుతున్నాయి.

భారతీయ సైన్యంలోని శతఘ్ని దళాలలోని నాలుగు పటాలాల వద్ద పినాక ఎంఎల్ఆర్ఎస్ ఉండగా, మరొక ఆరు దళాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదించింది. రానున్న ఆరేళ్ల కాలంలో పినాకా దళాలను 22కు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి.

దీని పరిధిని విస్తరించడమే కాకుండా, దీని సామర్థ్యాన్ని 122 ఎంఎం నుంచి 214 ఎంఎంకు పెంచారు. కేవలం 44 సెకెన్లలో ఆరు లాంచర్ల దళం 1000 మీటర్ల పొడవు, వెయ్యి మీటర్ల విస్తీర్ణం గల ప్రాంతాన్ని పూర్తిగా ధ్వంసం చేయగలవు.

**అర్మేనియాకు పినాక ఎగుమతులు**

భారతదేశంలో తయారు చేసి, అర్మేనియాకు ఎగుమతి చేసిన పినాక రాకెట్లు ఇరాన్, అజెర్బైజాన్ రహదారి ద్వారా రవాణా చేసినట్టు గత జులై ఆఖరు వారంలో వార్తలు వచ్చాయి. న్యూఢిల్లీ నుంచి పినాక రాకెట్లను అర్మేనియా రాజధాని యెరెవన్‌కు ట్రక్కులో తీసుకువెడుతున్నట్టుగా పేర్కొంటూ ఆ ట్రక్కు ఫోటోలు కూడా సోషల్ మీడియాలో షికార్లు చేశాయి.

కాగా, ఈ సరుకును ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ రేవు ద్వారా రవాణా చేసినట్టు అజెర్బైజానీ మీడియా ఆరోపించింది. ఇరాన్ అటు అర్మేనియా, ఇటు అజర్బైజాన్‌తో సరిహద్దులు కలిగి ఉంది. ఒక రకంగా అర్మేనియా, అజర్బైజాన్‌లు ఇరుగు పొరుగు దేశాలు. అందుకే అజర్బైజాన్ రాజకీయ నాయకులు ఈ చర్యను ప్రతికూలంగా చూశారు. దీనికి ప్రధాన కారణం, అజర్బైజాన్‌కు నైరుతిలో ఉన్న నాగొర్నో – కరబాఖ్ అనే ప్రాంతం విషయంలో రెండు దేశాల మధ్య వివాదం నడుస్తుండడమే. అజర్బైజాన్ నియంత్రణలో ఉన్న ఈ ప్రాంతంలో నివసించే జనాభాలో మెజారిటీ ప్రజలు అర్మేనియన్లే కావడం, ఈ ప్రాంతాన్ని అర్మేనియాలో కలపాలని వారు దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తుండడం, ఈ క్రమంలో 1991–1994వరకు యుద్ధం జరగడం వంటి కారణాల వల్ల భారత్ చేపట్టిన ఈ చర్యను అజర్బైజాన్ తమకు ముప్పుగా చూస్తోంది.

– జాగృతి డెస్క్

# నీకు తెలియని అడుగు

విజయం అందుకున్న రోజు ముందుమాట
ఇది నా మొదటి అడుగని చెప్పిన పూట
ఒక్కసారి నువ్వు సాగే నా మనసు
ఎందుకనీ అడిగాక చెప్పిందే ఈ ఊసు.

జీవితాన్ని గెలవాలనే ఆలోచనే
మొదటి అడుగు
ఎలా గెలవాలని దారి వెతికినపుడే
రెండో అడుగు.
ఏ నిమిషం మలుపులేక సాగినపుడే
మూడో అడుగు
అడుగు దూరంలో ఓడినపుడే
నాలుగో అడుగు
అవకాశం జారుతున్నా నిలబడే ఓర్పే
ఐదో అడుగు.
ఓటమిలో పాఠాలు ఒక్కటైన నేర్చుకున్నదే
ఆరో అడుగు.
పడిలేచే ఊపిరి సెగ వేగమే
ఏడో అడుగు.
ఆ వేగం వెనుక గెలుపు గుర్రంలా వచ్చేదే
ఎనిమిదో అడుగు.
నిన్ను వీడే నీడ నీ కాళ్లు దాటిపోలేనిదే
తొమ్మిదో అడుగు.
ఇలా నీకు తెలియకుండా గెలుపు అడుగుకై
వేసిన అడుగులు ఎన్నో ఇంకెన్నో

అంజి, ఎస్ఎస్వీపీ

## కథ

‘ఆ గడియ రావాలి. మన చేతుల్లో ఏముంది?’ అనేది అమ్మ.

భారం ఎవరి మీదో పెట్టడం సరైనది కాదు. ప్రయత్న లోపం ఉండకూడదు. నిజానికి అదే కొంప ముంచింది. విపరీత జాప్యానికి కారణమైంది. కొన్ని జీవితాలంతే.

‘ఏ వయసులో జరిగే ముచ్చట ఆ వయసులో జరిగిపోవాలి. కొంచెం తొందర పడాలి’ ఇదీ అమ్మ మాటే. కొన్ని జీవితాల్లో అన్నీ సక్రమంగా జరిగిపోవు. ఆ తర్వాత ఇక మాటలు అనడానికి అమ్మ లేదు. హఠాత్తుగా ఈ లోకం విడిచిపెట్టి పోయింది. గడిచిన కాలం తిరిగి రాదు. నన్ను తొందర పెట్టేవారు లేరు. పైగా చెల్లెళ్ల బాధ్యత నెత్తి మీద పడింది.

నా చూపు పెళ్లి వైపు వెళ్లలేదు. తర్వాత కాలంలో రేవతిని ఇష్టపడ్డాను. రేవతి అందమైంది. కాని దురదృష్టవంతురాలు. ఆమెకు నాకూ పదేళ్ల ఎడం ఉంది.

రేవతికి పెళ్ళైంది. ఆ తరువాత మూడు మాసాలకే రేవతి భర్త ప్రమాదంలో చనిపోయాడు. ఆమె ఉద్యోగం చేస్తోంది. బుర్ర నిండా పాతకాలం నాటి భావాలు. ఆమె బాల్యం..ఇరుకు ఇంటిలో కురచ మనస్తత్వాల మధ్య గడిచింది. సొంత ఆలోచనలతో ఎదగనివ్వని ఇంటి పరిసరాలు. తాతగారి బామ్మగారి భావాలు పేరుకు పోయాయి. దాంతో చదువుకున్నప్పటికీ అవి వదలలేదు.

చుట్టూరా ఆధునిక నాగరికత. రేవతి పట్టించుకోదు... మారదు. కాలం గడుస్తున్నా ఇంకా విషాదాన్నే అనుభవిస్తోంది. దుఃఖాన్నే మోస్తోంది. తన బతుకు అలా రాసిపెట్టి ఉందని నమ్ముతుంది. తలరాత...ఏం చేయలేం అనుకుంటుంది.

రోజులు నెలలు సంవత్సరాలుగా గడిచిపోయాయి. నాది ఉపాధ్యాయ వృత్తి. అభ్యుదయ భావాలు నావి. వృత్తి పట్ల నిబద్ధత ఉంది. పాఠాలతోపాటు సమయం వచ్చినపుడు మూఢవిశ్వాసాల్ని ఖండించే మాటలు చెబుతాను. కుటుంబ బాధ్యతలు తీరేటప్పటికి వివాహ వయసు దాటిపోయింది.

రేవతి పట్ల జాలి కాదు. ప్రేమ ఉంది. పరిచయం పెరిగే కొలదీ ఆమె అంటే ఇష్టం మరింత పెరిగింది. ఒకరోజు నా మనసులో మాట చెప్పేశాను. భోరుమని ఏడ్చింది. కన్నీళ్లు బొటబొటా కారాయి. రోషంతో కళ్లు ఎర్రబడ్డాయి. పెళ్లి మాట ఎత్తడంతో ఆమెకు నా పట్ల ఉన్న గౌరవభావం ఎగిరిపోయింది.

“దురదృష్టం వెంటాడింది. శాపగ్రస్తురాలను. నా జీవితం ఇక ఇంతే. రవి జ్ఞాపకాలతో బతకడమే. మరో తలంపు లేదు. దయచేసి నా మానాన



నన్నుండనీయండి. ఆశలు రేపకండి” చేతులు జోడించింది.

“మరో రెండేళ్లలో ఇరవై ఒకటో శతాబ్దం వస్తుంది. నేలపై నిలబడి బతుకు బాట ఎంచుకోవాలి. ఎల్లకాలం ఇలా ఉండిపోవడం మంచిది కాదు. నిన్ను నేను ఉద్ధరించడం కోసం కాదు. నీ ఆలోచనలు గతకాలానివి. నిన్ను ఒత్తిడి చేయను. ఇంత చదువుకున్నదానివి. తీరిగ్గా ఆలోచించు” నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

అపుడు రేవతి అంది కదా– “మూడుమాసాల దాంపత్య జీవితం నాది. మధుర స్మృతులున్నాయి. అవి చాలు. మీరు చెప్పింది గుర్తుంది నాకు. మీ బంధువర్గంలో ఒకామె పదేళ్లలోపు వయసులో భర్తను కోల్పోతే ఏం చేసింది? ఎనభై ఏళ్లు తోడు లేకుండా బతికేసింది కదా” తల పట్టుకున్నాను. నా మాట తిరుగుతోంది.

నాకు ఉద్యోగ బదిలీ వల్ల ఊరు మారాల్సిన పరిస్థితి వచ్చింది. రేవతితో పరిచయం అందమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. నాకూ ఒకటొకటిగా కొన్ని సమస్యలు వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యాయి. చెల్లెలి కాపురం ఆందోళన కలిగిస్తోంది. ఆమె భర్త వాసు తాగుబోతు. సంసారాన్ని పట్టించుకోని దగుల్బాజీ. అదే ఊరికి బదిలీ కావడంతో అనేక విషయాలు వాళ్ల గురించి తెలిశాయి. చెల్లెలు హింస అనుభవిస్తోంది. ఎన్నిసార్లు వాసుకి చెప్పినా వినిపించుకోలేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. వాళ్ల కాపురం గాడిలో పడాలి.

రెండునెలల్లో దారుణం జరిగిపోయింది. ఒకరోజు చెల్లెలిని కొట్టుకుంటూ జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ గేటు బయటకు గెంటేశాడు వాసు. కనిపిస్తున్నాయి. పిట్టల అరుపులు వినిపిస్తున్నాయి.

సాయంత్రం గోదారి ఒడ్డుకెళ్లి కాసేపు కూచోవడం అలవాటైంది. ఈరోజు వెళ్లలేదు. పుస్తకం పట్టుకున్నాను. లీనమై పోయాను. అడివిలో తిరుగాడు తున్నట్లుంది. సరిగ్గా సత్తిబాబు అప్పుడొచ్చాడు.

సత్తిబాబు నాకు స్నేహితుడే. పెళ్లి సంబంధాలు కుదురుస్తుంటాడు. పెండ్లివారి స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తాడు. డాబుగా ఉంటాడు. పెద్దవాళ్లతో పరిచయాలు ఎక్కువ. లౌక్యంగా మాట్లాడతాడు.

“ఇది విన్నావా?” అన్నాడు వింతగా ముఖం పెట్టి. పుస్తకం మూసి ఏమిటన్నట్టు చూశాను. ఇక పఠనం సాగదు. చదివే పేజీ దగ్గర మడిచి పుస్తకాన్ని ఎదురుగా ఉన్న స్టూలు మీద పెట్టాను.

సత్తిబాబు తీరిగ్గా జేబులోంచి చిన్న నోటు బుక్ తీసి ఏదో రాసుకుంటున్నాడు. చిరాకు పడ్డాను.



# జీవితం ముఖ్యం

## దాట్ల దేవదానం రాజు

నాకే అప్పగించింది. అయినా కాసేపటికి తేరుకుని చెప్పాను. అమాయకత్వం ముసుగుల్ని తొలగించే పని ఆఖరి నిమిషం వరకూ చేయాల్సిందే. పోటెక్కిన గోదారి ఉధృతి సమయంలో సుడులు గుండాలుగా తిరుగుతాయి. రోజులు గడిచేకొలదీ మళ్లీ మామూలే. అప్పటి వరకు పరిస్థితులు అర్థం కావు.

“జీవితాంతం తలపులు మన వెంటరావు. మరీ దుఃఖపూరితంగా మారితే వదిలించుకునే సాధన చేయాలి. అవకాశం ఉన్నపుడు జీవితాన్ని మళ్లీ అందుకోవాలి. ఎదుటివారికి ఒక సందేశం ఇవ్వాలి” ఈ మాటలు అని ఊరుకున్నాను. వాడిన పూలకు పరిమళం ఎక్కడిదని నేనింతేనని నిశ్శబ్దంగా ఉండిపోయింది. అప్పట్నుంచీ రేవతి తప్పించుకుని నలుగురూ చూస్తుండగా జరిగిన ఘోరం ఇది. అకారణంగా జరిగిన సంఘటన. రమ కోపంతో ఊగిపోయింది. కానీ అశక్తురాలు. అవమానభారంతో నిస్సహాయంగా బేల చూపులతో నిలుచుండి పోయింది. పిల్లలు చిన్నవాళ్లని, వాళ్లకు తన అవసరం ఉందని మరచిపోయింది. కఠిన నిర్ణయం తీసుకుంది. ఆవేశంతో క్షణం కూడా ఆలోచించకుండా ఈ లోకం నుండి నిష్క్రమించింది.

బలవంతంగా ప్రాణాలు తీసుకోవడమేంటి? పిల్లలున్నారన్న గ్రహింపు ఉండొద్దా? ఆత్మహత్య ఎప్పటికీ పరిష్కారం కాదు. మానసిక ఒత్తిడిని కొన్ని క్షణాలు దాటగలిగితే ఇట్లాంటి అనర్థాలు జరగవు.

కొన్నాళ్ల పాటు చెల్లెలి జ్ఞాపకాలు బాధించాయి. చేరువలో ఉండి కూడా ఏమీ చేయలేకపోయాను.

ఒకనాటి సాయంత్రం...

నెమ్మదిగా చీకట్లు అలముకుంటున్నాయి. కేశవరెడ్డి నవల చదువుకుం టున్నాను. ముసలోడి ఆతురత పంది కూనల్ని రక్షించుకోవాలనే తపన ఉత్కంఠ కలిగిస్తోంది. అక్షరాలు కాదు దృశ్యం కళ్ల ముందుంది. చుట్టూ రకరకాల చెట్లు ఉక్కగా ఉంది. పైగా ట్యూబులైటు వెలుగుల్ని ఆకర్షించిన రెక్కల పురుగులు మూగుతున్నాయి. తటాలున లేచి లైటు ఆర్పేశాను. వెలుగుల్ని వెతుక్కుంటూ రయ్యిమని బయటకు పోతున్నాయి. మేం మాత్రం చీకటిలో ఉండి పోయాం. ముఖాలు కనపడటం లేదు. సత్తిబాబు ఏం చెప్పబోతున్నాడు?

“నామావారి వీధిలో ఉండే సుందరం మాష్టారి భార్య మళ్లీ పెళ్లి చేసుకుంటుందట. ఆయన పోయి మూడునెలలు కూడా అవ్వలేదు. వయసేమో ఏభై ఐదు. ఆవిడగారికి ఇపుడు పెళ్లి కావాల్సి వచ్చింది. లోకం మారిపోయింది. పిదప కాలం వచ్చేసింది” దీర్ఘంగా రాగాలు తీస్తూ అన్నాడు.

“ఇందులో తప్పేముంది? తోడు అవసర మైందేమో. నీవే ఏదైనా సంబంధం చూడు” నెమ్మదిగా అన్నాను.

“ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో ఉంటున్నాడు. వాడి దగ్గరకు పోయి హాయిగా మనుమలతో గడపొచ్చు కదా! ఇక నేను సంబంధం చూడటమా? చాల్లే...అయినట్లే. బోలెడు షరతులు ఉన్నాయి. ‘వరుడు కావలెను’ అని ప్రకటన ఇచ్చింది. ఇదిగో

నీవే చూడు. అభ్యుదయ భావాలు కలిగి ఉండాలట. అర్థం చేసుకునే మనసు ఉండాలట. విద్యావంతుడై ఉండాలట" నలిగిన కాగితాన్ని తన కుర్తా పక్క జేబు లోంచి తీసిచ్చాడు.

లేచి వెళ్లి లైటు వేశాను. చదివాను. అందులో సావిత్రి అనే ఆవిడకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉన్నాయి. వెంటనే ఆ కాగితాన్ని సాపుచేసి సెల్‌లో ఫొటో తీసుకున్నాను. సత్తిబాబు తెల్లబోయి చూస్తున్నాడు.

"ఏం మాట్లాడమంటావా? ఆఖరికి నీ గతి అంతేలే. జీవితకాలం లేటు అంటే ఇదే" వెటకారంగా అన్నాడు. మౌనంగా కూర్చున్నాను. అన్యమనస్కంగా ఉండిపోయాను. కాసేపు అవీ ఇవీ మాట్లాడి వెళ్లిపోయాడు.

మర్నాడు యధాప్రకారం గోదారి ఒడ్డున కూర్చున్నాను. పశ్చిమాన సూర్యుడు ఎర్రగా పెద్దగా చుట్టూ సిందూరం చీర కప్పుకుని గోదారిలో మునగడానికి సిద్ధంగా ఉన్నాడు. అస్తమించే ముందర పలుచని కిరణాలు నదిపై సగ్గు బియ్యం వడియాలు ఎండబెట్టినట్టు మెరుస్తున్నాయి. నాలో ఒక ఆలోచన మెరిసింది. గంట తర్వాత వెన్నెల పాక్కుంటూ నీడల జాడలతో వాలింది.

నా వ్యక్తిత్వాన్ని తడిమి చూసుకున్నాను. సావిత్రిని కలవాలి. నాలో ఆమె కోరుకున్న లక్షణాలున్నాయి. చూడాలి. జీవిత చరమాంకంలో వెన్నెల కురుస్తుందేమో.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఎప్పుడూ లేనిది గుండె చిత్రంగా కంపిస్తోంది. దేహంలో తెలియని అలజడి. హృదయ కవాటాలు తెరుచుకుని ఏవో సందేశాన్ని స్తున్నాయి. ఇదంతా నిజమేనా? భ్రాంతియేనా? నేల మీద నిలబడే ఉన్నానా? భాషకు అందని భావంతో కొట్టుమిట్టాడుతున్నాను.

తెల్లారింది. ఎన్నాళ్లుగానో వేచిన ఉదయం ఈనాడే ఎదురౌతున్నట్లుంది.

జుట్టుకు నల్లరంగు వేసుకున్నాను. నచ్చిన బట్టలు కట్టుకున్నాను. వడలినట్లు కనిపించకూడదని హుందాగా హుషారుగా కనపడాలని. సన్న గదులున్న తెల్ల చొక్కా, నల్లని ఫాంటు. అద్దం ముందు నిలబడ్డాను. తేజోవంతమైన రేఖలు ముఖంలో తారాడాయి. చెప్పకుండా వెళ్లడం భావ్యం కాదనుకున్నాను. ఆమెకు వెంటనే ఫోను చేశాను. రింగయింది. ఎత్తలేదు.

పావుగంట గడిచింది. మళ్లీ ప్రయత్నం చేద్దామనుకునేంతలో ఫోను మోగింది. ఆమె నుంచే. విషయం చెప్పి ఇంటికి వస్తున్నానని చెప్పాను. గంటసేపు ఆగి రమ్మని చెప్పారు. చిత్రమైన అనుభూతి. నేను నేనేనా?

గంటంటే అరవై నిమిషాలు. భారంగా గడిచింది. ఎక్టివాపై బయలుదేరాను. ఆ ఏరియా తెలుసు.



ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఎప్పుడూ లేనిది గుండె చిత్రంగా కంపిస్తోంది. దేహంలో తెలియని అలజడి. హృదయ కవాటాలు తెరుచుకుని ఏవో సందేశాన్నిస్తున్నాయి. ఇదంతా నిజమేనా? భ్రాంతియేనా? నేల మీద నిలబడే ఉన్నానా? భాషకు అందని భావంతో కొట్టుమిట్టాడుతున్నాను.

ఊరికి కొంచెం దూరం. సులువుగానే ఇంటి జాడ తెలుసుకున్నాను.

చిన్న ఇల్లు. చుట్టూ ఖాళీ స్థలం. రకరకాల పూలమొక్కలతో నిండి ఉంది. పరిమళభరితమైన స్వచ్ఛమైన గాలి. కాలింగ్ బెల్ కొట్టగానే తలుపు తెరుచుకుంది. ఆమె లోపలకి ఆహ్వానించారు. గదిలోకి అడుగు పెట్టాను. కింద ఆకుపచ్చని తివాసీ. సోఫా సెట్టు. మధ్యగా గాజుబల్ల. దాని మీద కూజా ఆకారంలో అందమైన ఫ్లవర్‌వాజ్‌లో ఎప్పటికీ వాడని పూలు. చుట్టూ పరికించాను.

గది స్వచ్ఛంగా శుభ్రంగా ఉంది. గోడలపై ఆధునిక పెయింటింగులున్నాయి. అడుగడుగునా కళాహృదయంతో తీర్చిదిద్దినట్లుంది. మాష్టారి అభిరుచేమో అనుకున్నాను. కాదట. తర్వాత చెబితే తెలిసింది అన్నీ తన ఇష్టాలే అంట.

ఇంటిని చూసింతర్వాత రాకూడని చిరునామాకు వచ్చానేమోనని శంకించాను.

మంచినీళ్లు తీసుకొచ్చి ఇచ్చారావిడ. ఆమె కళ్లల్లో కాంతి ఉంది. ముఖంలో ఒకవిధమైన కళ ఉంది.

కుటుంబ విషయాలు, అభిరుచులు గురించి మాట్లాడుకున్నాం. ఇన్నాళ్లూ పెళ్లి చేసుకోకపోవడానికి కారణాలు చెప్పాను. భర్త చనిపోయిన వెంటనే పెళ్లికి సిద్ధం కావడం గురించి ఆవిడ చెప్పారు. ఇది మాష్టారి కోరికట.

ఒంటరిగా ఉండొద్దని తోడు వెతుక్కుని జీవితం సాగించాలని చెప్పారట. అది కూడా కాలయాపన చేయకుండా జరగాలన్నారట. వారి అబ్బాయి అంగీకారంతోనే సిద్ధపడుతున్నానని చెప్పారు.

గంటయ్యింది. మరల మర్నాడు కలుద్దామని చెప్పాను.

"మర్నాడే కాదు వారం రోజుల పాటు కలుద్దాం. మీకేమైనా అభ్యంతరమా?" వెళ్లబోతుండగా అన్నారు. "తప్పకుండా" అన్నాను వెనక్కి తిరిగి చిరునవ్వుతో.

ఆ వారం రోజులూ ప్రతి క్షణమూ దివ్యమైనదే. మధుర జ్ఞాపకాల దొంతరే. అనుభవాల పలవరింతలే. ఇష్టాయిష్టాల మదింపులే. నిస్సంకోచంగా అభిప్రాయాల కలబోతలే.

"చెల్లెల పిల్లలు ఇద్దరున్నారు. వాళ్ల ఆలనా పాలనా నేనే చూసుకోవాలి' ఒకరోజున చెప్పాను.

"మొక్కలన్నా పిల్లలన్నా నాకిష్టమే" ఒక్కసారిగా పూలవనంలోంచి పరిమళ మంతా గదిలోకి వచ్చినట్లయింది. నా పెదాలు మొగ్గ నుంచి విచ్చుకున్న పూవులా మారాయి. ముఖం దీపావళి మతాబులా వెలిగింది. మనసు ఆనంద తరంగమైంది.

పెళ్లి నిరాడంబరంగా సన్మిత్రుల సమక్షంలో జరిగింది.

సావిత్రి అక్క కూతురే రేవతి. పెళ్లికి రమ్మని పిలిచినా రాలేదు.

'ఈ వయసులో మళ్లీ పెళ్లేంటి? బుద్ధుందా?' తిట్టి పోసింది. కోపగించుకుంది. రానని కచ్చితంగా చెప్పేసింది. గమ్మత్తేమిటంటే సావిత్రిని పెళ్లి చేసుకున్నది నేనని రేవతికి తేలీదు. వారం రోజుల వ్యవధిలో ముహూర్తం కుదిరింది. రేవతికి తెలిసే అవకాశం లేకుండా అంతా ఇట్టే జరిగిపోయింది.

రేవతి ఒకరోజు అకస్మాత్తుగా వచ్చింది. నన్ను బాబాయి స్థానంలో చూసి ఆశ్చర్యపోయింది.

"ఆఖరికి నువ్వు కూడా..." అంటూ ఆగిపోయి "ఎన్నో అడుగులు ముందుకేసావ్..పిన్నీ" ఉద్వేగంగా చేతులు పట్టుకుని ఊపింది. వెంటనే తేలికపడలేక పోయింది. నా కళ్లలోకి సూటిగా చూడలేకపోయింది.

'అర్థంపర్థం లేని పాత భావాలు నావి. కొత్త ఆలోచనలు దరి చేరనీయక పోవడం తప్పే. మనం స్వీకరించాలే గానీ అవతలి కొస అందేంత దూరం లోనే ఉంటుందని తెలుసుకోలేకపోయాను' అని సన్నగా గొణుక్కుంది.

'కాలం మారితే సరిపోదు. మనుషులూ మారాలి. ఒక మూస లోంచి బయటపడాలి. ఏ నిర్ణయం తీసుకున్నా జీవితం ముఖ్యమనే సంకల్పం చెప్పుకోవడం అవసరం' అనుకున్నాను.

వచ్చేవారం కథ..

**లోగుట్టు**

- దేశరాజు



ఇన్ డోర్ గేమ్స్‌కే మకుటాయమానంగా నిలిచే బిలియర్డ్స్ అండ్ స్నూకర్ లో భారత దిగ్గజ ఆటగాడు, 40 ఏళ్ల పంకజ్ అద్వానీ జైత్రయాత్ర కొనసాగుతోంది. ప్రపంచ బిలియర్డ్స్ చరిత్రలోనే అరుదైన ఘనత సాధించాడు. 28వసారి విశ్వవిజేతగా నిలవడం ద్వారా రికార్డుల మోత మోగించాడు.



# ప్రపంచ బిలియర్డ్స్ 'శిఖరం' పంకజ్ అద్వానీ

బిలియర్డ్స్- స్నూకర్ ప్రపంచ పోటీలలో భారత ఆధిపత్యం కొనసాగుతోంది. భారత ఎవర్ గ్రీన్ స్టార్ పంకజ్ అద్వానీ 28వ సారి విశ్వవిజేతగా నిలవడం ద్వారా తనకు తానే సాటిగా రికార్డుల్లో చేరాడు. గత 30 సంవత్సరాలుగా క్యూ-స్పోర్ట్ జీవితంగా చేసుకొన్న పంకజ్ బిలియర్డ్స్‌లో మాత్రమే కాదు... స్నూకర్ గేమ్ లోనూ ప్రపంచ విజేతగా చరిత్రను తిరగరాస్తూ వస్తున్నాడు.

**విశ్వవిజేతలకు చిరునామా భారత్...**

భారత్‌లో అన్ని రకాల క్రీడలూ దేనికదే ప్రత్యేకం. జాతీయక్రీడ హాకీతో పాటు అనధికారిక జాతీయక్రీడ క్రికెట్, కుస్తీ, విలువిద్య, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ లాంటి ఎన్నో రకాల క్రీడలు ఉన్నా, దేశానికి అత్యధిక ప్రపంచ టైటిల్స్, బంగారు పతకాలు అందించిన ఏకైక క్రీడ క్యూ స్పోర్ట్ (బిలియర్డ్స్ అండ్ స్నూకర్) మాత్రమే. రాయల్ గేమ్‌గా పేరుపొందిన దీనికి ప్రపంచ ప్రధాన క్రీడల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. ఇంగ్లండ్, భారత్, సింగపూర్, చైనా, మాల్టా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్, కెనడా, మియన్మార్, థాయ్ లాండ్ లాంటి దేశాలలో విశేష ఆదరణ పొందుతున్న ఈ క్రీడలో అత్యధిక ప్రపంచ టైటిల్స్ గెలుచుకొన్న దేశం భారత్ మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా 90 దేశాలలో 10కోట్ల 20 లక్షల మంది పురుషులు, మహిళలు బిలియర్డ్స్, స్నూకర్ క్రీడలు ఆడుతుంటే, 45కోట్ల మందికి పైగా అభిమానులున్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే మనదేశంలో బిలియర్డ్స్ అండ్ స్నూకర్ క్రీడ తన ఉనికిని చాటుకుంటోంది. 1920లో భారత క్రీడారంగంలోకి దూసుకొచ్చిన ఈ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ క్రీడల్లో... విల్సన్ జోన్స్, మైకేల్ పెరెరా, గీత్ సేథీలాంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లను అందించింది. అశోక్ శాండిల్యా, సుభాష్ అగర్వాల్ లాంటి ఛాంపియన్ క్రీడాకారులు వచ్చినా... బెంగళూరు సంచలనం పంకజ్ అద్వానీని మించిన మొనగాడు మరొకరు లేరని అతని విజయాలు, రికార్డులే చెబుతున్నాయి.

**ఇంటి గెలిచి, రచ్చ గెలిచిన పంకజ్...**

పదిసంవత్సరాల చిరుప్రాయంలోనే క్యూస్పోర్ట్ లో ప్రవేశించిన పంకజ్ అద్వానీ ..12 ఏళ్ల వయసు నుంచే జాతీయ టైటిల్స్ సాధించడం ఓ ఆలవాటుగా మార్చుకొన్నాడు. గత 28 ఏళ్లుగా ప్రపంచ టైటిల్స్ గెలుచుకొంటూనే వస్తున్నాడు. జూనియర్ స్థాయిలో ఏడు బిలియర్డ్స్, నాలుగు స్నూకర్, సీనియర్ విభాగంలో 9 బిలియర్డ్స్, 11 స్నూకర్ ట్రోఫీలు అందుకొన్నాడు.

**2003 నుంచి 2024 వరకూ....**

పంకజ్ అద్వానీ... తొలిసారిగా 2003లో ప్రపంచ స్నూకర్ టైటిల్ సాధించడం ద్వారా తన జైత్రయాత్రకు శ్రీకారం చుట్టాడు. 2003-2018 మధ్య కాలంలో మొత్తం 18 ప్రపంచ టైటిల్స్, 2024 వరకూ 28 ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్స్ గెలిచి, భారత క్రీడాచరిత్రలోనే అత్యధిక ప్రపంచ టైటిల్స్ సాధించిన ఏకైక క్రీడాకారుడిగా రికార్డుల్లో చోటు సంపాదించాడు. బిలియర్డ్స్ 150 పాయింట్ల ఫార్మాట్‌తో పాటు.. టైమ్ ఫార్మాట్ విభాగాలలోనూ పంకజ్ అద్వానీ తిరుగులేని మొనగాడుగా గుర్తింపు పొందాడు.

2005, 2008, 2014, 2016, 2017 2018 సంవత్సరాలలో పంకజ్ అద్వానీ 150 పాయింట్ల ఫార్మాట్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమే కాదు...టైమ్ ఫార్మాట్లోనూ 2005, 2007, 2008, 2009, 2012, 2014, 2015 సంవత్సరాలలో విశ్వవిజేతగా నిలిచాడు. ఖతర్ రాజధాని దోహా వేదికగా ముగిసిన 2024 ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్ పోరులో ఇంగ్లండ్ కు చెందిన రాబర్ట్ హాల్ తో జరిగిన హోరాహోరీలో 4-2 (151(71)-94(87), 151(147)-0, 150-84, 74(74)-151(151), 6-154(154), 152 (105)-46 ) విజేతగా నిలిచాడు.

**స్నూకర్ విభాగంలోనూ అదేజోరు....**


స్నూకర్ విభాగంలో 2003, 2015 సంవత్సరాలలో విశ్వవిజేతగా నిలిచిన పంకజ్.. ప్రపంచ సిక్స్ రెడ్ స్నూకర్ టైటిల్స్‌ను 2014, 2015 సంవత్సరాలలో నెగ్గడమే కాదు..2014లో ప్రపంచ టీమ్ బిలియర్డ్స్ టైటిల్‌ను సైతం భారత్‌కు అందించాడు. 2006 దోహా ఆసియా క్రీడలు, 2010 గాంగ్జు ఆసియా క్రీడల్లో బంగారు పతకాలు సాధించాడు. 28 సంవత్సరాల తన క్రీడాజీవితంలో 55 బంగారు పతకాలు,31 జాతీయ టైటిల్స్, 28కి పైగా ప్రపంచ టైటిల్స్ సాధించి....భారత క్రీడాచరిత్ర లోనే మరే క్రీడాకారుడూ సాధించని ఘనతను సొంతం చేసుకొన్నాడు.

**అవార్డులే అవార్డులు!**

క్రికెట్టే మతంగా భావించే మనదేశంలో బిలియర్డ్స్ అండ్ స్నూకర్ క్రీడల ద్వారా పంకజ్ అద్వానీ పలురకాల క్రీడా, పౌరపురస్కారాలు అందుకొన్నాడు. 2004లో అర్జున అవార్డు, 2005- 06లో దేశఅత్యున్నత క్రీడాపురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్ రత్న, 2007 లో ఏకలవ్య పురస్కారం, 2009లో పద్మశ్రీ పురస్కారం...ఒకదాని వెనుక ఒకటిగా వచ్చి పంకజ్ అద్వానీని వరించాయి. భారత క్యూ స్పోర్ట్ చరిత్రలో మాత్రమే కాదు...ప్రపంచ బిలియర్డ్స్, స్నూకర్ క్రీడల చరిత్రలోనూ...పంకజ్ అద్వానీ ఓ అసాధారణ, అరుదైన క్రీడాకారుడిగా, క్యూ స్పోర్ట్ కే పర్యాయపదంగా మిగిలిపోతాడు. ★



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969







# కందకుర్తిలో దత్తన్న

**కందకుర్తి :** ఆర్ఎస్ఎస్ సంస్థాపకులు డా. హెడ్గేవార్ పూర్వీకుల గ్రామం కందకుర్తిని నవంబర్ 10వ తేదీన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ (ఇందూరు జిల్లా) సందర్శించారు. కార్తిక మాసం సందర్భంగా త్రివేణి సంగమం గోదావరి నది హారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కందకుర్తి సేవాసమితి ఆధ్వర్యంలో కేశవ శిశుమందిర్, కేశవ స్మృతి మందిర్, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ భవన నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ శాసనసభ్యులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇందూరులో కళాశాల విద్యార్థుల శిబిరం

**ఇందూరు :** విభాగ్ కళాశాల విద్యార్థుల (కార్యకర్తలు) శిబిరం నవంబర్ 9,10 తేదీలలో ఇందూరులో జరిగింది. 354 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా ఇందూరు నగర స్వయంసేవకులతో మూడు స్థలాల నుండి పథసంచలన్ ప్రారంభమై శివాజీ చౌక్ వద్ద మూడు సంచలన్‌లు కలిశాయి. చివరగా శంకర్‌భవన్ పాఠశాల మైదానంలో సార్వజనికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సహప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ ప్రధానవక్తగా పాల్గొన్నారు. పథసంచలన్‌లో పాల్గొన్న మొత్తం సంఖ్య 743, సార్వజనికోత్సవంలో పాల్గొన్న గణవేష్‌ధారి స్వయంసేవకుల సంఖ్య 1185, కార్యక్రమాన్ని వీక్షించిన పురుషులు, మహిళలు 946, మొత్తం సంఖ్య 2131.

# రాజమండ్రిలో మేధావుల సదస్సు

**రాజమండ్రి :** సమాలోచన ఆధ్వర్యంలో రాజమండ్రి, హాస్పిన్ హోటల్‌లో నవంబర్ 6 'వికసిత్ భారత్ కోసం మేధావులపాత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ముఖ్యవక్తగా ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శాంతిశ్రీ, సమాలోచన కార్యదర్శి డాక్టర్ జె.సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
ప్రొఫెసర్ ఏ.మట్టారెడ్డి అధ్యక్షత వహించారు. ఇందులో 200 మందికి పైగా విద్యావంతులు మేధావులు, ఆలోచనాపరులు పాల్గొన్నారు.






# తెలంగాణలో విభాగ్‌వారీగా
# కళాశాల విద్యార్థుల (కార్యకర్తల) శిబిరాలు -నవంబర్ 9,10



**పాలమూరు :** విభాగ్ కళాశాల విద్యార్థుల (కార్యకర్తలు) శిబిరం చేవెళ్ల బీఎస్‌ఐటీ కళాశాలలో జరిగింది. ముఖ్యవక్తగా అఖిల భారతీయ కార్యకారిణి సదస్యులు భాగయ్య పాల్గొని మార్గదర్శనం చేశారు. ఈ శిబిరంలో 222 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శారీరక కార్యక్రమాలలో భాగంగా కబడ్డీ స్పర్థల దృశ్యం.





**నల్గొండ :** విభాగ్ కళాశాల విద్యార్థుల (కార్యకర్తలు) శిబిరం నల్గొండ, ఏకశిల ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగింది. శిబిరంలో 234 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సార్వజనికోత్సవంలో తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు శ్రీధర్‌రెడ్డి ముఖ్యవక్తగా పాల్గొన్నారు.





**భాగ్యనగర్ :** విభాగ్ కళాశాల విద్యార్థుల (కార్యకర్తలు) శిబిరం భాగ్యనగర్, అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యాకేంద్రంలో జరిగింది. శిబిరంలో 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు.

## ‘శంఖారావం’ సన్నాహక సమావేశం




**చిత్తూరు:** వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం బహిరంగసభ జనవరి 5,2025న విజయవాడలో జరుగుతున్న సందర్భంగా నవంబర్ 3న చిత్తూరులోని తిలక్‌భవన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధసంస్థల సమావేశం జరిగింది. ప్రభుత్వ నియంత్రణ నుండి హిందూ దేవాలయాలను విముక్తి కల్పించి స్వయంప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని కోరుతూ హైందవ శంఖారావం బహిరంగసభను విజవంతం చేయడంకోసం హిందువులందరు వేలాదిగా తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ సహకార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి పిలుపిచ్చారు. వీహెచ్‌పీ మహిళాప్రముఖ్ మురలమ్మ, విభాగ్ సంఘచాలక్ రవీంద్రన్, విభాగ్ ప్రచారక్ మల్లికార్జున్, జిల్లాకార్యవాహ హరికృష్ణ, జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి, ప్రాంత మహిళా సమన్వయప్రముఖ్ శ్రీదేవి, జిల్లా నలుమూలలనుండి హిందూ సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

# బాల జాగృతి


## తెలుసుకుందాం

## తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయం



సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ ప్రాంతంలో కొలువుదీరిన ప్రముఖ ఆలయమిది. త్రేతాయుగంలో జాబాలి మహర్షి తపస్సుకు మెచ్చిన ఆంజనేయుడు ఇక్కడ స్వయంభువుగా ఆవిర్భవించినట్టు చెబుతారు. 19 శతాబ్దం తొలినాళ్లలో ఓ భక్తుడికి ఆంజనేయుడు కలలో కనిపించి తన జాడను తెలియజేయడంతో, అప్పుడా భక్తుడు ఈ ప్రాంతవాసుల సహాయ సహకారాలతో నూతన ఆలయంలో స్వామికి పునఃప్రతిష్ఠ జరిపాడు. ఆనాటి నుంచి స్వామికి నిత్యపూజలు జరుగుతూ వస్తున్నాయి. ప్రతి మంగళ, శని వారాల్లో అనేక మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. ఇక్కడ హనుమజ్జయంతి, శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

## కథ | ప్రాణం తీసిన దురాశ



పూర్వం ఒక అడవిలో రెండు ఎద్దులు పోట్లాడుకుంటున్నాయి. రెండూ బలిసి ఉండడం వల్ల హోరాహోరీగా దెబ్బలాడుతున్నాయి.

రక్తం కారుతున్నా వెనక్కి తగ్గడం లేదు. ఆ రక్తం కిందపడి గడ్డకట్టసాగింది.

వాటి కొట్లాటను చూసిన నక్కకు సంతోషం కలిగింది.

కాసేపు ఆగితే ఆ రెండూ ఎద్దులు

## పద్యము



**లావుగలవాని కంటెను**
**భావింపగ నీతిపరుఁడు బలవంతుండౌ**
**గ్రావంబంత గజంబును**
**మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ!**

**భావం :** లోకమునందు శరీరబలమున్న వాని కంటే న్యాయంగా ఉండువాడు బలవంతుడని లెక్కించుకోవాలి. ఎట్లనగా పర్వతమంతటి ఏనుగు కంటెనూ, చిన్నవాడైన మావటివాడు అట్టిదానిని లొంగదీసుకొని ఎక్కుచున్నాడు కదా! కనుక శరీర బలము కలవాని కంటే బుద్ధి బలము కలవాడే నిజముగా బలవంతుడని అర్థము.

## శ్లోకము



**ఆసింధు సింధు పర్యంతా**
**యస్య భారత భూమికా**
**పితృభూః పుణ్యభూశ్చైవ**
**సవై హిందురితి స్మృతాః**

**భావం :** ఉత్తరాన సింధు నది నుంచి దక్షిణాన సముద్రం వరకు గల ఈ విశాల భారతదేశాన్ని పితృభూమిగా, పుణ్యభూమిగా తలచే వారినే హిందువులుగా భావిస్తారు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| బ్రసీలియా | మాల్దీవులు |
| బ్రసెల్స్ | పోలాండ్ |
| మనీలా | బ్రెజిల్ |
| మాలే | స్వీడన్ |
| వార్సా | ఫిలిప్పీన్స్ |
| స్టాక్‌హోమ్ | బెల్జియం |

సమాధానాలు : బ్రసీలియా–బ్రెజిల్; బ్రసెల్స్–బెల్జియం; మనీలా–ఫిలిప్పీన్స్; మాలే–మాల్దీవులు; వార్సా–పోలాండ్; స్టాక్‌హోమ్–స్వీడన్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు మోటూరి సత్యనారాయణ



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. ఫిబ్రవరి 2, 1902న కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో జన్మించారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. మహాత్మాగాంధీ, రాజేంద్రప్రసాద్‌లకు అత్యంత విశ్వాస పాత్రుడిగా పేరు తెచ్చుకున్నారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారు. 1950-52 మధ్య ఏర్పడ్డ తొలి పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగారు. మార్చి 6, 1995న మరణించారు.



చావడం ఖాయం. ఈలోగా నా ఆకలిని కిందపడిన రక్తంతో తీర్చుకోవాలి అనుకుంది.

రెండు ఎద్దులు వెనక్కి వెళ్లి వచ్చేలోగా రక్తాన్ని నాకేయాలనుకుంది.

అలా నెత్తురును నాకుతుండగా రెండు ఎద్దులు రివ్వున వచ్చి ఢీకొన్నాయి.

వాటి మధ్యలో ఇరుక్కున్న నక్క చచ్చిపోయింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. ఇటీవలి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుపొందారు?
2. మధ్యప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరు?
3. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?

జవాబులు : 1. డొనాల్డ్ ట్రంప్; 2. మోహన్ యాదవ్; 3. నవంబర్ 9.

## మెదడుకు మేత



నల్లకుక్కకు
నాలుగు చెవులు..
ఏమిటది?

జవాబు : రెండు

## మంచిమాట

అదృష్టాన్ని సరదాగా నమ్ముకో..
కష్టాన్ని పూర్తిగా నమ్ముకో..
విజయం నీదే!




# వారఫలాలు

18-24 నవంబర్ 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కుటుంబ సభ్యులు, స్నేహితులతో కొంత విభేదిస్తారు. విద్యార్థులకు కొంత నిరాశ. చిన్ననాటి స్నేహితులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపారులు సామాన్య లాభాలు అందు కుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, వైద్యరంగం వారికి విదేశీ పర్యటనలు వాయిదా. 20,21 తేదీల్లో శుభ వార్తలు. ధనలాభం. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

శుభవార్తా శ్రవణం. ఆదాయం మరింత పెరుగుతుంది. స్నేహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. సమాజంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వ్యాపారులు గతం కంటే పుంజుకుంటారు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ఉత్సాహం. 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్య సూచనలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. చాకచక్యంగా కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పాత బాకీలు కొన్ని వసూలయ్యే అవకాశం. వ్యాపారస్తులు గతం కంటే మెరుగైన లాభాలు. ఉద్యోగులకు ఉన్నతహోదాలు. రాజకీయవేత్తలు, కళాకారులకు అంచనాలు నిజమవుతాయి. 18,19 తేదీల్లో శారీరక రుగ్మతలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కుటుంబసమస్యలు తీరి ఉపశమనం లభిస్తుంది. గతంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు మార్చు కుంటారు. స్థిరాస్తి కొనుగోలులో ఆటంకాలు తొలగు తాయి. విద్యార్థులకు కొత్త ఆశలు. ఇంటి నిర్మాణా లకు శ్రీకారంచుడతారు. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు మంచి గుర్తింపు. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు సన్మానాలు, అవార్డులు రావచ్చు. 22,23 తేదీల్లో వృథాఖర్చులు. అనారోగ్యం. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

మీ ఆలోచనలు అమలు చేస్తారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. సంగీత, సాహిత్య విషయాలపై ఆసక్తి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. నిరుద్యోగుల నిరీక్షణ ఫలిస్తుంది. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు హోదాలు పెరిగే అవకాశం. పారి శ్రామిక వేత్తలు, కళాకారులు, రచ యితలకు పూర్వ వైభవం కలిగే సూచనలు. 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

మీ ప్రతి పాదనలు కుటుంబంలో అంగీకరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. విద్యార్థులు విదేశీ విద్యావకాశాలు పొందుతారు. వాహనసౌఖ్యం. వ్యాపారులు కొత్త భాగస్వాములను చేర్చుకుంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అవాంతరాలు. రాజకీయవేత్తలు, పరిశోధకులు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 19,20 తేదీల్లో ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయం గతంతో పోలిస్తే మెరుగ్గా ఉంటుంది. పోటీపరీక్షల్లో నిరుద్యోగులకు విజయం. దేవాలయాలు సందర్శిస్తారు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. ఉద్యోగులకు కొత్త హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితల ఆశలుఫలిస్తాయి. 18,19 తేదీల్లో బంధువులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. భూములు, వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు కలిసివస్తాయి. వ్యాపారులకు గతంకంటే మెరుగైన లాభాలు. ఉద్యోగులకు అనుకూల మార్పులు. రాజకీయవేత్తలు, పరి శోధకులు, రచయితలకు ఒక సమాచారం ఊరట నిస్తుంది. 20,21 తేదీల్లో ప్రయాణాలు వాయిదా. వృథా ఖర్చులు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆలోచనలు అమలులో ప్రతి బంధకాలు తొలగుతాయి. విద్యార్థులు, నిరుద్యోగులు కోరుకున్న అవకాశాలు సాధిస్తారు. వ్యాపారస్తులకు లాభాలు మరింత ఊరిస్తాయి. ఉద్యోగులు కొన్ని అవాంతరాలు ఎదురైనా అధిగమిస్తారు. రాజకీయవేత్తలు, పరిశోధకులు, క్రీడాకారులకు విదేశీ పర్యటనలు. 23,24తేదీలలో దూరప్రయాణాలు. బంధువర్గంతో విభేదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

పరిచయాలు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఒక ఆహ్వానం ఉత్సాహాన్నిస్తుంది. కాంట్రాక్టర్లకు అనుకూల సమాచారం. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారస్తులు లాభాల బాటలో నడుస్తారు. ఉద్యోగులకు హోదాలు పెరిగి ఊరట చెందుతారు. పారిశ్రామికవేత్తలు, రచయితలు, క్రీడా కారులకు పురస్కారాలు అందుకుంటారు. 23,24 తేదీల్లో దూరప్రయాణాలు. శివస్తుతి మంచిది.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వాహన,కుటుంబసౌఖ్యం. ప్రత్యర్థులను కూడా ఆకట్టుకుంటారు. చిన్ననాటి స్నేహితుల నుంచి ఊహించని సహాయం అందుతుంది. వ్యాపారులు మరింతగా లాభపడతారు. ఉద్యోగస్తులకు అనుకూల మార్పులు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరి శోధకులు విదేశీ పర్యటనలు జరుపుతారు. 19,20 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

చేపట్టిన కార్యక్రమాలను శ్రమకోర్చి పూర్తి చేస్తారు. సమాజసేవలో భాగస్వాములవుతారు. ప్రత్య ర్థులను సైతం ఆకట్టుకుంటారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. వివాహయత్నాలు సానుకూలమవుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారస్తులకు ఊహించని లాభాలు అందే సూచనలు. 21,22 తేదీల్లో ఖర్చులు అధికం. ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

# పదరసం-488

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ | ■ | 4 | |
| | ■ | | ■ | 5 | | 6 | | | ■ |
| 7 | | | | | ■ | | ■ | ■ | 8 |
| | ■ | | ■ | | ■ | 9 | 10 | | |
| ■ | 11 | ■ | 12 | | | ■ | | ■ | ■ |
| 13 | | ■ | | ■ | ■ | 14 | | | 15 |
| | ■ | 16 | | | 17 | | ■ | ■ | |
| | ■ | ■ | | ■ | | ■ | ■ | 18 | |
| 19 | | 20 | ■ | ■ | 21 | | | | ■ |
| ■ | ■ | 22 | | | | ■ | ■ | 23 | |

## ఆధారాలు

**అడ్డం**

1) విరహం (4)
4) అనుకోని వ్యతిరేక సంఘటనవల్ల వచ్చే ఆశ్చర్యాన్ని దీనిని తినడం అంటారు (2)
5) అడ్డగించు (5)
7) విషయాలని మరచిపోయే జబ్బు (5)
9) ఎండాకాలం తరువాత "అటునుంచి" పడే వాన (4)
12) సంపెంగను ఇలాకూడా అంటారు (3)
13) బూరెలలో పూర్ణాన్ని కప్పిఉంచే మెత్తని పిండి (2)
14) ఎవరైనా వెళుతుంటే పలికేది (4)
16) వేషాలు, భేషజాలు (5)
18) చీలిక (2)
19) అటునుంచి క్రితం ఏడాది (3)
21) జాతకాలలో ఇది ఉండడంవలన వివాహాలు ఆలస్యమౌతాయట (4)
22) (సీతమ్మవారి) తండ్రి (4)
23) ఆశ్చర్యం, విస్మయం (2)

**నిలువు**

1) దూరపు ప్రాంతాలకు సరకులు పంపుట (4)
2) చేతబడి లాంటిది (4)
3) నెర్రె, పగులు (2)
4) ఇది మోగినట్లు బంగారం మోగదు (2)
5) ప్రాణప్రదం (4)
6) ఒక దక్షిణాది నది (3)
8) (సాధారణంగా) ముందరపళ్ళులేని నోరు పైకొచ్చింది (2)
10) గట్టి పడిన (అన్నపు) ముద్ద (3)
11) పరిమళం (2)
12) మాట్లాడడం (4)
13) రథం / బండి నడిపేవాడు (4)
14) అవకాశం, అదను (2)
15) పైకొచ్చిన బార్లీ గింజలు (3)
17) తోడల్లుడు (4)
18) వేదాలను నమ్మని ఒక వితండవాద మతం (3)
20) శూన్యం లోపించిన సత్యం (2)

## పదరసం - 487 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| తో[1] | క | చు[2] | క్క | ■ | ■ | క[3] | ర్యా | రం[4] | ■ |
| ట | ■ | ట్ట | ■ | రు[5] | క్మి | ణి | ■ | గ | ■ |
| మా[6] | ది | రి | ■ | తు | ■ | క[7] | మి | నా | అ |
| లి | ■ | కం[8] | దు[9] | కూ | రి | ■ | ■ | ధు | ■ |
| ■ | చ[10] | ■ | య్యి | ■ | ■ | చె[11] | ము | డు | ■ |
| ■ | వ | ■ | బ[12] | లు | సా | కు | ■ | ■ | సం[13] |
| ఆ[14] | ట | ప[15] | ట్టు | ■ | ■ | ము[16] | మ్మా | టి | కీ |
| న | ■ | లు | ■ | మ[17] | ■ | కి | ■ | ■ | ర్త |
| క[18] | ప్ప | ల | త | క్కె | డ | ■ | ఆ[19] | ర్జ | న |
| ట్ట | ■ | పె | ■ | లు | ■ | రె[20] | మ్మ | ■ | ■ |

సినిమా

# రోమాంచిత వీరగాథ జితేందర్ రెడ్డి



**గంజాయి వనంలో తులసి మొక్కలు చాలా అరుదుగా ఉంటాయి. కమర్షియలిజం బాట పట్టిన సినిమా రంగంలో సమాజ హితకరమైన సినిమాలూ అంతే! ఎప్పుడోగానీ రావు!! అలా వచ్చిన వాటిని సమాదరిస్తే మరిన్ని మంచి చిత్రాలు వచ్చే ఆస్కారం ఉంటుంది. అలాంటి తులసి మొక్కలాంటి చిత్రం ‘జితేందర్ రెడ్డి’. దేహానికి దివ్య ఔషధంలా తులసి ఎలా పనిచేస్తుందో... దేశ హితానికి ఇలాంటి సినిమాలు అలా బలాన్ని చేకూర్చుతాయి.**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తి స్వర్గీయ ముదుగంటి మల్లారెడ్డి. ప్రజా ప్రతినిధిగా రాజకీయాలలో ఉన్న మల్లారెడ్డి తన గ్రామానికే కాకుండా దేశానికి సేవ చేయాలనే తలంపుతో ఆ మార్గాన్ని వదిలి సంఘం బాట పట్టారు. ఆయన పెద్దకొడుకు జితేందర్‌రెడ్డి సైతం తండ్రి బాటలో సాగారు.

బాల్యంలో స్వయంసేవక్‌గా ఉన్న జితేందర్ రెడ్డి యుక్తవయసులో ఏబీవీపీలో బాధ్యతలను నిర్వర్తించారు. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ యువ మోర్చా క్రియాశీలక పాత్రను పోషించారు. అయితే 1980 ప్రాంతంలో తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన నక్సలైట్లకు ఇది కంటగింపుగా మారింది. జితేందర్ రెడ్డిని అడ్డు తొలగిస్తేనే తమ పనులు సజావుగా సాగుతాయని భావించారు. జగిత్యాలలో తమకు కంటిలో నలుసుగా మారిన ఆయనను హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ నక్సలైట్లకు కొందరు స్వార్థ రాజకీయ నేతలు దన్నుగా నిలిచారు. ఫలితంగా 1987 ఏప్రిల్ 9న జగిత్యాల ఊరు చివరిలో దారికాచి ఏకే 47 తుపాకీతో జితేందర్ రెడ్డిని నక్సలైట్లు కాల్చి చంపేశారు. తనపై జరిగిన దాడిని జితేందర్ రెడ్డి ధైర్యంగా ఎదుర్కొన్నాడు. దాదాపు రెండు గంటల పాటు నక్సలైట్లపై ఎదురుదాడి చేసి, చివరకు నేలకొరిగాడు. అలాంటి అమరవీరుడి కథను జితేందర్ రెడ్డి తమ్ముడు ముదుగంటి రవీందర్‌రెడ్డి సినిమాగా నిర్మించారు. పలు అడ్డంకులను ఎదుర్కొని నవంబర్ 8న ‘జితేందర్ రెడ్డి’ సినిమా జనం ముందుకు వచ్చింది.

తెలుగులో ఈ మధ్య కాలంలో బయోపిక్స్ బాగా జోరందుకున్నాయి. దేశానికి సేవ చేసిన గాంధీ, భగత్ సింగ్, ఖుదీరాం బోస్, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ వంటి వారి బయోపిక్స్ పలు భాషల్లో వచ్చాయి. అయితే దేశాన్ని పట్టి పీడిస్తున్న అంతర్గత శత్రువులైన నక్సలైట్లతో పోరాటం చేసిన వారి చరిత్ర ఇంతవరకు సినిమాగా రాలేదు. ఆ లోటును ‘జితేందర్ రెడ్డి’ చిత్రం తీర్చింది.

బాల్యంలో స్వయంసేవక్‌గా జీవితాన్ని ప్రారంభించిన దగ్గర నుండి నక్సల్స్‌తో పోరాడుతూ కన్నుమూసే వరకూ జితేందర్ రెడ్డి జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారు. చిన్నతనంలోనే నక్సల్స్ క్రూరత్వానికి బలైన ఓ కుటుంబాన్ని చూసి విచలితుడైన జితేందర్ రెడ్డి తీవ్రవాదులకు ఎలాగైనా బుద్ధి చెప్పాలనే నిర్ణయం తీసుకుంటాడు. దానికి తగ్గట్టుగా తనను తాను మలచు కుంటాడు. అదే సమయంలో నక్సలిజం పెచ్చరిల్లి ఆర్.ఎస్.ఎస్. స్వయం సేవకులను, ఏబీవీపీ విద్యార్థులను, కిసాన్ మోర్చా నాయకులను హతమార్చడం మొదలెట్టింది. తాను గురువుగా భావించే గోపన్నను, ఆయనతో పాటు రామన్నను నక్సల్స్ కాల్చి చంపడాన్ని జితేందర్ రెడ్డి సహించ లేకపోయాడు.

మరో పక్క తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి నక్సలైట్లు ఏబీవీపీ నాయకులు మధుసూదన్ గౌడ్ ను, సామ జగన్‌మోహన్ రెడ్డిని కూడా హత్య చేస్తారు. దాంతో నక్సలైట్లకు వారి పంథాలోనే గుణపాఠం చెప్పాలని జితేందర్ రెడ్డి భావిస్తాడు. ఈ క్రమంలో అతను చెల్లించిన భారీ మూల్యం ఏమిటనేదే ఈ సినిమా ముగింపు.

తండ్రి మల్లారెడ్డి నేతృత్వంలో జితేందర్ రెడ్డి బాధ్యత కల పౌరుడిగా ఎలా పెరిగి పెద్దవాడయ్యాడు? సమాజ హితం కోసం ఎలాంటి పోరాటాలు చేశాడు? అసాంఘిక శక్తులకు తన ప్రాణాలను పణంగా పెట్టి ఎలా బుద్ధి చెప్పాడు? అనే అంశాలను చాలా ఆసక్తికరంగా దర్శకుడు విరించి వర్మ తెరకెక్కించాడు. జితేందర్ రెడ్డి గన్ మేన్ పాయింట్ ఆఫ్ వ్యూలో కథను మొదలు పెట్టి ఆసక్తికరంగా ముందుకు తీసుకెళ్లారు. దాంతో ఇది డాక్యుమెంటరీలా కాకుండా రెగ్యులర్ సినిమాను చూస్తున్న భావనను కలిగించింది. ముఖ్యంగా దారితప్పిన నక్సలైట్ సిద్ధాంతాన్ని జితేందర్ రెడ్డి ఎండగట్టి, వారికి బుద్ధి చెప్పే సన్నివేశాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా జితేందర్ రెడ్డి నక్సల్స్‌తో పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన దృశ్యాలు కంటతడి పెట్టిస్తాయి. 1980 సమయంలో నక్సలైట్ల దాడికి గురై అసువులు బాసిన అమరవీరుల ఛాయా చిత్రాలను క్లైమాక్స్‌లో ప్రదర్శించడం ఎంతో బాగుంది. ఆ రకంగా వారందరికీ ఈ సినిమా ద్వారా నివాళులు అర్పించినట్టు అయ్యింది.

నటీనటుల విషయానికి వస్తే జితేందర్‌రెడ్డి పాత్రను చక్కగా ఆకళింపు చేసుకుని రాకేశ్ వర్రె అద్భుతంగా నటించాడు. ఈ తరం గుండెల్లో అతనే ఓ జితేందర్ రెడ్డిలా నిలిచిపోయాడు. ఇక ఇతర కీలక పాత్రలను సుబ్బరాజు, మేకా రామకృష్ణ, బిందు చంద్రమౌళి, ‘బలగం’ సుధాకర్ రెడ్డి, ‘ఛత్రపతి’ శేఖర్, రవిప్రకాశ్, వైశాలి రాజ్, రియా సుమన్, కిశోర్ కుమార్ పొలిమేర తదితరులు పోషించారు. గోపీసుందర్ స్వర పరిచిన పాటలు సందర్భాను సారంగా ఉన్నాయి.

ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే పాట రోమాంచితులను చేస్తుంది. రవీంద్ర గోపాల రాసిన సాహిత్యం అర్థవంతంగా ఉంది. సంభాషణలు బాగున్నాయి. జ్ఞానశేఖర్ తన కెమెరా పనితనాన్ని చూపించారు. సినిమాలోని ప్రతి సన్నివేశంలోనూ దర్శకుడు విరించి వర్మ పడిన కష్టం కనిపిస్తుంది. జాతీయ వాదులు ఈ సినిమాను ఓన్ చేసుకున్నట్టుగానే మిగిలిన వారూ స్పందిస్తే బాగుంటుంది. నిజానికి దేశం కోసం, ధర్మం కోసం ప్రాణాలను అర్పించిన జితేందర్ రెడ్డి లాంటి వారి సినిమాలు చూసి ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడికి ఉంది.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# అన్నకూట్ పూజ




గోవర్ధన్ పూజ లేదా అన్నకూట్ పూజను దీపావళి తరువాత మరునాడు కొన్ని ప్రాంతాలలో జరుపుకుంటారు. అంటే కార్తికమాసం, శుక్లపక్షం, ప్రతిపాద తిథికి ఈ పండుగ చేసుకుంటారు. ఈ సంవత్సరం నవంబర్ 1 సాయంత్రం 6.16కు ఆ తిథి ప్రవేశించింది. భక్తులకూ, పరమాత్మకూ మధ్య ఉండే అవినాభావ సంబంధానికి ప్రతీకగా ఈ ఉత్సవం జరుపుకుంటారు. కృష్ణుడికి దక్కుతున్న ప్రేమాభిమానాలకు ఓర్వలేక ఇంద్రుడు తీవ్రమైన వర్షాలు కురిపిస్తే, కృష్ణుడు గోవర్ధనమెత్తుతాడు. ఈ ఉత్సవం వెనుక స్ఫూర్తి అదే.




From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 04


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.90/-




వెల : ₹.390/-




వెల : ₹.220/-




వెల : ₹.360/-




వెల : ₹.200/-



వెల : ₹.360/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.90/-




వెల : ₹.100/-




వెల : ₹.250/-




వెల : ₹.799/-



వెల :₹.495/-



వెల : ₹.549/-



వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329, 8179163138
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687